సూర్య www.suryaa.com
17వ వసంతంలోకి...
www.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com
శనివారం | 23 మార్చి 2024 | హైదరాబాద్
సంపుటి 17 | సంచిక 148
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...
APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్
www.suryaepaper.com
చూడండి.

అనుగ్రహం
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు, పాల్గుణ మాసం శుద్ధ త్రయోదశి ఉ.7.26, పుబ్బ పూర్తి వర్జ్యం మ.1.39 నుంచి 3.25 వరకు
రాహుకాలం ఉ.6.00 నుంచి 7.30 వరకు, దుర్ముహూర్తం ఉ.7.46 వరకు

## ప్రధాని మోడీకి భూటాన్
# అత్యున్నత పౌర పురస్కారం

● 'ఆర్డర్ ఆఫ్ ది డ్రూగ్ గ్యాల్పో'ను అందించిన భూటాన్ రాజు ● కొవిడ్ మహమ్మారి సమయంలో 5 లక్షల టీకాలందిచారని ప్రశంసలు ● భూటాన్ ప్రధాని దాసో షెరింగ్‌తో ప్రధానీ మోడీ ద్వైపాక్షిక చర్చలు ● వివిధ రంగాల్లో ఇరు దేశాల సహకారం కోసం అవగాహన ఒప్పందాలు



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం భూటాన్ అత్యున్నత పౌర పురస్కారమైన 'ఆర్డర్ ఆఫ్ ది డ్రూగ్ గ్యాల్పో'ను అందుకున్నారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్ మోడీకి ప్రదానం చేశారు. ఈ పురస్కారం అందుకున్న తొలి విదేశీ ప్రభుత్వాధినేత నరేంద్ర మోడీ కావడం విశేషం. జీవితకాలంలో అత్యుత్తమ విజయాలు, సమాజానికి చేసిన సేవలకు గుర్తుగా ఈ పురస్కారం అందజేస్తారు.



6వ పేజీలో

# ఇస్రో మరో ఘనత

● పునర్వినియోగ రాకెట్ ప్రయోగం గ్రాండ్ సక్సెస్ ● కర్నాటకలోని చిత్రదుర్గ జిల్లా ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ నుంచి ప్రయోగం ● గాల్లోకి ఎగిరిన అనంతరం సురక్షితంగా రన్‌వేపై రాకెట్ ల్యాండింగ్

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో ఘనత సాధించింది. ఇస్రో తయారు చేసిన రీయూజబుల్ లాంచ్ వెహికల్ ప్రయోగం మంచి సక్సెస్ సాధించింది. శుక్రవారం ఉదయం కర్ణాటక లోని చిత్రదుర్గ జిల్లా ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ నుంచి ఈ ప్రయోగం నిర్వహించింది. గాల్లోకి ఎగిరిన అనంతరం ఈ రాకెట్ సురక్షితంగా రన్వేపై ల్యాండ్ అయింది. ఆర్ఎల్వీ ప్రయోగం ద్వారా అంతరిక్ష యాత్రల ఖర్చు తగ్గడంతో పాటు లాంచింగ్ రాకెట్లను తిరిగి వాడుకునేందుకు గానూ ఇస్రో ఈ ప్రయోగాన్ని చేపట్టింది.



6వ పేజీలో


## బీజేపీ నాలుగో జాబితా విడుదల



6వ పేజీలో

● సినీనటి రాధికకు ఎంపీ టికెట్ ● ఇప్పటికే మూడు విడతలుగా 275 మంది అభ్యర్థుల పేర్ల ఖరారు ● నాలుగో విడతలో 15 మంది ఎంపీ అభ్యర్థుల పేర్లు

## లాభాల్లో ముగిసిన మార్కెట్లు



5వ పేజీలో

● 191 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్ ● 85 పాయింట్లు పెరిగిన నిఫ్టీ ● మూడున్నర శాతం లాభపడ్డ మారుతి షేరు విలువ

## ఎమ్మెల్సీ కవితకు సుప్రీం షాక్



3వ పేజీలో

● చట్టం ముందు అందరూ ఒకటేనంటూ కోర్టు వ్యాఖ్య ● రాజకీయ నాయకులకు ప్రత్యేక విచారణలు ఉండవు

## నిరుద్యోగాన్ని నిర్మూలించాలి



6వ పేజీలో

● గ్రూప్ 1,2,3,4 పోస్టులను పెంచాలి ● టీచర్ పోస్టులను 25వేలకు పెంచాలి భర్తీ చేయాలి ● నిరుద్యోగుల సదస్సులో ఎంపీ ఆర్.కృష్ణయ్య

## లంచం అడిగింది
# నిజమే



6వ పేజీలో

● మద్యం విధానం రూపకల్పనలో కేజ్రీవాల్ ప్రత్యక్ష పాత్ర ● ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో మధ్యవర్తిగా విజయ్ నాయర్ ● కొందరు వ్యక్తులకు మేలు చేసేందుకు లంచం అడిగారని వెల్లడించిన ఈడీ

# అభ్యర్థుల వడపోత

● పతాకస్థాయిన కసరత్తు ● టికెట్ల వ్యవహారంలో జోక్యం చేసుకో వద్దంటూ మంత్రులకు అధిష్టానం దిశా నిర్దేశం ● ఎన్నికలు అత్యంత ప్రతిష్ఠాత్మకమైనవిగా భావిస్తున్న హైకమాండ్



3వ పేజీలో

కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థులను ఖరారు చేసేది పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంతడ్డేనా? అంటే, అవుననే సమాధానం వస్తున్నది. అభ్యర్థుల ఎంపికకు పీసీసీ, ఏఐసీసీ చేస్తున్న కసరత్తు అంతా నామ మాత్రమేనని కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## టీడీపీ మూడో
# జాబితా విడుదల

● జాబితాలో 11 అసెంబ్లీ, 13 పార్లమెంట్ అభ్యర్థులను ఖరారు చేసిన టీడీపీ ● పొత్తులో భాగంగా 144 అసెంబ్లీ, 17 పార్లమెంట్ స్థానాల్లో టీడీపీ పోటీ ● 5 శాసనసభ, 4 ఎంపీ స్థానాలను పెండింగులో పెట్టిన అధినేత చంద్రబాబు



2వ పేజీలో

తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల మూడో జాబితా విడుదలైంది. 11 శాసనసభ స్థానాలతో పాటు 13 ఎంపీ అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. పొత్తులో భాగంగా 144 అసెంబ్లీ, 17 పార్లమెంట్ స్థానాల్లో టీడీపీ పోటీ చేయనుంది. ఇదివరకే 128 శాసనసభ స్థానాలకు అభ్య ర్థులను ప్రకటించగా తాజాగా మరో 11 మందిని వెల్లడి ంచింది.

సూర్య వెబ్‌సైట్
సూర్య ఈ - పేపర్

## రాజకీయాలకు అతీతంగా
# రాష్ట్రాభివృద్ధి

● తెలుగుజాతిని నం.1గా నిలపడమే చంద్రబాబు విజన్ ● జగన్ విధ్వంసక పాలనతో 30 ఏళ్లు వెనక్కి వెళ్లిన ఏపీ ● దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మంగళగిరిని తీర్చిదిద్దుతాం ● బ్రేక్ ఫాస్ట్ విత్ లోకేష్ కార్యక్రమంలో యువనేత నారా లోకేష్

ప్రపంచంలో తెలుగువారు ఎక్కడ ఉన్నా నెం.1గా నిలపాలన్నదే చంద్రబాబు నాయుడు ఆలోచన అని, ఇందుకోసం ఆయన అహర్నిశలు కృాషిచేస్తూనే ఉంటారని యువనేత నారా లోకేష్ పేర్కొన్నారు.



2వ పేజీలో

## పిఠాపురం నుంచే
# పవన్ ప్రచారం



2వ పేజీలో

● పిఠాపురం అసెంబ్లీ బరిలో దిగుతున్న పవన్ కళ్యాణ్ ● పిఠాపురం కేంద్రంగా రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం సాగించాలని నిర్ణయం ● ఇకపై పిఠాపురం నుంచే రాకపోకలు

## ఏప్రిల్ 3న సీజర్‌పై
# డిజిపిలతో ఈసీ సమీక్ష

● ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం వినియోగాన్ని విస్తృత పర్చండి ● ఎన్నికల విధులో పాల్గొనే ఉద్యోగుల ఆప్షన్ మేరకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం ● రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

వచ్చే నెల 3 వ తేదీన సీజర్ అంశంపై సి.ఎస్, డిజిపిలతో భారత ఎన్నికల సంఘం అధికారులు సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.



2వ పేజీలో

# పిఠాపురం నుంచే పవన్ కల్యాణ్ ప్రచారానికి శ్రీకారం



మంగళగిరి, సూర్య బ్యూరో ప్రతినిధి : జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ చేపట్టే ఎన్నికల ప్రచారానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. శుక్రవారం పార్టీ ముఖ్యులతో ఈ అంశంపై చర్చించారు. పవన్ కల్యాణ్ పోటీ చేయనున్న పిఠాపురం నుంచే ప్రచారానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకున్నారు. శక్తిపీఠం కొలువైన క్షేత్రం శ్రీపాద శ్రీవల్లభుడు జన్మించిన పవిత్ర భూమి అయిన పిఠాపురం నుంచి ప్రచారం మొదలుపెట్టడం శుభప్రదమని పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. పురుహూతిక దేవికి పూజలు నిర్వహించి వారాహి వాహనం నుంచి ప్రచారం మొదలుపెడతారు. ఆ నియోజక వర్గంలోనే మూడు రోజులపాటు ఉంటారు. నియోజక వర్గ ముఖ్య నాయకులు, మండల నాయకులతో భేటీలు నిర్వహిస్తారు. పిఠాపురం కేంద్రంగానే రాష్ట్రవ్యాప్తంగా సాగించే ఎన్నికల ప్రచారానికి రాకపోకలు సాగించబోతున్నారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని పవన్ కల్యాణ్ పార్టీ కేంద్ర కార్యాలయ వర్గాలకు ఆదేశాలిచ్చారు. అనంతరం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పార్టీ ప్రెసిడెంట్ టూర్ మేనేజ్మెంట్ టీం కన్వీనర్లు, కో కన్వీనర్లు, సభ్యులతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. పిఠాపురం నుంచి మొదలుపెట్టనున్న ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. తాను పోటీ చేస్తున్న స్థానం కావడంతో వైసీపీ ఎన్నో పన్నాగాలు పన్నుతోందని, ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి.

# ఏప్రిల్ 3న సీజర్‌పై డిజిపిలతో ఈసీ సమీక్ష

**● ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం వినియోగాన్ని విస్తృత పర్చండి ● ఎన్నికల విధులో పాల్గొనే ఉద్యోగుల ఆప్షన్ మేరకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం ● రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా**




వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : వచ్చే నెల 3 వ తేదీన సీజర్ అంశంపై సి.ఎస్, డిజిపిలతో భారత ఎన్నికల సంఘం అధికారులు సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం వినియోగాన్ని విస్తృఎత స్థాయిలో మెరుగు పర్చాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెలగపూడి సచివాలయం నుండి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన మీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజర్ అంశంపై ఎన్ఫోర్సుమెంట్ ఏజన్సీలను అప్రమత్తం చేయాలని, జిల్లా పరిధుల్లోనే కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో కూడా నిఘాను పటిష్టపర్చాలన్నారు. ప్రతి సరిహద్దు చెక్ పోస్టు వద్ద కనీసం ఒక కెమెరాతో స్టాటిక్ సర్వలెన్సు టీమ్ ను ఉంచాలన్నారు. భారత ఎన్నికల సంఘం జారీచేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం దాదావు 33 నిత్యావసర సేవల శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. వీటిలో ముఖ్యంగా పోలీస్, విద్యుత్, రవాణా, పోస్టల్ తదితర శాఖలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే మీడియా ప్రతినిధులతో పాటు ఆయా శాఖల ఉద్యోగులకు వారి విజ్ఞప్తి మేరకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో నున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు నిర్వహించే ఎటు వంటి కార్యక్రమాలకైనా ముందుగా అనుమతి తప్పని సరిగా పొందాల్సి ఉందన్నారు. అయితే నేరుగా గానీ, ఎన్కోర్ పోర్టల్ ద్వారా గానీ అందే ధరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో అనమతులను మంజూరు చేయాలని ఆదేశించారు. శాంతి భద్రతల నిర్వహణ విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఎటు వంటి దురటనలకు తావులేకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దురదృఎష్టవశాత్తు ఎటు వంటి దురటనలు జరిగినా తక్షణమే తగు చర్య తీసుకోవడంతో పాటు ఆ సంఘటనకు సంబందించిన వాస్తవ నివేదితను వెంటనే తమ పంపాలన ఆదేశించారు. ఓటర్ల జాబితా నుండి పేర్లను తొలగింవుకు సంబందించి పెండింగ్ లో ఉన్న ఫార్మ్-7 లను మరియు వివరాలను సరిదిద్దేందుకు సంబందించి పెండింగ్ లో నున్న ఫార్మ్-8 లను చట్టబద్దమైన విదానంలో ఈ నెల 26 లోవుగా పరిష్కరించాలని ఆదేశించారు. నూతన ఓటర్ల నమోదు విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, చివరి నిమిషంలో హడావుడిగా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టవద్దని, క్రమ పద్ధతిలో వ్యక్తిగతంగా ధాఖలు చేసిన ఫార్మ్-6 లను క్షుణ్ణంగా పరిశీలించిన తదుపరి మాత్రమే నూతన ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుండి ప్రతి రోజూ తొమ్మిది నివేదికలను భారత ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉందని, ఈ నివేదికలు పంపే విషయంలో ఏమాత్రం అలక్ష్యం వహించకుండా సకాలంలో నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో పాటు అదనవు సీఈవో లు పి.కోటేశ్వరరావు, ఎమ్.ఎన్. హరెంధిర ప్రసాద్, జాయింట్ సీఈవో వెంకటేశ్వరరావు , డిప్యూటీ సీఈవోలు కె. విశ్వేశ్వరరావు, మల్లిబాబు, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పెంచలకోన ఆలయంలో చంద్రబాబు ప్రత్యేక పూజలు



నెల్లూరు, సూర్య బ్యూరో ప్రతినిధి : టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం నెల్లూరు జిల్లా రావూరు మండలం పెంచలకోన పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. పెనుశిల లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చంద్రబాబును ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఉండవల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో గోనెపల్లి చేరుకుని అక్కడి నుంచి వాహనంలో పెంచలకోన చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న తర్వాత తిరిగి ఉండవల్లి బయలుదేరారు. ఆయన వెంట ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు రామకృఎష్ణ, హేమలత, సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

## విజయవాడలో జియోగ్రాఫికల్ ఇండికేషన్ జీ.ఐ ఫెస్టివల్

విజయవాడ, సూర్య బ్యూరో ప్రతినిధి : జియోగ్రాఫికల్ ఇండికేషన్ జీ.ఐ ఫెస్టివల్ శుక్రవారం విజయవాడలో ప్రారంభమైంది. స్థానిక సిద్ధార్థ ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి జీ.ఐ కోఆర్డినేటర్ భారత్ మహోత్సవ నెంబర్ గణేష్ ఆధ్వర్యంలో కే.ల్ యూనివర్సిటీ వారు ఏర్పాటు చేసిన జీ.ఐ ఫెస్టివల్ ను కేఎల్ యూనివర్సిటీ సెక్రటరీ కోనేరు కాంచన లత ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి సారిగా విజయవాడలో జియోగ్రాఫికల్ ఇండికేషన్ జీ.ఐ ఫెస్టివల్ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందన్నారు. ఇప్పటివరకు 10 నగరాల్లో జరిగిన జి.ఐ ట్యాగ్ కలిగివున్న నాణ్యత గుర్తింపు కలిగిన వస్తువులు మాత్రమే ఈ ప్రదర్శనలో ఉంచడం జరుగుతుందన్నారు.

## మైలవరంలో టీడీపీ జెండా ఎగురవేస్తా



విజయవాడ, సూర్య బ్యూరో ప్రతినిధి : టీడీపీ మూడో జాబితాలో ఎన్టీఆర్ జిల్లా మైలవరం నుంచి ఎమ్మెల్యే వసంత వెంకట కృఎష్ణ ప్రసాద్ టికెట్ దక్కించుకున్నారు. ఇటీవలే ఆయన వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. ఇక టీడీపీ మైలవరం టికెట్ దక్కించుకున్నసందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడికి ధన్యవాదాలు తెలిపారు. నాపై నమ్మకం ఉంచి మైలవరం నియోజకవర్గ అసెంబ్లీ సీటు కేటాయించిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు. మైలవరం నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా ఎగిరెలా నియోజక వర్గంలోని ప్రతిఒక్క నాయకుడిని, కార్యకర్తలను సమన్వయపరుస్తూ నా ప్రయాణం కొనసాగిస్తానని వసంత కృఎష్ణ ప్రసాద్ ట్విటర్ వేదికగా చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

# రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధి

**● తెలుగుజాతిని నెం.1గా నిలపడమే చంద్రబాబు విజన్ ● జగన్ విధ్వంసక పాలనతో 30ఏళ్లు వెనక్కి వెళ్లిన ఏపీ ● దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మంగళగిరిని తీర్చిదిద్దుతాం ● పరిశ్రమలు తీసుకువచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం ● అమరావతి అభివృద్ధి ఆగిపోవడానికి ఆర్కేనే కారణం ● బ్రేక్ ఫాస్ట్ విత్ లోకేష్ కార్యక్రమంలో యువనేత నారా లోకేష్**



మంగళగిరి నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి : ప్రపంచంలో తెలుగువారు ఎక్కడ ఉన్నా నెం.1గా నిలపాలన్నదే చంద్రబాబు నాయుడు ఆలోచన అని, ఇందుకోసం ఆయన అహర్నిశలు కృఎషిచేస్తూనే ఉంటారని యువనేత నారా లోకేష్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరి పిఇపిఎల్ టవర్స్ అపార్ట్ మెంట్ వాసులతో యువనేత శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ చంద్రబాబు రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృఎద్ధికి కృఎషిచేశారని తెలిపారు. ఆయనకు జగన్ లా డబ్బు సంపాదించాలన్న కోరిక ఉంటే ఆనాడే వెయ్యి ఎకరాలు కొనేసి ఉండేవారన్నారు. కుల,మతాలకు అతీతంగా పనిచేసేవారిని చంద్రబాబు ప్రోత్సహిస్తారని, నాడు ముఖ్యమంత్రిగా ఉన్నవుడు హైదరాబాద్ లో ఎమ్మెల్యే ఆర్కే సోదరుడు అయోధ్యరామిరెడ్డికి చెందిన రాంకీ సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ సంస్థను ప్రోత్సహించింది చంద్రబాబేనని గుర్తుచేశారు. హైదరాబాద్ అభివృఎద్ధిని చూసి ప్రపంచమంతా ఆశ్చర్యపోయారు, ఈ విషయంలో ఆనాడే బాబుకు స్పష్టమైన విజన్ ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డి అయిదేళ్ల విధ్వంసక పాలనలో రాష్ట్రం 30ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆవేదన చెందారు. 2014లో రాష్ట్రవిభజన ఆంధ్రులు కోరుకున్నది కాదు. రాజకీయాల కోసం అడ్డగోలుగా విభజించారు. ఆరుదశాబ్ధాలు కలసి అభివృఎద్ధి చేసుకున్న హైదరాబాద్ ను వదలి కట్టుబట్టలతో ఆనాడు బయటకు వచ్చాం. క్లిష్టపరిస్థితుల్లో సిఎం అయిన చంద్రబాబు అన్నివిధాలా ఆలోచించి అమరావతిని రాజధానిగా నిర్ణయించారు. నాడు ప్రతిపక్షనేతగా ఉన్న జగన్ కూడా ఆనాడు అమరావతి రాజధానికి అంగీకరించి 30వేల ఎకరాలు ఉండాలన్నారు. అధికారంలోకి వచ్చాక మాటతప్పి మడమతిప్పి మూడుముక్కలాట పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. అమరావతిలో ఎక్కడి పనులను అక్కడే నిలిపివేశారు. ఉద్యోగాల కోసం మన బిడ్డలు హైదరాబాద్, బెంగుళూరు, చెన్నయ్ ప్రాంతాలకు వలసవెళ్లాల్సిన దుస్థితి కల్పించారని మండిపడ్డారు. కులం, మతం, ప్రాంతం పేరుతో గత ఎన్నికల్లో జగన్ లబ్ధిపొందారు, కుట్రవూరిత రాజకీయాలతో సమాజం నిట్టనిలువునా చీల్చిపోయింది. ప్రతిపక్షనేతలను బూతులు తిట్టేవారికి మంత్రి పదవులు, ఎమ్మెల్యే, ఎంపి టిక్కెట్లు ఇస్తున్నారు. చంద్రబాబు నాయుడు ఏనాడు హత్యారాజకీయాలను ప్రోత్సహించలేదు, కత్తిపట్టిన వాడు కత్తితోనే పోతాడనే నానుడిని ఆయన బలంగా విశ్వసిస్తారు. చంద్రబాబును అరెస్టు చేస్తే 80దేశాల్లో తెలుగువారు ఆందోళనల్లో పాల్గొన్నారు, హైదరాబాద్ లో 45వేలమంది రోడ్లపైకి వచ్చి ఆయనకు సంఘీభావం తెలిపారు. పవన్ కళ్యాణ్ ను రెచ్చగొట్టి పొత్తును విచ్ఛిన్నం చేయాలని కొందరు ప్రయత్నించారు, సాధ్యం కాకపోయే సరికి ముసుగుతీసేసి వైసిపిలో చేరారు. అటువంటి నేతలకు విశ్వసనీయత ఏముంటుందని ప్రశ్నించారు. రాష్ట్ర సమగ్రాభివృఎద్ధి కోసం ప్రజలంతా చంద్రబాబు నాయకత్వాన్ని బలపర్చాలని లోకేష్ విజ్ఞప్తిచేశారు.

రాబోయే ఎన్నికల్లో తనను గెలిపిస్తే దేశంలోనే నెం.1గా అమరావతిని తీర్చిదిద్దుతానని యువనేత నారా లోకేష్ పేర్కొన్నారు. ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని లక్ష్యంతో చంద్రబాబు అమరావతిని అభివృఎద్ధి చేస్తే ఈ ప్రాంత ఎమ్మెల్యే ఆళ్ల రామకృఎష్ణారెడ్డి కేసులు వేసి అడ్డుకున్నారని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరి పట్టణంలోని పీఈపీఎల్ శ్రీ బాలాజీ ఫార్చ్యూన్ టవర్స్ లో బ్రేక్ ఫాస్ట్ విత్ లోకేష్ కార్యక్రమం ద్వారా అక్కడ నివాసితులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ 2014లో కట్టుబట్టలతో ఇక్కడకు వచ్చాం. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని నినాదంతో ఆనాడు అమరావతిని అందరి ఆమోదంతో రాజధానిగా ఏర్పాటుచేసుకున్నాం. అభివృఎద్ధి వికేంద్రీకరణకు పెద్దపీట వేశాం. రాష్ట్రప్రజలు ఒక్క ఛాన్స్ మాయలో జగన్ కు ఓటువేశారు. వైసీపీ వచ్చిన తర్వాత అమరావతిని విధ్వంసం చేశారు. ఇక్కడ పనులు ఆగిపోవడానికి ఈ ప్రాంత ఎమ్మెల్యే ఆళ్ల రామకృఎష్ణారెడ్డే కారణం. కేసులు వేసి రాజధాని ప్రాంత అభివృఎద్ధిని అడ్డుకున్నారు. ఒక్క పరిశ్రమ రాలేదు. ఉపాధి కోసం మన ప్రాంత యువత హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వెళ్లే పరిస్థితి నెలకొంది. ప్రజాప్రభుత్వం వచ్చాక అమరావతికి పూర్వవైభవం తీసుకువస్తాం. మన ప్రాంతంలోనే పరిశ్రమలు ఏర్పాటుచేసి పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

**బ్లాక్ డెవలప్ మెంట్ మోడల్ తో అభివృఎద్ధి :** 2019 ఎన్నికల్లో 21 రోజుల ముందు నేను మంగళగిరికి వచ్చా. 5,350 ఓట్ల తేడాతో ఓడిపోయాను. అప్పటి నుంచి కసి, పట్టుదలతో నియోజకవర్గంలోనే ఉండి పనిచేస్తున్నా. ప్రతిపక్షంలో ఉన్నా సొంత నిధులతో 29 సంక్షేమ, అభివృఎద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువయ్యా. ప్రతిపక్షంలోనే ఇక్కడకు రెండు ఐటీ కంపెనీలు తీసుకువచ్చి 150 మందికి ఉద్యోగాలు కల్పించాం. నన్ను, పెమ్మసాని చంద్రశేఖర్ ను భారీ మెజార్టీతో గెలిపించాలి. డబుల్ ఇంజన్ లా పనిచేసి మంగళగిరి రూపురేఖలు మారుస్తాం. బ్లాక్ డెవలప్ మెంట్ విధానంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పార్క్ లు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తాం. ప్రతి గడపకు సురక్షితమైన తాగునీరు అందిస్తాం. మంగళగిరి మీదుగా వెళ్లే బస్సులు, రైళ్లు ఇక్కడ ఆగేవిధంగా చర్యలు తీసుకుంటాం. మంగళగిరిని గోల్డ్ క్లస్టర్ గా మారుస్తామన్నారు.

**బిడ్డల భవిష్యత్తుకు బాబును గెలిపించాలి : పెమ్మసాని చంద్రశేఖర్**

గుంటూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈసారి అధికారమార్పిడి కేవలం రాజకీయంగా అధికార మార్పిడికి సంబంధించినది కాదు. ఐదు కోట్ల ప్రజల భవిష్యత్ కు సంబంధించినది. అమరావతిని కాపాడుకోవడానికి, చదుకున్న బిడ్డల భవిష్యత్తు కోసం చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలి. ఇవాళ హైదరాబాద్ శరవేగంగా అభివృఎద్ధి చెందుతోందంటే అందుకు కారణం చంద్రబాబునాయుడు విజనే కారణం. 2019లో టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే అమరావతి కూడా అభివృఎద్ధి చెంది ఉండేది. రాష్ట్రానికి మధ్యలో ఉంది, నీటి వనరులు ఉన్నాయని ఆనాడు అమరావతిని రాజధానిగా చేశారు. వైసీపీ వచ్చిన తర్వాత అంతా నాశనం చేశారు. డబ్బు, పదవుల కోసం నేను రాజకీయాల్లోకి రాలేదు. గుంటూరు ప్రజలకు సేవ చేసేందుకే వచ్చా. ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తాం. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించి లోకేష్ ను, నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

***మంగళగిరిలో ఒకతరం భవిష్యత్ దెబ్బతింది : చిల్లపల్లి శ్రీనివాసరావు***

మంగళగిరి జనసేన సమన్వయకర్త చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ విధ్వంసక విధానాలతో మంగళగిరిలో ఒకతరం భవిష్యత్ దెబ్బతింది. పెట్టుబడులు, పరిశ్రమలు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లాయి. సంపద స్రూఎష్టించే వారిని తరిమికొట్టారు. విచ్ఛిన్న శక్తులకు అడ్డుకట్టపడాలంటే లోకేష్, పెమ్మసాని చంద్రశేఖర్ ను గెలిపించాలి. మంగళగిరి రైల్వే స్టేషన్, బస్టాండ్ లో అన్ని ట్రైన్లు, బస్సులు ఆగేవిధంగా చూడాలి. లోకేష్ వినూత్న రీతిలో రచ్చబండ కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పీఈపీఎల్ బాలాజీ ఫార్చ్యూన్ టవర్స్ వాసులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను లోకేష్ దృఎష్టికి తీసుకువచ్చారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. విజయవాడ-గుంటూరుని హైదరాబాద్-సికింద్రాబాద్ మాదిరి జంటనగరాలుగా అభివృఎద్ధి చేయాలని ఆకాంక్షించారు. గత ఎన్నికల్లో లోకేష్ ఓటమి కారణంగా ఏం కోల్పోయామో గ్రహించాం.

## ఏపీని గంజాప్రదేశ్‌గా మార్చేశారు



విజయవాడ, సూర్య బ్యూరో ప్రతినిధి : బ్రెజిల్ నుంచి విశాఖపట్నం వస్తున్న కంటెయినర్‌లో 25 వేల కిలోల ఈస్ట్‌తో పాటు డ్రగ్స్ పట్టుబడటం ఇప్పుడు రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా నిలిచింది. విశాఖలో డ్రగ్స్ పట్టుబడటంపై ఏపీ బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్, గంజాప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్ నేతృఎత్వంలోని వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రంలో మూడు రాజధానుల మాటేమో కానీ మూడు ప్రాంతాలను డ్రగ్స్, గంజా, మద్యం రాజధానులుగా మార్చే విధంగా జగన్ పాలన ఉందని వ్యాఖ్యలు చేశారు. గతంలో విజయవాడ అడ్రస్‌తో వేల కోట్ల విలువైన డ్రగ్స్ వస్తే, నేడు వైజాగ్ పోర్టుకి నేరుగా లక్షల కోట్ల విలువైన డ్రగ్స్ తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రగ్స్ కంటైనర్ తెరవకుండా వత్తిడి చేసిన నాయకులు, అధికారులపైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ పాలనాలో యువత భవిష్యత్తు దెబ్బతీసే అరాచకాలకు అంతు లేకుండా పోయిందని లంకా దినకర్ విమర్శలు గుప్పించారు.


## రాష్ట్రంలో డ్రగ్స్ కల్చర్ పెరిగిపోయింది



అమరావతి, సూర్య బ్యూరో ప్రతినిధి : బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామిని వైసీపీ పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను లెక్క చేయకుండా వాలంటీర్స్‌ను వైసీపీ వాడుకుంటోందని, పోలీసులు కూడా ఈసీ కోడ్‌ను లెక్క చెయ్యకుండా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ పాలనలో అవినీతి, డ్రగ్ కల్చర్ పెరిగిపోయిందని ఆరోపించారు. విశాఖలో ఒక్కోటి 25 కేజీల బరువున్న వేయి సంచుల డ్రగ్స్ దొరకటం దారుణమన్నారు. రాష్ట్ర పోలీసు శాఖ నిద్ర పోతోందని, ఢిల్లీ నుంచి వచ్చిన వారు అసలు విషయాన్ని బయటపెట్టారని సాధినేని యామిని విమర్శించారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, డ్రగ్స్ కల్చర్ విచ్చలవిడిగా మారిందన్నారు. వాటివల్లే మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని, మిస్సింగ్ కేసులు ఎక్కువ అవుతున్నాయన్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరిపై కావాలనే నిందలు వేస్తున్నారన్నారు. ఎన్నికల్లో పురందేశ్వరి పరువు తియ్యటానికి వైసీపీ ప్రయత్నిస్తోందని అన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌ను బీజేపీ ఖండిస్తుందన్నారు. ఓటమి భయ్యంతో వైసీపీ ఇలాంటి పనులు చేస్తోందని, అనవసరమైన నిందలు పురందేశ్వరిపై వేస్తే చర్యలు తప్పవని సాధినేని యామిని అన్నారు.

# టీడీపీ మూడో జాబితా విడుదల

## ప్రజలంతా ఆశీర్వదించాలి : చంద్రబాబు నాయుడు



అమరావతి నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి : తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల మూడో జాబితా విడుదలైంది. 11 శాసనసభ స్థానాలతో పాటు 13 ఎంపీ అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. పొత్తులో భాగంగా 144 అసెంబ్లీ, 17 పార్లమెంట్ స్థానాల్లో టీడీపీ పోటీ చేయనుంది. ఇదివరకే 128 శాసనసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా తాజాగా మరో 11 మందిని వెల్లడించింది. 5 అసెంబ్లీ, 4 ఎంపీ స్థానాలను పెండింగులో ఉంచింది.

**ప్రజలంతా ఆశీర్వదించాలి : చంద్రబాబు నాయుడు**

టీడీపీ మూడో జాబితా విడుదల చేసిన సందర్భంగా పార్టీ అధినేత చంద్రబాబు ఎక్స్(ట్విటర్) వేదికగా పోస్టు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే ఏకైక ఎజెండాగా ఎన్డీఏలో చేరినట్లు తెలిపారు. పార్లమెంటులో బలమైన గళం వినిపించి రాష్ట్రం కోసం పోరాడగల నాయకులనే అభ్యర్థులుగా నిలబెడుతున్నట్లు చెప్పారు. ప్రజాభిప్రాయం మేరకు ఎంపిక చేసి ప్రకటిస్తున్నామని, ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాలే ఏకైక ఎజెండా లక్ష్యంగా ఎన్డీయే లో చేరామని, పార్లమెంటులో బలమైన గళం వినిపిస్తూ రాష్ట్రం కోసం పోరాడగల నాయకులనే టీడీపీ అభ్యర్థులుగా నిలబెడుతున్నామని తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పార్లమెంటుకు పోటీ చేసే 13 మంది తెలుగుదేశం ఎంపీ అభ్యర్థులను, వారితో పాటు మరో 11 అసెంబ్లీ స్థానాలకు కూడా అభ్యర్థులను ప్రజాభిప్రాయం మేరకు ఎంపిక చేసి ప్రకటించామని తెలిపారు. ప్రజలారా ఆశీర్వదించాలని చంద్రబాబు కోరారు.

**అసెంబ్లీ స్థానాల అభ్యర్థులు :** పలాస-గౌతు శిరీష, పాతపట్నం- మామిడి గోవిందరావు, శ్రీకాకుళం-గొండు శంకర్, శృఎంగవరపుకోట- కోళ్ల లలిత కుమారి, కాకినాడ సిటీ- వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), అమలాపురం (ఎస్సీ)- అయితాబత్తుల ఆనందరావు, పెనమలూరు-బోడె ప్రసాద్, మైలవరం- వసంత వెంకట కృఎష్ణప్రసాద్, నరసరావుపేట- చదలవాడ అరవిందబాబు, చీరాల- మద్దులూరి మాలకొండయ్య యాదవ్, సర్వేపల్లి- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ని ప్రకటించారు.

**లోక్‌సభ స్థానాల అభ్యర్థులు వీరే :** శ్రీకాకుళం- కింజరావు రామ్మోహన్ నాయుడు, విశాఖపట్నం- మతుకుమిల్లి భరత్, అమలాపురం- గంటి హరీష్, ఏలూరు - పుట్టా మహేశ్ యాదవ్, విజయవాడ- కేశినేని శివనాథ్ (చిన్ని), గుంటూరు- పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట- లావు శ్రీకృఎష్ణ దేవరాయలు, బాపట్ల- టి.కృఎష్ణ ప్రసాద్, నెల్లూరు- వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, చిత్తూరు- దగ్గుమళ్ల ప్రసాదరావు, కర్నూలు- బస్తిపాటి నాగరాజు (పంచలింగాల నాగరాజు), నంద్యాల- బైరెడ్డి శబరి, హిందూపురం- బీకే పార్థసారథి ని ప్రకటించారు.

# మాఫియా ముఠాలను పెంచి పోషిస్తున్నారు



కడప, సూర్య బ్యూరో ప్రతినిధి : వైసీపీ ప్రభుత్వం మాఫియా ముఠాలను పెంచి పోషిస్తుందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా కడప జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో భువనేశ్వరి పర్యటించారు. చంద్రబాబు అరెస్ట్‌తో మనస్తాపం చెందిన మరణించిన వారి కుటుంబాలను ఆమె పరామర్శిస్తున్నారు. నిజం గెలవాలి పేరుతో చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి పరామర్శిస్తూ ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పర్యటించిన ఆమె పలువురు కార్యకర్తల కుటుంబాలను కలిశారు. శుక్రవారం కలసపాడు మండలం బ్రాహ్మణపల్లెలో వెంకటయ్య కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ నాడు చంద్రబాబు జనం మరచి పోలేని అభివృఎద్ధి పనులు చేశారని చెప్పారు. నేడు జగన్ పాలనలో గంజాయి, ఇసుక , కల్తీమద్యం, మాఫియాలతో పాటు భూకబ్జాలకు అడ్డగా రాష్ట్రం మారిందని మండిపడ్డారు. ప్రస్తుతం తప్పుడు పనుల్లో ఏపీ నెంబర్ వన్ స్థానంలో ఉందని అన్నారు. చంద్రబాబు అమలు చేసిన మంచి పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. జగన్, ఆయన అనుచరులకు పనికి వచ్చే పథకాలను ఇప్పుడు అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు చేసిన అభివృఎద్ధిని చూసి రాబోయే ఎన్నికల్లో ఓటు వేయాలని నారా భువనేశ్వరి పేర్కొన్నారు.



# బిజెపిని ఓడిస్తాం

తెలంగాణ బ్యూరో ప్రతినిధిహైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్రం విడిపోయిన తర్వాత మాల, మాదిగల అందరూ ఐక్యంగా ఉన్న సమయంలో బిజెపి నాయకుడు మందకృష్ణ మాదిగ తన స్వార్థ రాజకీయాల కోసం దళితుల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నాడని, మందకృష్ణ బిజెపి నాయకునిగా మాట్లాడుతున్నాడో, ఎమ్మార్పీఎస్ నాయకులుగా మాట్లాడుతున్నాడో ప్రజానీకానికి తెలపాలి అని మాల సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఒకపక్క బీజేపీ నాయకులు అధికారంలోకి మళ్లొకసారి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని చెప్తా ఉన్నారు .ఏంటి మందకృష్ణ కి ఇవన్నీ కనబడట్లేదా.. నాగర్ కర్నూల్ లో మల్లు రవికి కాంగ్రెస్ టికెట్ కేటాయిస్తే సాక్షాత్తు సంపత్ కుమార్ వచ్చి అభినందించిన విషయాన్ని మందకృష్ణ గుర్తుంచుకోవాలి . ఇకనైనా మనువాదుల చేతిలో కీలుబొమ్మలా మారిన మందకృష్ణ మనువాదుల ఉచ్చులో నుండి బయటికి రావాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రామచందర్. వర్కింగ్ చైర్మన్ బేర బాలకిషన్(బాలన్న ) తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మందకృష్ణ మనువాదుల మెప్పుకోసం, ముఖ్యంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నారని , రేవు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని తెలంగాణలో ఉన్న 50 లక్షల మంది మాలలు సికింద్రాబాద్ లో కిషన్ రెడ్డి ఓటమి ధ్యేయంగా పనిచేస్తామని వారు స్పష్టం చేశారు. మాల సంఘాలకు పార్టీలతో పనిలేదని, మాలద్రోహి కిషన్ రెడ్డినీ ఎట్టి పరిస్థితిలో గెలవనిచ్చే ముచ్చట లేదని, కిషన్ రెడ్డిని మాలలు అందరూ ఓడించి తీరుతారని ఈ సందర్భంగా తెలిపారు . నిజంగా భారతీయ జనతా పార్టీ నాయకులకు ఏమాత్రం మాదిగల మీద ప్రేమ ఉన్నా మందకృష్ణను సికింద్రాబాద్లో పార్లమెంట్ సభ్యునిగా నిలబెట్టాలని, మాల మాదిగలు అందరూ కలిసికట్టుగా మందకృష్ణ గెలిపించడానికి ప్రయత్నిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.



# అభ్యర్థుల వడపోత

● పతాకస్థాయిన కసరత్తు ● టికెట్ల వ్యవహారంలో జోక్యం చేసుకో వద్దంటూ మంత్రులకు అధిష్ఠానం దిశా నిర్దేశం

● ఎన్నికలు అత్యంత ప్రతిష్ఠాత్మకమైనవిగా భావిస్తున్న హైకమాండ్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థులను ఖరారు చేసేది పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంతడ్డేనా? అంటే, అవుననే సమాధానం వస్తున్నది. అభ్యర్థుల ఎంపికకు పీసీసీ, ఏఐసీసీ చేస్తున్న కసరత్తు అంతా నామ మాత్రమేనని కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. పార్టీలో చేరికలతోపాటు ఎంపీ అభ్యర్థులకు సంబంధించి అన్ని స్థాయిలలో కూడా తనదైన శైలిలో నిర్ణయాలు తీసుకుంటున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ టికెట్ల వ్యాపారాన్ని ప్రభావితం చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కమిటీల కసరత్తు కూడా అంతంత మాత్రమే అనే పరిస్థితి నెలకొన్నది. తాజా పరిస్థితుల నేపథ్యంలో రేవంత్ రెడ్డిని మిగిలిన మంత్రులు కూడా పెద్దగా దిక్కరించే సందర్భాలు ఏమీ లేవు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డికి పూర్తి స్వేచ్ఛను ఇవ్వడమే దీనికి కారణం. ఎక్కడైనా సభలు నిర్వహించిన పక్షంలో అక్కడికక్కడే అభ్యర్థిని రేవంత్ రెడ్డి ప్రకటిస్తూ ఉండడం మరో విశేషం. ఎంపీ అభ్యర్థుల విషయంలో ఎలాంటి జోక్యం చేసుకోవద్దని ఇప్పటికి మంత్రులందరినీ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశించింది ముఖ్యమంత్రి కే పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నట్టు స్పష్టీకరించారు .ఎందుకంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించడం , కేంద్రంలో అధికారాన్ని చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం పట్టుదలతో ఉంది. అందువల్ల ప్రతి ఒక్క ఎంపీ సీటు కూడా కాంగ్రెస్ పార్టీకి ఎంతో అవసరం .ఇప్పుడున్న పరిస్థితుల్లో ముఖ్యమంత్రి హోదాలో మరియు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి హోదాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చురుకుగా వ్యవహరిస్తున్నారు .ఆయనపై కాంగ్రెస్ అధిష్టాన వర్గానికి కూడా నమ్మకం ఏర్పడింది. ఇదిలా ఉండగా ఇటీవల నిర్వహించిన ఒక బహిరంగ సభలో మహబూబ్నగర్ లోక్సభ నియోజకవర్గ అభ్యర్థిగా వంశీచంద్రెడ్డి పేరును రేవంతడ్డి ప్రకటించారు. తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ నుంచే వంశీచంద్రెడ్డికి 50 వేల మెజార్టీ ఇచ్చి గెలిపించాలని రేవంతడ్డి పిలువునిచ్చారు. ఎంపీ టికెట్లను ఏఐసీసీ ఖరారు చేస్తుందంటూ ఇంతకాలం తాము నమ్మినదంతా ఒట్టిదేనని తెలిపోయిందని ఆశావహులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అభ్యర్థుల ఎంపిక బాధ్యతను అధిష్ఠానం రేవంతడ్డికే అప్పగించి ఉంటే,పీసీసీ దరఖాస్తులు స్వీ కరించడం, 50 వేల చొప్పున ఫీజు వసూలు చేయడం, డీసీసీల నుంచి ఆశావహుల పేర్లు తెప్పించుకోవడం, వాటిపై ప్రదేశ్ ఎన్నికల కమిటీ కసరత్తు చేయడం, టికెట్ల ఖరారుపై తుది నిర్ణయం కేంద్ర ఎన్నికల స్క్రీనింగ్ కమిటీదే అన్నట్టుగా పేర్కొనడం ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎంపీ అభ్యర్థుల ఖరారుకు ఏఐసీసీ కసరత్తు చేస్తున్నదని ఒకవైపు చెబుతూనే, మరోవైపు మహబూబ్నగర్ అభ్యర్థిగా వంశీచంద్రెడ్డి పేరును ప్రకటించడంతో ఆశావహులు కంగుతిన్నారు. టికెట్ల ఎంపికకు కసరత్తు జరుగుతున్నట్టు పీసీసీ, ఏఐసీసీ తమను నమ్మించినట్టు ఆశావహులు కొందరు లబోదిబోమంటున్నారు. కాంగ్రెస్ రాష్ట్రంలో నాలుగు పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, మిగతా 13 స్థానాలకు ప్రకటించాల్సి ఉంది. ఢిల్లీలో జరిగిన భేటీలోనే అభ్యర్థుల జాబితాపై తుది నిర్ణయం తీసుకుంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మళ్ళీ హస్తిన బాట పట్టనున్నారు. లోక్ సభ ఎన్నికలు రానున్న సమయంలో ఆయన ఇప్పటికే నిర్వహించిన ఢిల్లీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఢిల్లీలో హైకమాండ్ పెద్దలతో సీఎం భేటీ అయ్యారు.

ఎంపీ అభ్యర్థుల ఎంపికపై ఏఐసీసీ పెద్దలతో చర్చించారు. అభ్యర్థుల ఎంపికపై చేపట్టిన అభిప్రాయ సేకరణపై చర్చించారు సీఎం.ఢిల్లీలో జరిగిన ఏఐసీసీ ఎన్నికల కమిటీ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి రాష్ట్రం తరఫున స్క్రీన్ కమిటీ భేటీలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులకు సంబందించి రెండో జాబితాపై పార్టీ అధిష్ఠానంతో చర్చించారు. ఈ భేటీలోనే అభ్యర్థుల జాబితాపై తుది నిర్ణయం తీసుకున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఇదిలా ఉండగా, సీఎం రేవంత్ రెడ్డితో పాటు.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ దీపాదాసు మున్షీ భేటీ అయ్యారు. పార్లమెంట్ అభ్యర్థుల ఎంపికపై చేపట్టిన అభిప్రాయ సేకరణ అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో చేపట్టిన అభిప్రాయాలను వివరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలపై తెలంగాణ ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి, ఇటీవల కరీంనగర్ సభలో కేసీఆర్, రేవంత్ ఢిల్లీ టూర్ పై ఆరోపణలు చేశారు. రాష్ట్ర సంపదను దౌర్జన్యంగా సూట్ కేసుల ద్వారా ఢిల్లీకి మోసుకు వెళ్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రులు, మంత్రులు హైదరాబాద్ టు ఢిల్లీ, ఢిల్లీ టూ హైదరాబాద్ తిరుగుతున్నారని కేసీఆర్ మండిపడ్డారు. మూడు నెలల్లో 9 సార్లు ఢిల్లీకి వెళ్తారా అని ప్రశ్నించారు. మరోసారి తెలంగాణ ఆత్మ గౌరవాన్ని ఢిల్లీ పెద్దల పాదాల వద్ద తాకట్టు పెట్టి మన ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని కేసీఆర్ ఆరోపించారు.

**రెండో జాబితాలో కొత్త ముఖాలు**

ఇదిలా ఉండగా సుదీర్ఘ కసరత్తు అనంతరం పెద్దపల్లి లోక్సభ నియోజకవర్గానికి గడ్డం వంశీకృష్ణను అభ్యర్థిగా ప్రకటించారు. అదేవిధంగా సికింద్రాబాద్ నియోజకవర్గంలో నుంచి ఎమ్మెల్యే దానం నాగేందర్ ను ప్రకటించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన మల్కాజ్గిరి లోక్ సభ నియోజకవర్గం నుంచి వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సునీత మహేందర్ రెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు అయినా డాక్టర్ మల్లు రవిని నాగర్ కర్నూల్ లోక్సభ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ప్రకటించడం జరిగింది. ఇదే నియోజకవర్గం నుంచి గతంలో ఒకసారి మల్లు రవి ఎంపీగా పని చేశారు.

# శ్రీ సీతారామ కళ్యాణానికి రారండీ

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి భద్రాచలం ఆలయం ఆహ్వానం**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్ :భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కి ఎండోమెంట్స్ శాఖ కమీషనర్ హనుమంత రావు, భద్రాచలం ఈ.ఓ, అర్చకులు శుక్రవారం అందజేశారు.

# కవిత బాధితురాలు, నిందితురాలు కాదు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్:ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ తప్పుడు కేసు బనాయించి అక్రమంగా అరెస్టు చేసిందని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు.కేసును టీవీ సీరియల్స్ మాదిరిగా రెండేళ్లు సాగదీసి ఎన్నికల వేళ ఇప్పుడు తెరపైకి తెచ్చారని ఈడీ వైఖరిని ఆయన నిశితంగా ఎండగట్టారు.ఎంపీ రవిచంద్ర శుక్రవారం ఢిల్లీలో లోకసభలో బీఆర్ఎస్ పక్ష నేత నామ నాగేశ్వరరావు, రాజ్యసభలో తన సహచర సభ్యులు కే.ఆర్.సురేష్ రెడ్డి,మహబూబ్ నగర్ లోకసభ సభ్యులు మన్నె శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ,ఈడీ 2004 నుండి 2014 వరకు కేవలం 200 కేసులు మాత్రమే నమోదు చేస్తే, 2014 నుండి ఈ 10 సంవత్సరాలలో 2954 పైగా కేసులు పెట్టిందని వివరించారు. ఈ కేసుతో అసలు కవితకు ఎటువంటి సంబంధం లేదని,ఆమె బాధితురాలు మాత్రమే కానీ నిందితురాలు కాదని ఆయన స్పష్టం చేశారు.న్యాయవ్యవస్థపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని, ధర్మం తప్పకుండా గెలుస్తుందని,కడిగిన ముత్యం మాదిరిగా కవిత ఈ కేసును బయటకు వస్తారని ఎంపీ రవిచంద్ర చెప్పారు.

# మరో రెండు స్థానాలకు బిఆర్ఎస్ అభ్యర్థులు

● కేసీఆర్ అనూహ్య ఎంపిక ● ఒకరు ఐఏఎస్, ఇంకొకరు ఐపీఎస్

● సుదీర్ఘ కసరత్తు అనంతరం నాగర్ కర్నూల్, మెదక్లకు అభ్యర్థుల ప్రకటన





తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్:తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల వేడి రాజుకుంది. మూడు ప్రధాన పార్టీలకు ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారుతున్నాయి. బిజెపి, కాంగ్రెస్ తమ అభ్యర్థుల జాబితాలను ప్రకటించాయి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తాజాగా మరో రెండు నియోజకవర్గాలకు తమ అభ్యర్థులను ఖరారు చేశారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ తిరిగి పార్లమెంట్ ఎన్నికల్లోను పట్టు నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తుంది. కాంగ్రెస్ తమ అభ్యర్థుల జాబితాలను రెండు విడతలుగా ఖరారు చేసింది. బిజెపి తమ అభ్యర్థులను ప్రకటించింది. ఇదే సమయంలో బిఆర్ఎస్ అభ్యర్థులను ఆ పార్టీ అధినేత కేసిఆర్ వరుసగా ఖరారు చేస్తున్నారు. తాజాగా నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మెదక్ ఎంపీ అభ్యర్థిగా మాజీ ఐఏఎస్ అధికారి పి. వెంకట్రామిరెడ్డిని కేసీఆర్ ప్రకటించారు.బిఆర్ఎస్ నుంచి ఈ ఇద్దరు అభ్యర్థుల ప్రకటన తర్వాత ఇంకా భువనగిరి, నల్గొండ, సికింద్రాబాద్, హైదరాబాద్ ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఇప్పటికే మహబూబ్ నగర్ నుంచి మన్నే శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ నుంచి వినోద్ కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్, జహీరాబాద్ నుంచి గాలి అనిల్ కుమార్, ఖమ్మం నుంచి నామ నాగేశ్వరరావు, చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్, అదిలాబాద్ నుంచి ఆత్రం సక్కు, నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్, వరంగల్ నుంచి కడియం కావ్య పేర్లను ప్రకటించారు.మొత్తం 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో మెజార్టీ సీట్లు సాధించాలనేది మూడు పార్టీల లక్ష్యంగా కనిపిస్తుంది. బిజెపి ఈసారి మెజార్టీ సీట్లు సాధించేందుకు అభ్యర్థుల ప్రకటనతో పాటుగా ప్రచారంలోనూ వేగం పెంచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యధిక స్థానాలు గెలుచుకోవటం కోసం వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. గులాబీ పార్టీలోని నేతలను పెద్ద సంఖ్యలో తమ పార్టీలోకి ఆకర్షిస్తున్నారు. ఇప్పుడు మెజార్టీ సీట్లు సాధించటం రేవంత్ రెడ్డి వ్యక్తిగత ప్రతిష్టకు సవాలుగా మారింది.

# అధిష్టానం కోరితే భువనగిరి ఎంపీ టికెట్ గురించి ఆలోచిస్తాం



మునుగోడు,మేజర్ న్యూస్: అధిష్టానం కోరితే భువనగిరి ఎంపీ టికెట్ గురుంచి ఆలోచిస్తాం అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.ఎవరెన్ని కుట్రలు పన్నినా కోమటిరెడ్డి బ్రదర్స్ డ్యామేజ్ తగ్గదన్నారు.శుక్రవారం మునుగోడు లోని తన వ్యక్తి గత క్యాంప్ కార్యాలయములో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ నా భార్య కోమటి రెడ్డి లక్ష్మి కోసం భువనగిరి పార్లమెంటు టికెట్ ను అశించుట లేదన్నారు. కనీసం దరఖాస్తు కూడా చేసుకోలేదన్నారు.అసెంబ్లీ సమావేశాలు జరిగేటప్పుడు కూడా పాత్రికేయుల తో చిచ్ చాట్ లో చెప్పాను అన్నారు. భువనగిరి పార్లమెంటు టికెట్ బిసిలకు ఇస్తే బాగుంటుంది అని నా వ్యక్తిగత అభిప్రాయం అన్నారు.కొందరూ వ్యక్తులు కావాలని నా మీద నా సోదరుని మీద దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.అధిష్టానం సర్వే చేసి ప్రజల మనసులలో భువనగిరి పార్లమెంటు స్థానం గురుంచి ఎవరికి ఇస్తే బాగుంటుంది తెలుసుకుంటే మంచిది అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధనలో నా సోదరుడు,మేము ఎన్నో త్యాగాలు చేశామన్నారు. ఎన్నో వేల సామాజిక కార్యక్రమాలతో పేద ప్రజలకు సేవ చేశానన్నారు.ఉప ఎన్నికల్లో గాని సాధారణ ఎన్నికలో నా భార్య లక్ష్మి విస్తృతంగా పర్యటన చేసి గెలువు లి బాగస్వామి అయింది అన్నారు. కోమటి రెడ్డి సోదరులు పదవుల కోసం ఏనాడూ కూడా పాకులడాలేదన్నారు. కరోనా సమయంలో ఎంతో మంది పేద ప్రజలకు 50 వేల సరుకులు అందించామన్నారు.భువనగిరి పార్లమెంట్ స్థానం కోరడంలో ఏమాత్రం నిజం లేదు అన్నారు. అధిష్ఠానం కోరితే తప్ప కోమటిరెడ్డి లక్ష్మి ని పోటీలో నిలుపము అని స్పష్టం చేశారు.భువనగిరి పార్లమెంటు స్థానం గురుంచి పోటీ చేయమని కొన్ని లక్షల మంది కార్యకర్తలు అభిమానం పార్టీలకు అతీతంగా కోరుకుంటున్నారన్నారు.కొంత మంది వ్యక్తులు టికెట్ విషయంలో తప్పుడు ప్రకారం చేయడం బాధాకరం అన్నారు.తెలంగాణలో కెసిఆర్ గద్దె దించడంలో నా ఆశయం ,నా లక్ష్యం నెరవేరింది అన్నారు.రాబోయే మంత్రి వర్గ విస్తరణలో తప్పకుండా నాకు మంత్రి వర్గం లో స్థానం కల్పిస్తారని హామీ ఇచ్చారనీ అన్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సేవ చేయడమే లక్ష్యం అన్నారు.పార్టీ అదేశీస్తే 17 పార్లమెంట్ స్థానాలలో గెలువు కొరకు ప్రచారం చేస్తా అన్నారు. భువనగిరి పార్లమెంటు స్థానం రాష్ట్రంలో నే ఎక్కువ మెజారిటీ వచ్చే విధంగా కృషి చేస్తున్నారు. 6 గ్యారంటీ పథకాలను తప్పకుండా ప్రజలకు అందిస్తామన్నారు.తెలంగాణలో 12 నుండి 14 పార్లమెంట్ స్థానాలు గెలుస్తాం అని ధీమా వ్యక్తం చేశారు .గెలిచే అభ్యర్తులకే పార్టీ టికెట్ ఇస్తుంది అన్నారు. ఈ సమావేశంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, చౌటుప్పల్ ఎంపీపీ తాడూరు వెంకట్ రెడ్డి, నారాయణపురం ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, మునుగోడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమనపల్లి సైదులు, నారాయణపురం మాజీ జెడ్పిటిసి వాంకుడోతు బుజ్జి,బోయ దేవేందర్, మాజీ జెడ్పీటీసీ జాజుల అంజయ్య గౌడ్ వివిధ మండలాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టులో ఎమ్మెల్సీ కవితకు షాక్

**చట్టం ముందు అందరూ ఒకటేనంటూ కోర్టు వ్యాఖ్య**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్:ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ అధికారులు తనను అక్రమంగా అరెస్టు చేశారని, నిబంధనలకు విరుద్ధంగా అరెస్ట్ కు పాల్పడ్డారని సుప్రీంకోర్టు మెట్లు ఎక్కిన ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టులో షాక్ తగిలింది. లిక్కర్ కేసులో అరెస్టయి ఊరట కోసం ప్రయత్నిస్తున్న ఆమెకు చుక్కెదురైంది. కవిత దాఖలు చేసిన రిట్ పిటిషన్ ను కొట్టివేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం, ఈ కేసులో ప్రస్తుతం విచారణ చేయలేమని వెల్లడించింది.రాజకీయ నాయకులైనంత మాత్రాన ప్రత్యేక విచారణ ఉండబోదని, తప్పనిసరిగా కేసును ఎదుర్కోవలసిందేనని స్పష్టం చేసింది. జస్టిస్ సంజీవ్ కన్నా, జస్టిస్ సుంద్రేష్, జస్టిస్ బేల త్రివేది తో కూడిన ధర్మాసనం ఈ కేసు విషయంలో కొన్ని కీలక వ్యాఖ్యలు చేసింది. కవిత వేసిన రిట్ పిటిషన్ లో లేవనెత్తిన అంశాలను విజయ్ మదన్ లాల్ కేసుతో కలిపి విచారణ చేస్తామని పేర్కొంది.చట్టం అందరికీ ఒకటేనని, రాజకీయ నాయకులైనంత మాత్రాన ప్రత్యేక విచారణ ఇక్కడ జరపలేదని, ట్రయల్ ఎదుర్కోవలసిందేనని పేర్కొంది. ఇదే సమయంలో కవిత వేసిన రిట్ పిటిషన్ కు సంబంధించి ఆరు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఈడీ అధికారులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.ఇక ఈ కేసులో బెయిల్ కావాలంటే ట్రయల్ కోర్టులోనే పిటిషన్ దాఖలు చేయాలని కవిత తరవు న్యాయవాదికి సుప్రీం ధర్మాసనం సూచించింది. మహిళ అనే దృష్టితో ట్రయల్ కోర్టు కూడా వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీం ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది.కాగా ఆరో రోజు ఈడి అధికారుల విచారణను ఎమ్మెల్సీ కవిత ఎదుర్కొన్నారు. మరోవైపు సీఎం కేజ్రీవాల్ ను కూడా అరెస్టు చేయడంతో కేసు ఊహించని విధంగా కీలక మలుపులు తిరుగుతోంది. ఏది ఏమైనా సుప్రీం ధర్మాసనంలో కవితకు ఊరట దొరకని క్రమంలో, ఆమె మరోమారు సుప్రీం ఆదేశాలతో ట్రయల్ కోర్టును ఆశ్రయిస్తారా? ఒకవేళ ఆశ్రయించినా ఆమెకు ఈ కేసు నుంచి ఉపశమనం దొరుకుతుందా? అన్నది ప్రశ్నార్థకమే.

# రంగు మారుతున్న రాజకీయం

● బీఆర్ఎస్ ఎంపీ కే కేశవరావు, మేయర్ విజయలక్ష్మితో దీపాదాస్ మున్షీ భేటీ ● బిఆర్ఎస్కు షాక్ తప్పదా?



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్:లోక్సభ ఎన్నికల ముందు కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీకి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత నుంచి బీఆర్ఎస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు, నేతలు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్, బీజేపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా, మరో బీఆర్ఎస్ కీలక నేత, కేసీఆర్ సన్నిహితుడు కే కేశవరావు పార్టీని వీడేందుకు సిద్ధమైనట్లు సమాచారం.శుక్రవారం బీఆర్ఎస్సీనియర్నేత కే. కేశవరావుతో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ దీపాదాస్మున్షీ భేటీ అయ్యారు. బంజారాహిల్స్లోని కేకే నివాసానికి దీపాదాస్ మున్షీ పాటు ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి వెళ్లారు. దాదావు 40 నిమిషాల పాటు తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి కూడా ఉన్నారు. వీరిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించినట్లు సమాచారం.లోక్సభ ఎన్నికల అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు సాగుతున్న సమయంలో కేకేను కాంగ్రెస్ నేతలు కలవడం రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలను చూస్తే.. బీఆర్ఎస్ నాయకుల కాంగ్రెస్ చేరికలు ముమ్మరమయ్యాయని చెప్పొచ్చు. చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి, వికారాబాద్ జిల్లా పరిషత్ ఛైర్మన్ సునీతా మహేందర్ రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరి, లోక్సభ టికెట్లు కూడా దక్కించుకున్నారు.ఈ నేపథ్యంలోనే కేకే, విజయలక్ష్మి కాంగ్రెస్ నేతలతో కలిసి చర్చించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వీరిద్దరూ పార్టీ మారే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు తెరపైకి వస్తున్నాయి. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగిన కేశవరావు, ఇప్పుడు తిరిగి సొంత గూటికి చేరే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అయితే తాను పార్టీ మారడం లేదని కేకే చెప్పడం గమనార్హం. అయితే, త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మరోవైపు, కార్యకర్తలతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని మేయర్ విజయలక్ష్మి చెప్పారు.కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్తరవున పోటీ చేసి ఓటమి పాలైన మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు సహా లోక్సభ ఎన్నికల్లో సీటు ఆశించి భంగపడ్డ నేతలంతా ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీల వైపు చూస్తున్నారు. ఇప్పటికే శానంపూడి సైదిరెడ్డి, ఆరూరి రమేశ్వంటి నేతలు బీఆర్ఎస్ను వీడి బీజేపీ గూటికి చేరిపోయారు. మరికొంత మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు రెడీగా ఉన్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్నేతలు సైతం ఇతర పార్టీల్లోని ముఖ్య నేతలను తమ పార్టీలోకి ఆహ్వానిస్తుండటం గమనార్హం.

DBS

## సేఫ్ డిపాజిట్ లాకర్ - బ్రేక్ ఓపెన్ నోటీసు

DBS బ్యాంక్ ఇండియా లిమిటెడ్ **హబ్సిగూడ** శాఖలో ("**బ్యాంక్**") క్రింద పేర్కొన్న కస్టమర్‌లు ("**లాకర్ హైరర్**") సేఫ్ డిపాజిట్ లాకర్లను ("**లాకర్**") అద్దెకు తీసుకున్నారని సాధారణ ప్రజల సమాచారం కోసం తెలియజేయబడింది. లాకర్ 7 సంవత్సరాల పాటు ఆపరేట్ చేయకుండా ఉంది, అలాగే 3 సంవత్సరాలకు పైగా అద్దెను లాకర్ హైరర్ చెల్లించలేదు.

అద్దె బకాయిలు రికవరీ చేయడానికి, మరియు పేర్కొన్న లాకర్ ఆపరేట్ చేయకపోవడానికి గల కారణాన్ని తనిఖీ చేయడానికి, బ్యాంక్ లాకర్ హైరర్‌కు అనేక రిమైండర్ లేఖలను పంపింది, అయితే ఇప్పటి వరకు లాకర్ హైరర్ నుండి ఎటువంటి స్పందన లేదు.

| లాకర్ అద్దెదారు పేరు | లాకర్ హైరర్ చిరునామా | లాకర్ నంబర్ | లాకర్ అద్దె తేదీ |
|---|---|---|---|
| శ్రీ ఆంజనేయులు V | ఇంటి నం. 5_21_2, వీధి నెం: 8, హబ్సిగూడ, హైదరాబాద్ - 500007 తెలంగాణ | 46 | 16-06-1995 |
| శ్రీ A రవి | 1_181, A VST కాలనీ నాదారం, హైదరాబాద్ - 500076 తెలంగాణ | 123 | 17-06-2001 |
| శ్రీ దేవజని అధికారి | డి.నెం. 2_99A, వీధి నం. 2 B-1/2, కాకతీయ నగర్, హబ్సిగూడ, హైదరాబాద్ - 500007 తెలంగాణ | 172 | 03-03-2002 |

సేఫ్ డిపాజిట్ లాకర్‌పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సవరించిన మార్గదర్శకాల ప్రకారం, బ్యాంక్ పేర్కొన్న లాకర్‌ను బ్రేక్ ఓపెన్ చేసే ప్రక్రియను ప్రారంభిస్తోంది. పేర్కొన్న లాకర్‌లోని కంటెంట్‌లలో ఎవరైనా ఏదైనా క్లెయిమ్ కలిగి ఉంటే, దయచేసి క్లెయిమ్ యొక్క చెల్లుబాటు అయిన రుజువుతో పాటు ఈ నోటీసు తేదీ నుండి ముప్పై (30) రోజులలోపు మా **హబ్సిగూడ** శాఖను సంప్రదించండి. ఒకవేళ, బ్యాంక్ ఎవరి నుండి అయినా లేదా లాకర్ హైరర్ నుండి అద్దెకు సంబంధించిన బకాయిలను పొందనట్లయితే, ఆ లాకర్ బ్రేక్ ఓపెన్‌తో బ్యాంక్ కొనసాగుతుంది. లాకర్ హైరర్‌లకు లేదా బ్రేక్ ఓపెన్ చేయడానికి మరియు పేర్కొన్న లాకర్‌లోని కంటెంట్లకు బ్యాంక్ బాధ్యత వహించదు.

డిబిఎస్ బ్యాంక్ ఇండియా లిమిటెడ్ కోసం,
అధికారిక సంతకము

DBS

## వేలం ప్రకటన

మా బ్యాంక్ యొక్క దిగువ పేర్కొన్న జ్యువెల్ లోన్ కస్టమర్‌లు మా రిమైండర్‌లు మరియు రిజిస్టర్డ్ అడ్రస్ కారణంగా రసీదుతో కూడిన రిజిస్టర్ చేసిన పోస్ట్‌ను ఇప్పటికే వారికి పంపిన తర్వాత కూడా వారి రుణ ఖాతాలను సెటిల్ చేయడంలో విఫలమయ్యారని సమాచారం. పూర్తి రుణ మొత్తాన్ని **30.03.2024**న లేదా అంతకు ముందు సెటిల్ చేయకపోతే, కస్టమర్ తాకట్టు పెట్టిన సెక్యూరిటీలు **30.03.2024న ఉదయం 11.00 గంటలకు** లేదా బ్యాంకుకు అనుకూలమైన మరేదైనా తేదీకి వేలం ద్వారా విక్రయించబడతాయి.తదుపరి నోటీసు లేకుండా మరియు బ్యాంక్ ప్రాంగణంలో లేదా ఈ-వేలం ప్లాట్‌ఫారమ్‌లో బహిరంగ వేలం విక్రయం ద్వారా బ్యాంక్ యొక్క పూర్తి సంతృప్తి కోసం. https://egold.auctiontiger.net

| Ref. No. | కస్టమర్ పేరు | బ్రాంచ్ పేరు | స్థూల ఆదాయం | నికర ఆదాయం |
|---|---|---|---|---|
| 11732903 | యానం నందు | ఆదిలాబాద్ | 28.50 | 25.65 |
| 41131069 | గిన్నె నగేష్ | లక్సెట్టిపేట్ | 21.70 | 21.70 |
| 41130885 | మొహమ్మద్ అబ్దుల్లా | లక్సెట్టిపేట్ | 37.50 | 37.50 |
| 41130955 | షరీన | లక్సెట్టిపేట్ | 20.00 | 20.00 |
| 47730107 | శివరాత్రి యాదమ్మ | మెహదీపట్నం, హైదరాబాద్ | 163.90 | 150.00 |
| 61237368 | గంగారం రమ్య | రామచంద్రాపురం, హైదరాబాద్ | 76.90 | 74.70 |
| 61236743 | కృష్ణవేణి కొట్టూర్ | రామచంద్రాపురం, హైదరాబాద్ | 441.00 | 426.00 |
| 61230514 | మహేందర్ కుర్మ | రామచంద్రాపురం, హైదరాబాద్ | 66.30 | 63.30 |
| 61237283 | నాగులపల్లి దుర్గయ్య | రామచంద్రాపురం, హైదరాబాద్ | 194.90 | 185.20 |
| 61230499 | | రామచంద్రాపురం, హైదరాబాద్ | 303.00 | 280.00 |
| 61236750 | రతనాల పవన్ కుమార్ | రామచంద్రాపురం, హైదరాబాద్ | 443.90 | 399.00 |
| 61236736 | యెర్వా శేఖర్ రెడ్డి | రామచంద్రాపురం, హైదరాబాద్ | 56.00 | 52.00 |

తేది : 20.03.2024
స్థలం : చెన్నై

అధీకృత అధికారి
డిబిఎస్ బ్యాంక్ ఇండియా లిమిటెడ్

• DBS బ్యాంక్ ఇండియా లిమిటెడ్ అనేది DBS బ్యాంక్ లిమిటెడ్ సింగపూర్ నుండి పూర్తి లైసెన్స్ క్రింద అనుబంధ సంస్థ

# సంపాదకీయం

editpage@suryaa.com

తన జీవిత ఆద్యంతం భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం సొంత జీవితాన్ని సైతం వదిలిపెట్టిన ధన్యజీవి, త్యాగధనురాలు, ఆదర్శమూర్తి, యావత్ జాతికే ముఖ్యంగా మహిళా లోకానికే స్ఫూర్తిప్రదాత, ఉద్యమం అనే మాటకే పర్యాయపదం అయిన మల్లు స్వరాజ్యం 93 ఏళ్ల వయస్సులో అలిసి సోలిసి నింగికి పయనమై వెళ్లడం అనేది యావత్ ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి, తమ హక్కుల కోసం ఉద్యమ బాటలో పయనించే ప్రతి ఒక్కరికి తీరని లోటు. అయితే ‘ పుట్టినవారు గిట్టక మానరు ‘ అనే మాట ఎంతటి అక్షర సత్యం, చేదు వాస్తవం అయినప్పటికీ ఎందుకో ఇలాంటి మహామహులు, గొప్ప వ్యక్తులు శాశ్వత నిష్క్రమణ తీసుకున్నప్పుడు మానవత్వం వున్న ప్రతి ఒక్కరి హృదయాలను ఎంతో కొంత ఖచ్చితంగా కలిచి వేయడం తథ్యం. ఇక ఈ గొప్ప ఉద్యమకారిణి మల్లు స్వరాజ్యం జీవిత ప్రస్థానం గురించి చెప్పవలసి వస్తే ఈమె జీవితం వడ్డించిన విస్తరి కాదు, ఆద్యంతం ముళ్ల బాటనే. కేవలం 11 ఏళ్ల వయస్సు లోనే గెరిల్లా యుద్ధం లో శిక్షణ, ఆత్మ రక్షణ పద్ధతులు నేర్చుకోవడం,12 ఏళ్ల వయస్సులోనే ఆంధ్రమహాసభ లో చేరడం ఇక ఆతరువాత ఏకంగా వారి ఇల్లే ఆంధ్ర మహాసభ కు కేంద్రం అయ్యింది. ముఖ్యంగా ఆమెకు చిన్నప్పటి నుంచి కూడా పాటంటే ప్రాణమే, ఆమెకున్న ఈ గొప్ప అభిరుచే ఆంధ్ర మహాసభల్లో సైతం ఆమెకు పాడేందుకు అవకాశం లభించి ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. అయితే ఆమె నిత్యం తనకు

## ఆమెకు పోరాటమే ఊపిరిగా, శ్వాస

స్ఫూర్తి ‘ విస్నూరు దొర చేతిలో సచ్చిన సరే భూమిని వదలను అని పోరుజేసిన ఐలమ్మ ‘ అని చెప్పడం తోనే మల్లు స్వరాజ్యం యొక్క వ్యక్తిత్వం, న్యాయంగా దక్కాల్సిన భూమి ఎవరికీ దక్కాలో వారికే దక్కాలి అనే ఆమె దృఢచిత్తం అంకితభావం మనకు బాగా బోధపడుతుంది. ఇక ఆమె ఉద్యమ ప్రస్థానం గురించి చెప్పాల్సి వస్తే కేవలం 13 ఏళ్ల వయస్సు లోనే విప్లవ గీతమయ్యారు, వినునూర్ దేశముఖ్ దురాగతాలను ఎండగట్టే ఉయ్యాల పాటలను ప్రచారానికి ఆయుధం చేసుకుంది, ఇక 15 ఏళ్ల వయస్సులోనే ఆమె ఉపన్యాసాలు విని జనం ఊర్రుతలూగే వారు అంటే ఆమె ఎంతగా ప్రజల హృదయాల్లో ఆ రోజుల్లోనే కొలువై వున్నారో మనం ఇట్టే ఊహించవచ్చు. ఇక ఈ ఉద్యమ శిఖరం యొక్క గొప్ప ఘనతలు, ప్రత్యేకతలను గురించి చెప్పాల్సివస్తే భూస్వాముల వద్ద వున్న ఆయుధాల స్వాధీనం తో మొదలైన పోరు, పోలీసుల క్యాంపు లా దాకా కొనసాగడం, గ్రామాల మీద దాడి చేసిన పోలీసుల దగ్గర నుంచి ఆయుధాలు గుంజుకోవడం తో మహిళలకు సైతం శిక్షణ ఇచ్చిన స్వరాజ్యం ఆకునూరు, మాచి రెడ్డిపల్లి, సూర్యాపేట, మల్లారెడ్డి గూడెం పోరాటాల్లో కీలక పాత్ర పాత్ర పోషించిన గొప్ప చారిత్రాత్మిక నేపథ్యం ఈ మహెూద్యమకారిణి సొంతం. ఇక నల్గొండ, వరంగల్ జిల్లాల్లో దాదాపు పదిహేను సాయుధ పోరాటాలు ఆమె నాయకత్వం లో జరగడం తో పాటు తాడి, ఈత చెట్లపై నిజాం సర్కారు పెత్తనాన్ని సవాలు చేస్తూ గీసేవాడిదే చెట్టు, దున్నే వాడిదే భూమి ‘ అనే నినాదానికి పార్టీ పిలుపు ఇవ్వడం, అందులో భాగంగా సూర్యాపేట తాలూకా లో నిర్వహణ బాధ్యతలు స్వరాజ్యానికి అప్పజెప్పడం ఆమె యొక్క గొప్ప నాయకత్వ ప్రతిభకు గొప్ప నిదర్శనం. ఇక ఆమె గ్రామరాజ్యాలు, గ్రామ రక్షణ, మహిళా దళాలు ఏర్పాటు చేయడం, తాళ్ల పంపకం, భూ పంపకం వంటి వాటిని ఆమె అత్యంత సమర్థవంతంగా నిర్వహించి అందరి చేత శెభాష్ అనిపించుకుంది ఉద్యమానికే తన జీవితాన్ని త్యాగం చేసిన ఈ మల్లు స్వరాజ్యం. ఇక తన సుదీర్ఘ సాయుధ పోరాట విరమణ అనంతరం 1978 లో మొట్ట మొదటిసారిగా ఎమ్మెల్యే గా పోటి చేసి 5,000 ఓట్ల తేడాతో విజయం సాధించి అత్యంత సాదాసీదాగా అసెంబ్లీ లోకి అడుగుపెట్టడమే కాదు చట్ట సభల్లో తన బాధ్యతను ఒక ఉద్యమం లా భావించి సమస్యలపై చాలా బలంగా తన గళం వినిపించిన ధీశాలి ఈ మల్లు స్వరాజ్యం.ఇక ముఖ్యంగా భుదానోద్యమంలో ఇచ్చినవి, పోరాటం లో కమ్యూనిస్టులు పంచిన భూములు యూనియన్ ప్రభుత్వం వచ్చిన తరువాత వాటిని దొరలు స్వాధీనం చేసుకుంటే, ఎమ్మెల్యే గా వుండి ఆ 900 ఎకరాల భూమిని తిరిగి ప్రజలకు ఇప్పించేందుకు రాజీలేని పోరాటం చేసి ఎట్టకేలకు వారికి ఇప్పించారు మన ప్రజా ఉద్యమకారిణి మల్లు స్వరాజ్యం.

ఏదిఏమైనా ఎమ్మెల్యే పదవి వీడాక కూడా ఆమె పోరాటపంథా ను విడువకుండా 1993 లో సంపూర్ణ మద్యపాన నిషేధం లో చురుకైనా పాత్ర పోషించడం దగ్గర నుంచి తండ్రి ఆస్తిలో మహిళలకు సమాన హక్కు, వరకట్న వ్యతిరేక చట్టం, స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్, మహిళల పేరిట భు పంపిణి వంటి అనేక సమస్యలపై ఎడతెరుపని, మడమ తిప్పని పోరాటం చేసిన మహా గొప్ప యోధురాలు ఈ మల్లు స్వరాజ్యం. ఏమైనా గ్రామాల్లో తిరిగి పనిచేసిన, తుపాకీ పట్టి గెరిల్లాగా వున్నా, అసెంబ్లీ లో నిలబడిన, ఎక్కడైనా, ఎప్పుడైనా దోపిడి ఉన్నంత కాలం పోరాటం ఉంటుంది, పోరాటాలు ఉన్నంత కాలం నేడు మల్లు స్వరాజ్యం మన మధ్య లేకపోయినా ఆమె పేరు మాత్రం సువర్ణ అక్షరాలతో ఎప్పటికి, ఎన్నటికీ లిఖింపబడుతూనే ఉంటుంది. ఇది ఎవ్వరూ కూడా కాదనలేని నగ్న సత్యం, పచ్చి నిజం కూడా. జయ జయహెూ మల్లు స్వరాజ్యం, అమర్ రహే, అమర్ రహే యావత్ జాతి మెచ్చిన వీర వనిత, మహిళల స్ఫూర్తి ప్రదాత మన మల్లు స్వరాజ్యం!

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది
చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి
గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H.
NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society
Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# తమకు ఎలాంటి ‘ రాజ్యాంగ పాలన’ కావాలో తేల్చుకోవలసింది ప్రజలే

- ఓట్ల పరుగు పందెంలో మిగతా విపక్షాలకంటే ముందున్న బీజేపీ
- రానున్న ఎన్నికల్లో 400 సీట్లను గెలుచుకోవటమే లక్ష్యంగా మోహరింపులు
- ‘రాజ్యాంగ పీఠిక నుంచి ‘లౌకిక’ అనే పదాన్ని తొలగిస్తామని వివాదస్పద ప్రకటనలు
- ప్రస్తుత రాజ్యాంగాన్ని హిందువులకు అనుకూలంగా మార్చేస్తామంటూ తీవ్ర వ్యాఖ్యలు
- ఆర్ఎస్ఎస్ ‘మత’ విధానాల్లో భాగమే భారత రాజ్యాంగ మార్పు ప్రస్తావనలు

డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్
9849328496



దేశంలో ఎన్నికల నగారా మ్రోగింది.రానున్న పార్లమెంటు ఎన్నికల్లో విజయాన్ని సాధించటానికి అధికార, ప్రతిపక్ష పార్టీల్లు విభిన్న వ్యూహాలతో,ప్రజాకర్షణ పథకాలతో తమ,తమ పద్ధతుల్లో ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి.సమయం సమీపిస్తున్నకొద్దీ జాతీయ,ప్రాంతీయ పార్టీలలో టెన్షన్ మొదలైంది.ప్రస్తుతం ఈ ఓట్ల పరుగు పందెంలో బీజేపీ మిగతా విపక్షాలకంటే ముందుంది.అందుకు కారణం కేంద్రం లోనూ, కొన్ని ఇతర రాష్ట్రాలలోనూ అధికారంలో ఉన్న బీజేపీకి సహజంగా అంగబలం, అర్ధబలం, సిద్ధాంత పునాది ఉండటంతో కొన్ని అదనపు శక్తి, యుక్తులు,హంగులు, ఆర్భాటాలు సహజంగా కలిసి వచ్చాయి.దానికితోడు, బీజేపీ అనుసరించే మెజార్టీ ‘హిందుత్వ’ మత పోకడ ఎన్నికల బరిలో గెలిచే అవకాశాలను మెరుగు పరిచాయి. హిందూ ఓటర్ల మనసు గెలిచేందుకు ఎత్తుగడలలో భాగంగా బీజేపీ నేతలు వారి భాషను,ప్రచార శైలిని మార్చారు. అత్యాధునిక ప్రచార, ప్రసార సాధనాల్లో వినూత్న సరళిలో మార్పులు చేశారు. రానున్న ఎన్నికల్లో 400 సీట్లను గెలుచుకోవటమే లక్ష్యంగా బీజేపీ,దాని అనుబంధ శ్రేణులు మోహరించాయి. లక్ష్యం సాధన కోసం హిందూ ఓటర్ల పై ఒక గురుతర బాధ్యతను పెట్టారు.దాన్ని నెరవేరిస్తే ప్రస్తుత రాజ్యాంగాన్ని హిందువులకు అనుకూలంగా మార్చేస్తాం’ అంటున్నారు. దానికి అనుగుణంగా ప్రస్తుత కర్నాటక బీజేపీ ఎంపీ,మాజీ కేంద్రమంత్రి అనంత్‌కుమార్ హెగ్డే ఇటీవల ఒక సంచలన వ్యాఖ్యలు చేసారు.లోగడ ఈ పెద్దమనిషే మరో సందర్భంలో ‘రాజ్యాంగ పీఠిక నుంచి ‘లౌకిక’ అనే పదాన్ని తొలగిస్తాం’ అని కూడా అన్నాడు. అయినా అధి కారంలో ఉన్న పార్టీ పెద్దలు ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకున్నారు. అంటే, దాని అర్థం, డా.బీ.ఆర్.అంబేద్కర్ రాసిన సర్వోత్కృష్ట రాజ్యాంగాన్ని మార్చివేసి,ఇంతవరకు కుల,మత,వర్గ,వర్ణ, లింగ, జాతి విభేధాల కు అతీతంగా దేశంలో అణగారిన ప్రజలకు భద్రతను,సమాన అవకాశాలను,మానవ,పౌర హక్కులను కల్పిస్తున్న భారత రాజ్యాంగ సమున్నత లక్షాలనే మార్చివేస్తామని ఆయన మాటల్లో అర్థం స్ఫురిస్తుంది.

నిజానికి ఇదేమీ కొత్త ప్రకటనేమీ కాదు.పైగా అనంత కుమార్ హెగ్డే వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే కాదు.వాస్తవానికి భారత రాజ్యాంగాన్ని తిరగ రాయాలనేది బీజేపీ మాతృసంస్థ అయిన ఆర్ఎస్ఎస్‌కు దశాబ్దాల కాలం నాటి తీరని స్వప్నం.గోల్వాల్కర్ ప్రస్తుత రాజ్యాంగం అమల్లోకి రావడాన్ని ఆయన ఏనాడు స్వాగతించలేదు.పైగా ఆయన కలలుగన్న లక్షాన్ని చేరుకోవడానికి ప్రస్తుత రాజ్యంగ ప్రకరణాలు అడుగడుగునా అడ్డుపడుతున్నాయి.అరుదుగానైనా హైకోర్టు,సుప్రీంకోర్టులు తామున్నామంటూ మేల్కొంటూ అప్పడప్పుడు ఇచ్చే తీర్పుల మెరుపులు బీజేపీ లక్షాలకు చెక్ పెడుతున్నాయి. అందువల్ల డా.బీ.ఆర్. అంబేద్కర్ విరచిత ప్రస్తుత రాజ్యాంగాన్ని తిరగ రాయాల్సిందే అంటూ బీజేపీనేతలు అవకాశం దొరికిన ప్రతిసారీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఈ విషయాన్ని ఎడతెగకుండా ప్రస్తావిస్తూనే ఉన్నారు. అంటే, ఆర్ఎస్ఎస్ ‘మత’ విధానాల్లో భాగమే ఈ భారత రాజ్యాంగ మార్పు ప్రస్తావన. ఆ కలను సాకారం చేసుకునేందుకు ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ తన ఎన్నికల స్ట్రాటజీని,రోడ్ మ్యాపును స్పష్టంగా రూపొందించుకొని ముందుకు సాగుతుంది.ఈ పరిణామాలను జీర్ణించుకో లేక లౌకిక,ప్రజాస్వా వాదులు మరో ప్రత్యమ్నాయ మార్గం కోసం అన్వేషిస్తున్నారు.అదే సమయంలో విపక్షాలు అనైక్యతతో తర్జనబర్జన పడుతూ తెల్లబోయి, కళ్ళప్పగించి వేగంగా మారుతున పరిణామాలను చేష్టలుడిగి చూస్తున్నాయి. విపక్షాలకంటూ ఒక ఆదర్శ నాయకుడూ లేడు.ఐక్యతా సిద్ధాంతమూ లక్ష్యమూ లేదు. ఉమ్మడి ప్రణాళిక లేదు.వ్యూహాలూ అంతకన్నా లేవు.పేరుకే హడాహుడీ చేసిన “భారత్” కూటమిని అనుకున్నారు.అది కూడా కాలంగడుస్తూ ఉన్నా, ఇప్పటికీ ఒక రూపును కూడా తీసుకోలేదు. భారత కూటమి అలాగే, 2019లో జరిగిన పూల్వామాదాడి సంఘటనను అడ్డుపెటుకొని మన ప్రభుత్వం సర్జికల్ స్ట్రైక్ చేసింది.సైనిక సాహసాలు, ప్రాణ త్యాగాలను సైతం బీజేపీ తెలివిగా రాజకీయంగా ఓట్లు దండుకోవడానికి వినియోగించింది. ప్రతి సంఘటననూ ఎన్నికల ప్రయోజనం దృష్టితో చూసింది.ప్రధానీ ప్రతి చర్యను అహేతుకంగా పొగడటం, అనుచితంగా బాకాలూదటం, పూనకం వచ్చినట్లు మోదీ,మోదీ అంటూ హిస్టీరియాతో ఊగిపోవడం బీజేపీ శ్రేణులకు బాగా అలవాటైంది.దేశ,విదేశాల్లో మోదీ మ్యానియా పెరిగిపోయింది. మోదీకి ఎంతసేపూ అధికార దాహమే తప్ప సామాన్య ప్రజల సమస్యలు ఆయనకు పట్టవు.మణిపూర్ మంటల్లో మండిపోతూ ఉంటే అక్కడికి వెళ్ళడు. వారి మొర ఆలకించడు.వారి సమస్యలపట్ల ఉద్దేశపూరిత ఉదాసీనత.సూధీర్ఘమౌనం ఏలా అర్థం చేసుకోవాలి?

ఇప్పుడు 2024 ఎన్నికలలో ఓట్ల కోసం అయోధ్యలో రామమందిర నిర్మాణం, ఎన్నికల ప్రచారాస్త్రంగా మార్చివేయనున్నారు. మెజార్టీ హిందువుల ఓట్ల కోసం మైనార్టీ ప్రజలను పీడించటం బీజేపీకే చెల్లింది.దానికి ‘గోదీ మీడియా’ వత్తాసు పలుకుతుంది.జర్నలిజం మౌలిక సూత్రాలను,విలువలను మరచి అసత్యాలను,అర్ధ సత్యాలను బాహాటంగా విస్తృతంగా ప్రాపగాండా చేస్తుంది. ఇప్పుడు 90 శాతం మీడియా,శిక్షణ పొందిన సోషల్ మీడియా సంస్థలు అదానీ హస్తగతం అయింది.అది తన మిత్ర ధర్మాన్ని పాటిస్తుంది.

విపక్షాలు ఎంత ఘీపెట్టినా, ఎన్ని నిరసన ప్రదర్శనలు చేసినా అధికార బీజేపీ నేతలకు ప్రజాసమస్యలు పట్టవు.పైగా సీఏఏను మొండిగా అమలు చేస్తామని ప్రకటిస్తూ మైనార్టీ మతస్తుల్లో భయాంధోళనలను సృష్టిస్తుంది.దేశంలో మత విద్వేషాలు రెచ్చగొడుతూ మళ్లీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు పనిచేస్తున్నాయి. అందుకే ఫ్యాసిస్టు విధానాలు అయిన..” ఒకే దేశం,ఒకే మతం, ఒకే ఎన్నిక, ఒకే పన్ను,ఒకే నేత” అంటూ పాలనా వికేంద్రీకరణ’ కు స్వస్తిచెప్పింది. ఏకవ్యక్తి పాలనకు ప్రజలను ఆయిత్తపరు-స్తుం ది. ఇప్పుడు రాజ్యాంగ మనుగడకే ముప్పు వచ్చింది.అందుకు అనుగుణంగా మూడు రాజ్యాంగ చట్టాల పేర్లను మార్చారు. కొత్త నిబంధనలు చేర్చారు.చట్టాలను పూర్వం కంటే కఠిన తరం చేశారు.అయినా బీజేపీ నేతలకు తృప్తికలగడం లేదు.మొత్తంగా రాజ్యంగానికి సమూల మార్పులు తెస్తూ హిందువులకు అనుకూలంగా రాజ్యాంగాన్ని మార్చేస్తానంటూ బీజేపీ,దాని అనుబంధ సంస్థలు కంకణం కట్టుకొని లౌకిక పదం స్థానంలో ‘హిందూ’ దేశంగా భారత్‌ను మారుస్తామంటూ ప్రచారం చేస్తున్నారు. అందుకోసమే తమకు 400సీట్లు ఇవ్వమని ప్రజలను బీజేపీ కోరుతుంది. ఇక ప్రజలే తమకు లౌకిక రాజ్యం కావాలో... అఖ్కర్లేదో...వారే తేల్చుకోవాలి. వారికే పూర్తి బాధ్యత వదిలివేయబడింది.తమ భవిష్యత్తు నిర్ణయించుకోవల్సింది ప్రజలే.మరొకరు కాదు.

వివిధ భాషలకు, మతాలకు, సంస్కృతులకు ఆలవాలమైన విశాల భారతావని కావాలో ,లేదా “ఒకే మత దేశంగా” ఉండాలో రేపు ఓటు వేసే ముందు ప్రతి పౌరుడూ ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ప్రస్తుతం డా.బీ.ఆర్. అంబేద్కర్ విరచిత రాజ్యాంగం అంటే నూట ముప్పై కోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా ఉంది. కాలానుగుణంగా నూతన అవసరాల మేరకు రాజ్యాంగాన్ని సవరించుకొనే వెసులుబాటు అందులో ఉంది. ప్రస్తుత రాజ్యాంగం “భిన్నత్వంలో ఏకత్వానికి “ ప్రతి రూపంగా ఉంది. ప్రస్తుత రాజ్యాంగం ప్రజలు స్వేచ్ఛగా బతికేందుకు రూపొందించుకున్న హక్కు పత్రం. విభిన్న జాతులు, మతాలు, కులాలు, ఆచార వ్యవహారాలకు, సంప్రదాయాలకు, సంస్కృతులకు, ఆహారాపు అలవాట్లకు రక్షణ కల్పించే మహెూన్నత విలువలతో కూడినది.ఈ రాజ్యాంగం దేశ ప్రజల ఆశలకూ, ఆశయాలకు ప్రతిబింబం అయిన సర్వసత్తాక, ప్రజాస్వామ్య, సామ్యవాద,లౌకిక,గణతంత్ర రాజ్యాంగా మనం నిర్మించుకున్నాం. అలాంటి రాజ్యాంగాన్ని దాని ప్రవేశిక (ప్రియాంబుల్) మార్చేస్తా మని బీజేపీ నేతలు అంటూఉంటే ఇక అంతిమంగా విజ్ఞత ప్రదర్శించి తేల్చుకోవలసింది ప్రజలే.

# ముగిసిన రాహుల్ జోడో యాత్ర

- వరుస సుడిగాలి పర్యటనలతో ప్రధాని బిజీ బిజీ
- నెలలు తరబడి రాహుల్ యాత్రలు
- కర్నాటక, తెలంగాణాలో కనిపించిన ఫలితాలు
- ఈవీఎంలను టాంపరింగ్ చేసి మోదీ గెలుస్తున్నాడంటూ కాంగ్రెస్ ఆరోపణలు
- దీదీ పేరు ప్రస్తావించకుండా సాగిన నాయకుల ప్రసంగాలు
- యాత్ర ప్రభావం ఫలితాలపైనే దృష్టి సారించిన విశ్లేషకులు

ఎల్ కృష్ణమోహన్
9705472099



ఎన్నికల కమిషన్ లోకసభతో పాటు నాలుగు రాష్ట్రాల ఎన్నికల నగారా మోగించింది. గత శనివారం నాడు ఎన్నికల షెడ్యూలు కూడా ప్రకటించింది. రాజకీయ పార్టీలు పొత్తులు, ప్రచారాలతో బిజీ బిజీ అవుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో భారతీయ జనతాపార్టీ వ్యూహాత్మకంగా దూసుకుపోతోంది. షెడ్యూలు ప్రకటన రావడానికి ముందే ప్రధానమంత్రి నరేంద్రమోదీ యావత్ దేశం సుడిగాలి పర్యటన చేస్తూ.. లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ.. క్షణం వృధా చేయకుండా ప్రచారం చేసుకుంటున్నారు. మరి ఆ జోరు మాత్రం ప్రతిపక్షాల్లో కనిపించడం లేదు. పేరుకు ఇండియా కూటమిగా ఏర్పడ్డా ఎక్కడా ఒక్క సభ కూడా పెట్టిన దాఖలాలు కనిపించలేదు. ఇండియా కూటమిని ఏర్పాటు చేసిన బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ మాత్రం కూటమి నుంచి తప్పుకొని బీజేపీతో చేతులు కలిపి తిరిగి బిహార్‌కు ముఖ్యమంత్రి అయ్యారు. కూటమికి ఇది పెద్ద దెబ్బే అని చెప్పుకోవచ్చు.

ఇక ప్రతిపక్ష కాంగ్రెస్ విషయానికి వస్తే రాహుల్‌గాంధీ గత ఏడాది నుంచి భారత్ జోడో యాత్ర అంటూ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు యాత్ర సాగించారు. దాని మైలేజీ కాస్తా కర్ణాటకపై కనిపించింది. అటు తర్వాత మళ్లీ తాజాగా మణిపూర్ నుంచి ముంబై వరకు భారత్ జోడో న్యాయయాత్రను ప్రారంభించారు. ఈ సారి ఆయన యాత్ర బస్సు ద్వారా కొనసాగింది. నెలల పాటు కొనసాగినా ఈ యాత్ర ఎట్టకేలకు ముంబైలో ఆదివారం నాడు ముగిసింది. ఇక లోకసభ ఎన్నికలు ప్రారంభం కావడానికి సరిగ్గా నెల కూడా సమయం లేదు. ఈ సమయాన్ని అయిన కాంగ్రెస్ సద్వినియోగం చేసుకుంటే అదనంగా కొన్ని సీట్లు అయినా దక్కించుకొనే అవకాశం ఉంటుంది.

అయితే ప్రతిపక్షాలకు చెందిన ఇండియా కూటమి ఆదివారం నాడు ముంబైలోని ఐకానిక్ శివాజీ పార్క్‌లో ఓ పెద్ద బహిరంగ సభ ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో ప్రతిపక్ష నాయకులు ప్రధానంగా రాజ్యాంగాన్ని కాపాడాలని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్స్‌లపై అనుమానాలు వ్యక్తం చేశాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కూడా ఇటీవల మోదీ ఈవీఎంలను టాంపరింగ్ చేసి గెలుస్తున్నాడని ఆరోపించారు. ఈవీఎంలే లేకపోతే మోదీ గెలిచేవాడు కాదని ఆయన పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. ఇక మాట్లాడిన మూడో అంశం ఎలక్టోరల్ బాండ్లు...ఇది పెద్ద స్కాం అని దీనిపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ఇక అసలు విషయానికి వస్తే ఈ ఏడాది జనవరిలో రాహుల్ గాంధీ ప్రారంభించిన భారత్ జోడో న్యాయ్‌యాత్ర శనివారంతో ముగిసింది. యాత్ర ముగిసిన సందర్భంగా ప్రతిపక్షాలన్నీ కలిసి ముంబైలో ఓ ర్యాలీ ఏర్పాటు చేశాయి.

ఇక ముంబైలోఆదివారం ప్రతిపక్ష నాయకులు అందరూ ఏకమయ్యారు. లోకసభ ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరించారు. ఇక ప్రతిపక్ష నాయకుల్లో కీలకమైన వారి విషయానికి వస్తే తమిళనాడు ముఖ్యమంత్రి ఎం కె స్టాలిన్, జార ండ్ ముఖ్యమంత్రి చంపై సోరెన్, మాజీ మహారాష్ట్ర ముఖ్యమంత్రి, శివసేన (యూబీటి) నాయకుడు ఉద్దవ్ థాక్రే, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడీ) నాయకుడు తేజస్వి యాదవ్, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ-ఎస్‌పీ) ప్రెసిడెంట్ శరద్ పవార్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకుడు సౌరబ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక ఆదివారం నాడు ముంబైలోని శివాజీ పార్క్‌లో జరిగిన ఇండియా కూటమి సమావేశానికి జనాలు కూడా బాగానే వచ్చారని చెప్పుకోవచ్చు. కాగా దేశంలో ఏప్రిల్ 19 నుంచి ఎన్నికలు ప్రారంభం కాబోతున్నాయి. జూన్ 1తో ముగుస్తాయి. మొత్తం ఏడు విడతల్లో పోలింగ్ జరగబోతోంది. జూన్ నాలుగవ తేదీన ఫలితాలు వెలువడతాయి. ఇక సభలో మాట్లాడిన వక్తలు అధికార భారతీయ జనతాపార్టీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధానంగా ఈవీఎంల గురించి తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. అయితే ఈ సమావేశంలో ఉద్దేశపూర్వకంగానే మమతా బెనర్జీ ప్రస్తావన రాకుండా జాగ్రత్తపడ్డారు. ఈ సమావేశానికి ఆమె గైర్హాజరయ్యారు. ఇక అసలు విషయానికి వస్తే పశ్చిమ బెంగాల్‌లో పొత్తులో భాగంగా కాంగ్రెస్‌కు ఒకటి లేదా రెండు సీట్ల కంటే ఎక్కువ సీట్లు ఇచ్చేది లేదని తెగేసి చెప్పారు. దీనిపై కాంగ్రెస్ నాయకుడు అధీర్ రంజన్ చౌదరి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం జరిగింది. అందుకే కాంగ్రెస్ పార్టీ వారు దీదీ పేరు ప్రస్తావించకుండా నాయకులు ప్రసంగాలు కొనసాగించారు.

ఇదిలా ఉండగా ఇండియా కూటమి బీటలు వారుతోందన్న ఊహాగానాలు వెల్లువెత్తుతున్న క్రమంలో ప్రతిపక్షనాయకులు తెజస్వి యాదవ్, ఫారూఖ్ అబ్దుల్లా, స్టాలిన్ మాత్రం కాంగ్రెస్ నాయకత్వం.. రాహుల్‌గాంధీని తమ నాయకుడుగా అంగీకరించారు. భారత్ జోడో యాత్రను రాహుల్ గాంధీ విజయవంతంగా పూర్తి చేశారని రాహుల్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. ఈ సమావేశంలో మాట్లాడిన వక్తలు అందరూ కూటమిని వీడిపోయిన బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌పై విరుచుకుపడ్డారు. పోయిన వారు ఎలాను పోయారు.. వారి గురించి పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఇక ముందుకు సాగుదాం అంటూ పిలుపునిచ్చారు.

తాము ఒక పార్టీ కోసం లేదా ఒక వ్యక్తి కోసం పోరాడటం లేదు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న వారిపై పోరాటం చేస్తున్నామన్నారు. తాను భారత్ జోడో యాత్ర ఎందుకు చేయాల్సి వచ్చిందో రాహుల్ ప్రస్తావించారు. దేశ ప్రజలకు దేశంలో జరుగుతున్న పరిణామాల గురించి పెద్ద అవగాహన లేదని.. వారిలో చైతన్యం కలిగించేందుకే ఈ యాత్ర చేయాల్సి వచ్చిందని వివరించారు.ఈ యాత్ర తాను ఒక్కడినే చేయలేదు. తనతో పాటు ప్రతి ఒక్క ప్రతిపక్ష నాయకులు పాల్గొన్నారు. ఉదాహరణకు ఉద్దవ్ థాకరే, తేజస్వి యాదవ్‌లు కూడా యాత్ర పాల్గొన్నారని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ అన్నారు.

ఇక రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ముగింపు తర్వాత ఆదివారం ముంబైలో బిజీబిజీ గడిపారు. మహాత్మాగాంధీ ముంబై నివాసం మణి భవన్‌కు వెళ్లి శ్రద్ధాంజలి ఘటించి వచ్చారు. అటు తర్వాత శివాజీ పార్క్‌లో బాల్ థాకరే మెమొరియల్‌ను వెళ్లి వచ్చారు. కాగా శనివారంతో రాహుల్ భారత్ జోడో న్యాయ యాత్ర ముగిసింది. ముగింపు సందర్భంగా ఆయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సమాధిని సందర్శించారు. అయితే అక్కడికి సమీపంలో ఉన్న సావర్కర్ మొమొరియల్‌ను మాత్రం పట్టించుకోకుండా వెళ్లిపోయారు. ఒక వైపు ప్రతిపక్షాల కూటమి ముంబైలో పెద్ద ఎత్తున సభకు ఏర్పాటు చేయడంలో బిజీబిజీగా ఉంటే అదే సమయంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రతిపక్షాలపై పెద్ద ఎత్తున విరుచుకుపడ్డారు. శివసేన ప్రజలకు ఈ రోజు బ్లాక్‌డే అని వ్యాఖ్యానించారు. శివాజీ పార్క్ నుంచి బాలాసాహెబ్ థాక్రే యావత్ దేశాన్ని ఇక్కడి నుంచి గైడ్ చేశారని.. అదే పార్కులో ప్రతిపక్షాలు వీర్‌సావర్కర్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. ఆయనను విమర్శిస్తున్నారు. ఇది దృష్టకరమని.. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్షాలకు గట్టిగా బుద్ధిచెబుతాయన్నారు ఏక్‌నాథ్ షిండే.

సభకు వచ్చిన వారిని ఉద్దేశించి రాహుల్ ప్రసంగించారు. ఈవీఎంలు లేకుండా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల్లో గెలవలేరని అన్నారు. మోదీ అత్యంత అవినీతి పరుడని వ్యాఖ్యానించారు. 56 అంగుళాల చాతీ గల ఆ వ్యక్తి దొల్ల.. అధికారం ముసుగులో అవినీతికి పాల్పడుతున్నరని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాహుల్ బాటలోనే ఫారూక్ అబ్దుల్లా కూడా పయనించారు. ఈవీఎంపై విమర్శలు గుప్పించారు. ఓటర్లు ఓటు వేసే ముందు వీవీపాట్ స్లిప్‌ను ఒక సారి వెరిఫై చేసుకోవాలని సూచించారు. ఇది మన దేశం, మన ఓటును మనం కాపాడుకోవాలి.. ఈవీఎం ఓ దొంగ.. మీరు ఓటు వేసే ముందు ఒకసారి చెక్ చేసుకోవాలని సూచించారు. కేంద్రంలో ఇండియా కూటమి వచ్చిన తర్వాత ఈవీఎంలు గత చరిత్రే అని వ్యాఖ్యానించారు ఫారూఖ్ అబ్దుల్లా. ఎలక్షన్ కమిషన్‌కు స్వయం ప్రతిపత్తి కల్పిస్తామని ఆయన అన్నారు. ఆప్‌కు చెంది సౌరబ్ భరద్వాజ మాట్లాడుతూ.. ఈవీఎంలకు కౌంటర్ ఇచ్చేందుకు ప్రతి ఒక్కరు పెద్ద ఎత్తున వచ్చి ఓట్లు వేయాలని కోరారు.

ఈవీఎంల తర్వాత ప్రతిపక్షాలు ఎలక్టోరల్ బాండ్ స్కీంపై ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టు ఇటీవలే బాండ్ల చట్ట వ్యతిరేకమని తీర్పు చెప్పింది. తక్షణమే నిలిపివేయాలని.. వివరాలను ఎలక్షన్‌కు కమిషన్ ఇవ్వాలని ఆదేశించింది. ఇక తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ బీజేపీ ప్రభుత్వం అత్యంత అవినీతి ప్రభుత్వమని .. ఎలక్టోరల్ బాండ్ స్కీం వైట్ కాలర్ కరప్షన్ అని వ్యాఖ్యానించారు. దేశానికి బీజేపీతో ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు డీఎంక చీఫ్.

ఇటీవల కాలంలో ప్రధానమంత్రి తరచూ మోదీ కీ గ్యారంటీ అనే నినాదాన్నిమాజీ బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ ఎద్దేవా చేశారు. మోదీజీ ప్రస్తుతం గ్యారంటీల గురించి మాట్లాడుతున్నారు. మరి ఇతర గ్యారంటీల గురించి మరిచారా అని సూటిగా ప్రశ్నించారు. ముందు మా చాచా అంటే చిన్నాన్న నితీష్‌కుమార్ గురించి గ్యారంటీ ఇవ్వండి అన్నారు. ఇక్కడ నితీష్ కుమార్ మీ వెంట ఎన్నిరోజులు ఉంటారో గ్యారంటీ ఇవ్వండి అని తేజస్వి ఎద్దేవా చేశారు.

ఇక కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లిఖార్జు ఖర్గే కూడా తెజస్వి యాదవ్‌తో గొంతు కలిపారు. మోదీ గ్యారంటీ కేవలం సంపన్నులకే.. కానీ మా గ్యారంటీ సాధారణ పౌరుడికి అని ఖర్గే అన్నారు. దీనికి ఉదాహరణగా తమ పార్టీ కర్ణాటక, తెలంగాణలో ఇచ్చిన గ్యారంటీలను పూర్తి చేస్తున్నామని చెప్పారు. భారత్ జోడో యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసినందుకు ప్రతిపక్ష నాయకలు రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ మిమ్మల్ని చూసి రాహుల్‌ను ఉద్దేశించి భయపడుతోందన్నారు నాయకులు. ఎందుకంటే మీ పేరు గాంధీ కాబట్టి. ఈ రోజు వివిధ సిద్ధాంతాలు కలిగిన నాయకులు అంతా ఒక వేదికపై ఆసీనులయ్యామని.. అదే ఇండియా బ్యూటీ అని జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మహబూబా ముఫ్తీ అన్నారు. మనమంతా కలిసి రాజ్యాంగాన్నికాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మోదీ దేశాన్ని ముక్కలు ముక్కలుగా విడగొట్టాలనుకున్న సమయంలోరాహుల్ భారత్ జోడో యాత్ర చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు తెజస్వి.. బీజేపీ ప్రభుత్వం అసత్యాలు ప్రచారం చేస్తోందని.. ప్రభుత్వాలను కూలుస్తున్న సమయంలో రాహుల్ యాత్రతో ప్రజల్లో బీజేపీ కుట్రలను బహిర్గతం చేశారని రాహుల్‌ను వక్తలు ప్రశంసలతో ముంచెత్తారు.

మరాఠా స్ట్రాంగ్‌మెన్ శరద్ పవార్ వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. 1942 ముంబైలో మహాత్మాగాంధీ క్విట్ ఇండియాకు పిలుపు ఇచ్చారు. ప్రస్తుతం ఇదే ముంబై నుంచి క్విట్ బీజేపీకి పిలుపునివ్వాలన్నారు. థాక్రే మాత్రం బీజేపీ బెలూన్ లాంటిది దురదృష్టవశాత్తు మనమే దానికి గాలి నింపాము. అయితే ఈసారి అబ్ కీ బార్ బీజేపీ తడిపార్.. అంటే బీజేపీని ఈ సారి తరిమి కొడతామని ఉద్దవ్ థాక్రే పిలుపునిచ్చారు.

ఇదిలా ఉండగే బీజేపీ .. షిండే శివసేన ఉద్దవ్ థాక్రేపై విరచుకుపడింది. తన తండ్రి సిద్దాంతాలకు విరుద్ధంగా కాంగ్రెస్‌తో జతకట్టారని మండిపడ్డారు. ఆదివారం నాడు బాల్‌సాహెబ్ పాత వీడియోను సోషల్ మీడియాలో ఎక్స్ పోస్ట్ చేశారు. ఈ వీడియోలో బాలాసాహెబ్... తాను కాంగ్రెస్‌తో జట్టుకట్టని.. శివసేనను కాంగ్రెస్ కానీయని.. కావాలనుకుంటే శివసేనను మూసుకుంటానని చెప్పారు. అదే ఆయన కుమారుడు కాంగ్రెస్ తో జట్టుకట్టిందని షిండే శివసేన ఉద్దవ్ పై మండిపడింది.

మొత్తానికి చూస్తే ప్రతిపక్షాల ఇండియా కూటమిలో నీతీష్ ఉన్నప్పటి జోష్ కనిపించలేదు. ఏద సాదాసీదాగా కొనసాగినట్లు కనిపించింది. మరి తదుపరి సమావేశంలో అయినా ఈ జోరు కనిపిస్తుందా లేదా వేచి చూడాల్సిందే.

# భారత విద్యార్థులకు ఇంద్రానూయీ సూచనలు

వాషింగ్టన్: అమెరికా లో వెలుగుచూస్తున్న భారతీయ, భారత మూలాలున్న విద్యార్థుల మరణాలు, అదృశ్యం ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వీటిపై పెప్సీకో మాజీ సీఈఓ ఇంద్రానూయీ స్పందించారు. స్థానిక చట్టాలను గౌరవిస్తూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ మేరకు ఆమె మాట్లాడిన వీడియోను న్యూయార్క్లోని భారత రాయబార కార్యాలయం ఎక్స్లో పోస్టు చేసింది. ఇటీవల కొందరు విద్యార్థులు ఎదుర్కొన్న దురదృష్టకర పరిస్థితుల గురించి విన్నాను. అందుకే మీతో మాట్లాడేందుకు ఈ వీడియో రికార్డు చేశాను. ఈ పరిస్థితుల్లో మీరు జాగ్రత్తగా ఉండటం ముఖ్యం. చట్టానికి లోబడి ఉండండి. రాత్రి వూట చీకటి ప్రదేశాలకు ఒంటరిగా వెళ్లకండి. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి. దయచేసి అతిగా మద్యం సేవించకండి. ఇవన్నీ విపత్తుకు దారితీసే అంశాలు. కుటుంబాలకు దూరంగా అమెరికాకు వచ్చిన కొత్తల్లో స్నేహితులు, కొత్త అలవాట్ల వంటివాటిపై జాగ్రత్తగా ఉండండి. భారతీయ విద్యార్థులు కఠోర శ్రమ, విజయానికి చిరునామాలు. అదే సమయంలో కొందరు ఫెంటానెల్ వంటి డ్రగ్స్కు బానిసలవుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. అవి ప్రాణాంతకం. మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు కెరీర్ అవకాశాలను దెబ్బతీస్తాయి. అలాగే మీ వీసా స్టేటస్ గురించి తెలుసుకోవాలి. పార్ట్టైం ఉద్యోగం విషయంలో దానికున్న చట్టబద్ధతను అర్థం చేసుకోవాలి. అమెరికాలో విదేశీ విద్యార్థిగా మీకున్న హద్దులు తప్పక తెలుసుకోవాలి అని ఇంద్రానూయీ సూచించారు. విద్యాసంస్థల పట్ల అవగాహనతో ఉండాలని, స్కామ్లు, సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అమెరికాలో చదువుతున్న హైదరాబాద్కు చెందిన అబ్దుల్ మహమ్మద్ అనే విద్యార్థి మార్చి 7వ తేదీ నుంచి అదృశ్యమయ్యాడు. తమకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు ఫోన్కాల్ వచ్చిందని అబ్దుల్ తండ్రి సలీం పేర్కొన్నారు. అడిగిన మొత్తం ఇవ్వకపోతే కుమారుడి కిడ్నీ విక్రయిస్తామని హెచ్చరించినట్లు చెప్పారు.



# సుప్రీంలో పిటిషన్ ఉపసంహరించుకున్న కేజ్రీవాల్



- సీఎం కుటుంబసభ్యుల గృహ నిర్బంధం
- అత్యవసర విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు ఓకే
- ప్రత్యేక కోర్టు ఎదుట కేజ్రీవాల్ను హాజరుపరచిన అధికారులు
- భాజపా కార్యాలయం ఎదుట ఆప్ కార్యకర్తల ఆందోళన

డిల్లీ: మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ను ఈడీ అధికారులు అరెస్టు చేయడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తన అరెస్టును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ను సీఎం ఉపసంహరించుకున్నారు. దీంతో ఆయనను మరికాసేపట్లో ఈడీ కోర్టు ముందు హాజరుపర్చనుంది. తొలుత కేజ్రీవాల్ అభ్యర్థనపై నేడు అత్యవసర విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ పిటిషన్పై ప్రత్యేక త్రిసభ్య ధర్మాసనం విచారణ జరుపుతుందని సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ వెల్లడించారు. అయితే, ఈ విచారణ.. ట్రయల్ కోర్టులో రిమాండ్ ప్రొసీడింగ్స్తో క్లాష్ అవుతుందని సీఎం తరపు న్యాయవాదులు అత్యున్నత న్యాయస్థానానికి తెలిపారు. అందువల్ల పిటిషన్ను ఉపసంహరించుకునేందుకు అనుమతించాలని కోరారు. ట్రయల్ కోర్టు తీర్పునకు అనుగుణంగా మరో పిటిషన్తో సుప్రీంను ఆశ్రయించనున్నట్లు తెలిపారు. ఈ పరిణామాల అనంతరం కేజ్రీవాల్ను ప్రత్యేక కోర్టు ఎదుట అధికారులు హాజరపర్చనున్నారు.

**గృహనిర్బంధంలో కుటుంబం..**

మరోవైపు, సీఎం కుటుంబసభ్యులను గృహ నిర్బంధంలో ఉంచినట్లు దిల్లీ మంత్రి గోపాల్ రాయ్ ఆరోపించారు. శుక్రవారం ఉదయం కేజ్రీవాల్ నివాసానికి మంత్రి వెళ్లగా ఆయనను లోనికి వెళ్లకుండా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. దీనిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం అరెస్టయ్యారు. ఆయన కుటుంబ సభ్యులు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నారో తెలియదు. ఇంట్లో వృద్ధ తల్లిదండ్రులున్నారు. వారందరినీ కలిసి ఓదార్చేందుకు, ధైర్యం చెప్పేందుకు మమ్మల్ని లోపలికి అనుమతించట్లేదు. ఏ చట్టం కింద వారిని గృహ నిర్బంధంలో ఉంచారు? తప్పుడు కేసులో సీఎంను శిక్షిస్తున్నారు సరే.. ఆయన వృద్ధ తల్లిదండ్రులు, పిల్లలపై కేంద్రానికి ఎందుకింత కక్ష? అని గోపాల్ రాయ్ మండిపడ్డారు.

**పోలీసుల అదుపులో మంత్రులు..**

కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆప్ నేతలు రోడ్డెక్కారు. భాజపా కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. నిరసనలు చేపట్టిన ఆప్ మంత్రులు ఆతిశీ, సౌరభ్ భరద్వాజ్ను అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.

# ఎమ్మెల్యే దానం నాగేందర్కు హైకోర్టు నోటీసులు



తెలంగాణ బ్యూరోప్రతినిధిః ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్కు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. దానం ఎన్నికను రద్దు చేయాలని కాంగ్రెస్ నేత విజయారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈరోజు హైకోర్టులో విచారణకు రాగా... జస్టిస్ విజయ్సేన్ రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది సుంకర నరేష్ వాదనలు వినిపించారు. ఎన్నికల్లో దానం నాగేందర్ ఓటర్లను ప్రలోభపెట్టారని న్యాయవాది తెలిపారు. ఓటర్లకు డబ్బులు పంచడంతో పోలీస్స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని కోర్టుకు వెల్లడించారు. తన భార్య పేరు మీద ఉన్న ఆస్తుల వివరాలు నామినేషన్ పత్రాల్లో పేర్కొనలేదన్నారు. వాదనలకు విన్న కోర్టు వివరణ ఇవ్వాలంటూ ఎమ్మెల్యే దానంకు నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను హైకోర్టు వచ్చే నెల 18వ తేదీకి వాయిదా వేసింది.కాగా.. దానం నాగేందర్ రాజకీయ ప్రయాణం కాంగ్రెస్తోనే మొదలైంది. కాంగ్రెస్ హయాంలో ఆయన మంత్రిగా కూడా పనిచేశారు. ఆ తరువాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దానం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిని చవిచూసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే దానం.. లోక్సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో బీఆర్ఎస్కు షాకిస్తూ మరోసారి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అయితే దానం కాంగ్రెస్ గూటికి చేరడంపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దానంపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ను కలిసి వినతి కూడా చేశారు.

# రైతుల గోడును పట్టించుకోవడం లేదు



తెలంగాణ బ్యూరోప్రతినిధిఃకాంగ్రెస్ మంత్రులకు రైతుల గోడు వినే సమయం లేదని.. అక్రమంగా మామూళ్లు వసులు చేయడంలో వారు అరితేరారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో కరువు ఉన్న మాట వాస్తవమేనని చెప్పారు. నల్గొండ జిల్లాలోనే పెద్ద సంఖ్యలో వ్యవసాయ భూములు సాగు నీరు అందక ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. లో ఓల్టేజ్ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోయి రైతులకు వేల రూపాయల నష్టం కలగచేస్తున్నాయని చెప్పారు. క్నో మోటార్ రిపేర్కు సుమారు వారం రోజులు పట్టడంతో మోటార్ బిగించే లోపే పూర్తి పంట ఎండిపోతుందని అన్నారు. నల్గొండ జిల్లా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి రైతుల దుస్థితి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రైతుల దగ్గరికి మంత్రి రావాలంటేనే భయపడుతున్నారన్నారు. ఎక్కడ రైతు బంధు గురించి రైతులు నిలాదిస్తారోనని ఆయన రావడం లేదని చెప్పారు. ప్రభుత్వం రైతులకు ఎకరానికి కనీసం 10 వేల రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలని జగదీష్రెడ్డి డిమాండ్ చేశారు.

# సంపత్ కుమార్ ఇంటికి మల్లు రవి



తెలంగాణ బ్యూరోప్రతినిధిః కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సంపత్ కుమార్తో నాగర్కర్నూల్ లోక్ సభ అభ్యర్థి మల్లు రవి శుక్రవారం భేటీ అయ్యారు. మల్లు రవిని అభ్యర్థిగా నిన్న సాయంత్రం కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. నాగర్ కర్నూల్ లోక్ సభ టిక్కెట్ కోసం సంపత్ కుమార్ కూడా ప్రయత్నించారు. ఈ క్రమంలో సంపత్ కుమార్ ఇంటికి వెళ్లిన మల్లు రవి తనకు మద్దతివ్వాలని కోరారు. ఇంటికి వచ్చిన మల్లు రవిని సాదరంగా ఆహ్వానించి శాలువా కప్పి సత్కరించారు. అధిష్ఠానం టిక్కెట్ ఇచ్చినందుకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాదిగ సామాజిక వర్గానికి న్యాయం చేస్తుందని సంపత్ కుమార్ అన్నారు. మాదిగల కోసం లోకూర్ కమిషన్ను ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తుంచుకోవాలన్నారు. 2014 కంటే ముందే ఎస్సీ వర్గీకరణ చేయడానికి పార్టీ ముందుకు వచ్చిందని గుర్తు చేశారు.

# బీజేపీ నాలుగో జాబితా విడుదల

- సినీనటి రాధికకు ఎంపీ టికెట్..
- ఇప్పటికే మూడు విడతలుగా 275 మంది అభ్యర్థుల పేర్ల ఖరారు
- నాలుగో విడతలో 15 మంది ఎంపీ అభ్యర్థుల పేర్లు

ఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో భారతీయ జనతా పార్టీ స్పీడ్ పెంచింది. తమ పార్టీ అభ్యర్థులను వరుసగా ప్రకటిస్తోంది. ఇప్పటికే మూడు విడతలుగా 275 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసిన బీజేపీ.. ఇప్పుడు నాలుగో విడత అభ్యర్థులను ప్రకటించింది. నాలుగో విడతలో 15 మంది ఎంపీ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది బీజేపీ. ఈ జాబితాలో ముఖ్య నేతలతో పాటు.. ఊహించని వ్యక్తులకు కూడా టిక్కెట్ దక్కింది. సీనియర్ నటి రాధికా శరత్ కుమార్కు బీజేపీ ఎంపీ టికెట్ ఇచ్చింది. విరుధునగర్ నుంచి ఆమె ఎంపీగా ఎన్నికల బరిలో నిలవనున్నారు.



4వ జాబితాలో ఇంకా ఎవరున్నారంటే..

1. వుదుచ్చేరి – ఏ. నమశివాయం
2. తిరువల్లూర్(ఎస్సీ) – పోన్ వి బాలగణపతి
3. చెన్నై నార్త్ – ఆర్.సి పాల్ కనగరాజ్
4. నమక్కల్ – కే.పీ. రామలింగం
5. తిరుప్పూర్ – ఏ.పీ మురుగనందం
6. పొల్లాచి – కే. వసంతరాజన్
7. కరూర్ – వి.వి సెంతిల్నాథన్
8. చిదంబరం (ఎస్సీ) – పి. కాత్యాయిని
9. నాగపట్టినమ్ – ఎస్.జి.ఎం రమేష్
10. తంజావూర్ – ఎం. మురుగనందం
11. శివగంగ – దేవనాథన్ యాదవ్
12. మదురై – ప్రొఫెసర్ రామ శ్రీనివాసన్
13. విరుధునగర్ – రాధికా శరత్ కుమార్
14. టెన్కాశి (ఎస్సీ) – బి. జాన్ పాండియన్
15. తిరువన్నమలై – ఏ. అశ్వద్ధామన్

# ఇస్రో మరో ఘనత..

- పునర్వినియోగ రాకెట్ ప్రయోగం గ్రాండ్ సక్సెస్..
- కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ నుంచి ప్రయోగం
- గాల్లోకి ఎగిరిన అనంతరం సురక్షితంగా రన్వేపై రాకెట్ ల్యాండింగ్



చిత్రదుర్గ ... భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో ఘనత సాధించింది. ఇస్రో తయారు చేసిన రీయూజబుల్ లాంచ్ వెహికల్ ప్రయోగం మంచి సక్సెస్ సాధించింది. శుక్రవారం ఉదయం కర్ణాటక లోని చిత్రదుర్గ జిల్లా ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ నుంచి ఈ ప్రయోగం నిర్వహించింది. గాల్లోకి ఎగిరిన అనంతరం ఈ రాకెట్ సురక్షితంగా రన్వేపై ల్యాండ్ అయింది. ఆర్ఎల్వీ ప్రయోగం ద్వారా అంతరిక్ష యాత్రల ఖర్చు తగ్గడంతో పాటు లాంచింగ్ రాకెట్లను తిరిగి వాడుకునేందుకు గానూ ఇస్రో ఈ ప్రయోగాన్ని చేపట్టింది. అలాగే దేశీయ సాంకేతిక సామర్థ్యాలను విస్తృతం చేసేందుకు ఆర్ఎల్వీ ఉపయోగపడనుంది. వునర్వినియోగ ప్రయోగ రాకెట్ల తయారీ భారత్ చరిత్రలో మరో మైలురాయి అని ఇస్రో పేర్కొంది. రెక్కలతో తయారు చేసిన ఈ రాకెట్కు వుష్పక్ అని ఇస్రో నామకరణం చేసింది. ఐఏఎఫ్ కు చెందిన చినూక్ హెలికాప్టర్ లో తొలుత ఆర్ఎల్వీని 4.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి అక్కడి నుంచి వదిలిపెట్టారు. అనేక ఇబ్బందులు ఎదురైనా కూడా వాటన్నింటినీ అధిగమించి మరీ నిర్దేశిత మార్గంలో చక్కగా ఆర్ఎల్వీ ల్యాండ్ అయ్యింది. రన్వేపై చక్కగా ల్యాండ్ అయిన మీదట.. బ్రేక్ పారాచూట్, ల్యాండింగ్ గేర్ బ్రేక్స్, నోస్ వీల్ స్టీరింగ్ సిస్టమ్ సాయంతో స్వయంగా ఆగిపోయింది. ఈ మిషన్ను చేపట్టడంలో విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ కు ఇస్రో ఇనర్షియల్ సిస్టమ్స్ యూనిట్, లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్ సహకరించాయి. అలాగే ఐఏఎఫ్, ఏడీఈ, ఏడీఆర్డీఈ, సీఈఎంఐఎల్ఏసీ తమ వంతు సహకారాన్ని అందించాయి. ప్రయోగం సక్సెస్ సాధించిన నేపథ్యంలో ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ శాస్త్రవేత్తలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా.. గత ఏడాది ఇస్రో ఆర్ఎల్వీ ఎల్ఈఎక్స్–01ను పూర్తి చేసింది. ఎల్ఈఎక్స్–01లో ఉపయోగించిన బాడీ, ఫ్లైట్ సిస్టమ్స్ను తాజా ప్రయోగంలోనూ ఇస్రో శాస్త్రవేత్తలు వాడారు.

# లంచం అడిగింది నిజమే

- మద్యం విధానం రూపకల్పనలో కేజ్రీవాల్ ప్రత్యక్ష పాత్ర
- ఢిల్లీ లిక్కర్ స్కామ్లో మధ్యవర్తిగా విజయ్ నాయర్
- అరెస్టుకు సంబంధించిన ఆధారాలను 28 పేజీల్లో రాతపూర్వకంగా కోర్టుకు
- కొందరు వ్యక్తులకు మేలు చేసేందుకు లంచం అడిగారని వెల్లడించిన ఈడీ



న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో గురువారం రాత్రి అరెస్టయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ను రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ అధికారులు ప్రవేశపెట్టారు. ఈ కేసులో ప్రశ్నించేందుకు కేజ్రీవాల్ను 10 రోజులపాటు కస్టడీకి అప్పగించాలని జడ్జిని ఈడీ కోరింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో నిందితుడిగా ఉన్న అరవింద్ కేజ్రీవాల్ను గురువారం రాత్రి 9:05 గంటలకు అరెస్టు చేశామని, 24 గంటల్లోపు అతడిని జడ్జి ముందు హాజరుపరిచినట్టు ఈడీ పేర్కొంది. రిమాండ్ కోరుతూ దరఖాస్తు ఇచ్చామని, అన్ని నిబంధనలను పాటించి కేజ్రీవాల్ను అరెస్ట్ చేశామని ఈడీ అధికారులు కోర్టుకు వెల్లడించారు. కేజ్రీవాల్ అరెస్టుపై బంధువులకు కూడా సమాచారం అందించామని, అరెస్టుకు సంబంధించిన ఆధారాలను 28 పేజీల్లో రాతపూర్వకంగా అందజేశామని వివరించారు. అరెస్టు పంచనామా కూడా తమ ఉందని ఈడీ తరవు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు.

కేజ్రీవాల్ కీలక వ్యక్తి.. డబ్బులు అడిగారు

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్ కీలకమైన వ్యక్తి అని, కొందరు వ్యక్తులకు మేలు చేసేందుకు డబ్బులు (లంచం) అడిగారని రౌస్ అవెన్యూ కోర్టుకు ఈడీ వెల్లడించింది. అక్రమ మార్గంలో వచ్చిన ఈ డబ్బుని గోవా ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఉపయోగించిందని పేర్కొంది. మద్యం విధానం రూపకల్పనలో కేజ్రీవాల్కు ప్రత్యక్ష పాత్ర ఉందని, స్కామ్లో ప్రధాన వ్యక్తి ఆయనేనని తెలిపింది. ఇక ఈ కేసులోనే అరెస్టయిన ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం, ఆప్ నేత మనీష్ సిసోడియా బెయిల్ లభించలేదని న్యాయస్థానం దృష్టికి ఈడీ పేర్కొంది. ఈ కేసులో సహ నిందితురాలుగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కే.కవిత వాంగ్మూలాన్ని కూడా తీసుకున్నామని ప్రస్తావించింది. ఆప్ మాజీ కమ్యూనికేషన్స్ ఇన్ఛార్జ్ విజయ్ నాయర్ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వద్ద పనిచేస్తున్నారని, కేజ్రీవాల్తో చాలా సన్నిహితంగా ఉండే విజయ్ నాయర్ మధ్యవర్తిగా నటించాడని ఈడీ పేర్కొంది.సౌత్ గ్రూప్ నుంచి కేజ్రీవాల్ డబ్బు డిమాండ్ చేశారని, ఈ విషయాన్ని నిరూపించడానికి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఈడీ తరవు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. రెండు పర్యాయాలు నగదు బదిలీ జరిగిందని వివరించారు. సౌత్ గ్రూప్కు లిక్కర్ పాలసీలో లబ్ధి చేకూర్చేందుకు ముడుపులు తీసుకున్నారని వివరించారు. లిక్కర్ పాలసీ రూపకల్పనలో భాగంగా ఎమ్మెల్సీ కవితను కేజ్రీవాల్ కలిశారని, కలిసి పని చేద్దామంటూ కవితతో సీఎం కేజ్రీవాల్ చెప్పారని ఈడీ పేర్కొంది. విజయ్ నాయర్ అరవింద్ కేజ్రీవాల్ కోసం పనిచేశారని, గోవా ఎన్నికల సమయంలో రూ.45 కోట్లు చేతులు మారాయని కోర్టుకు ఈడీ వెల్లడించింది.ఈ కేసుకు సంబంధించిన ఆధారాలలో ఫోన్ రికార్డ్స్ కూడా ఉన్నాయని రౌస్ అవెన్యూ కోర్టుకు ఈడీ తెలిపింది. విజయ్ నాయర్కు సంబంధించిన కంపెనీ నుంచి ఆధారాలు సేకరించామని, రూ.45 కోట్లు హవాలా మార్గంలో తరలించినట్టు తేలిందని, పెద్ద మొత్తంలో నిధులు వివిధ వ్యక్తుల ద్వారా చేతులు మారాయని వివరించింది. కాగా ఈ కేసుకు సంబంధించిన వాదనలు ఇంకా కొనసాగుతున్నాయి.



# ప్రధాని మోడీకి భూటాన్

న్యూఢిల్లీ: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం భూటాన్ అత్యున్నత పౌర పురస్కారమైన 'ఆర్డర్ ఆఫ్ ది డ్రూగ్ గ్యాల్పో'ను అందుకున్నారు. భూటాన్ రాజు జిగ్మె ఖేసర్ నాంగ్యేల్ వాంగ్చుక్ మోడీకి ప్రదానం చేశారు. ఈ వురస్కారం అందుకున్న తొలి విదేశీ ప్రభుత్వాధినేత నరేంద్ర మోడీ కావడం విశేషం. జీవితకాలంలో అత్యుత్తమ విజయాలు, సమాజానికి చేసిన సేవలకు గుర్తుగా ఈ వురస్కారం అందజేస్తారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను పటిష్టం చేయడమే కాకుండా కొవిడ్ మహమ్మారి సమయంలో 5 లక్షల టీకాలను అందజేయడం లాంటి చర్యలను గుర్తిస్తూ ఈ అవార్డును 2021లోనే ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన భారత ప్రధాని మోడీ, ఈ వురస్కారం అందుకోవడం గౌరవంగా ఉందన్నారు. దీన్ని 140 కోట్ల భారత ప్రజలకు అంకితం చేస్తున్నట్టు వెల్లడించారు. రెండు రోజుల అధికారిక పర్యటనకు భూటాన్ వెళ్లిన ప్రధాని మోడీ శుక్రవారం ఉదయం అక్కడకు చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం, గురువారమే ఈ పర్యటన జరగాల్సి ఉండగా, అనివార్య కారణాలతో ఒకరోజు ఆలస్యమైంది. పర్యటన సందర్భంగా భూటాన్ ప్రధాని దాసో షెరింగ్తో ప్రధానీ మోడీ ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. వునరుత్పాదక ఇంధనం, పర్యాటకం, పర్యావరణం, వ్యవసాయం వంటి రంగాల్లో ఇరు దేశాల సహకారం కోసం అవగాహనను కుదుర్చుకున్నారు. 2014లో భారత ప్రధానిగా మోడీ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి భూటాన్ను పర్యటించడం ఇది మూడోసారి.

# నిరుద్యోగాన్ని నిర్మూలించాలి

- గ్రూప్ 1,2,3,4 పోస్టులు పెంచాలి
- టీచర్ పోస్టులను 25వేలకు పెంచాలి భర్తీ చేయాలి
- నిరుద్యోగుల సదస్సులో ఎంపీ ఆర్. కృష్ణయ్య




తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణలో నిరుద్యోగుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతున్నదని, ప్రభుత్వ శాఖల్లోని ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్లోని బీసీ భవన్లో ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య అధ్యక్షత వహించిన నిరుద్యోగుల సదస్సును సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ గ్రూప్ 1,2,3,4 పోస్టులు పెంచాలి టీచర్ పోస్టులు 25వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రూప్–1 సర్వీస్ కింద 503 పోస్టులు ప్రకటించారు. కానీ డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోట పోస్టులు కరెక్టుగా లెక్కిస్తే 1600కు, గ్రూప్–2 సర్వీస్ కింద 783 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ప్రకటించారు. వీటిని కూడా కరెక్టు గా లెక్కిస్తే 2200 లకు, గ్రూప్ పోస్టులు 1383 వాస్తవంగా 3వేలకు పైగా ఉన్నవి, గ్రూప్–4 సర్వీస్ కోటా కింద 8500 పోస్టులు ప్రకటించారు. ఇవి 25 వేలకు పైగా ఉంటాయి. టీచర్ పోస్టులు 11వేలు ప్రకటించారు. రిపోర్ట్ ప్రకారం 25 టీచర్ పోస్టులు ఖాళీగా యున్నవని తెలిపారు. వీటిని సవరించి వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఒకే దఫా 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడానికి ఆదేశాలు జారీ చేయడం గొప్ప విషయ. ప్రస్తుతం ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చునది ఏమనగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కొందరు డైరెక్ట్ రికట్ మెంట్ కోటా క్రింద భర్తీ చేయవలిసిన గ్రూప్–1,2,3,,4 సర్వీస్ ఉద్యోగాలను సరిగ్గా పూర్తి స్థాయిలో లెక్కించి గణన చేసి భర్తీ చేయడానికి ప్రతిపాదనలు పంప లేదు. ఏదో నామమాత్రంగా లెక్కిచి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికే అన్ని శాఖలలో అడ్ హక్ ప్రమోషన్ల పేరుమీద భర్తీ చేశారు. కొందరు ఉన్నతాదికారులు డైరెక్టు రికట్ మెంట్ లెక్కించడంలో అన్యాయం చేస్తున్నారు. డైరెక్టు రికట్ మెంట్ కోటా పోస్టులను ప్రమోషన్ల క్రింద భర్తీ చేశారు. గ్రూప్–1 సర్వీస్ కింద గత 10 సంవత్సరాలుగా పోస్టుల భర్తీ చేయలేదు. అలాగే గ్రూప్–2 సర్వీస్ కింద 6 సంవత్సరాలుగా నోటిఫికేషన్ లేదు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ లో పూర్తి స్థాయి డైరెక్ట్ రికట్మెంట్ కోట భర్తీ చేయకుండా నామమాత్రంగా భర్తీ చేశారు. అందుకే ఈ కింది అంశాలను పరిగణలోకి తీసుకొని డైరెక్ట్ రికట్మెంట్ కోటా లెక్కించాలి. గత 10 సంవత్సరాలుగా గ్రూప్–1 స్థాయి పోస్టులు, గ్రూప్–2 పోస్టులలో ఎంతమంది రిటైర్ అయ్యారు. ఎంతమందికి ప్రమోషన్లు ఇచ్చారు. లెక్కించి భర్తీ చేయాలి.

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ 23 జిల్లాలోని వాటిలో 40 శాఖల జిల్లా ఆఫీసులు, తాలూకా ఆఫీసులు ఏర్పడ్డాయి. అలాగే 131 మండలాలు, 30 రెవెన్యూ డివిజినల్ ఆఫీసులు, 76 మున్సిపాలిటిలు, 7 మున్సిపల్ కార్పోరేషన్లు, 25 ్రా ఆఫీసులు, 31 పోలీస్ సర్కిల్స్, 7 పోలిస్ కమిషనరేట్లు, 4,383 గ్రామపంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయి. ఇందులో గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–4 సర్వీస్ పోస్టులు పెద్ద ఎత్తున ఏర్పడ్డాయి. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు, మండలాలకు మున్సిపాలిటీలకు కొత్త పోస్టులు మంజూరు చేయలేదు. వీటిని వెంటనే మంజూరు చేయాలి. ఇందులో డైరెక్ట్ రికట్మెంట్ కోటా లెక్కించాలి. వాటిలో గ్రూప్– 50 శాతం, గ్రూప్–2 లో 30 నుంచి 40 శాతం డైరెక్ట్ రికట్మెంట్ కోటా కింద ఎన్ని పోస్టులు వస్తాయో పూర్తి స్థాయిలో లెక్కించి భర్తీ చేయాలి. కొత్త తరాన్ని యువతరాన్ని డైరెక్టు రికట్ మెంట్ ద్వారా ప్రభుత్వ యంత్రాంగంలోకి తీసుకువస్తే సమర్థవంతమైన, అవినీతికి తావులేని పాలన లభిస్తుంది. యువత శక్తి–యుక్తులు సమాజాభివృద్ధికి ఉపయోగించ వచ్చును. యువతను పాలనరంగం లోకి తీసుకువస్తే ఉత్సాహంతో, అంకిత భావంతో నిజాయితీగా పని చేస్తారు. పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ నీలం వెంకటేశ్, జిల్లపల్లి అంజి తదితర బీసీ నేతలు పాల్గొన్నారు.

# గొల్లకురుమలను విస్మరిస్తే బొంద పెడతం

**యాదవ, కురుమల రాజ్యాధికార ఐక్య వేదిక హెచ్చరిక**




తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణలో 18 శాతం జనాభా కలిగిన గొల్ల కురుమలను రాజకీయ పార్టీలు దగా చేస్తున్నాయని యాదవ కురుమల రాజ్యాధికార ఐక్య వేదిక ఆరోపించింది. తమ ఓట్లతో అధికారం చేపట్టి పదవుల విషయంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నాయని మండిపడింది. తెలంగాణలో గొల్లకురుమల మద్దతుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు పదవుల విషయంలో మాత్రం గాలికొదిలేసిందని ఐక్య వేదిక విమర్శించింది. లోక్ సభ సీట్లతో పాటు నామినేటెడ్ పదవుల్లో గొల్ల కురమలకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేసింది. గొల్ల కురుమలను విస్మరించే పార్టీలకు లోక్ సభ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని యాదవ కురుమల రాజ్యాధికార ఐక్య వేదికా హెచ్చరించింది. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్క్లబ్ లో మేమెంతో.. మాకంత నినాదంతో యాదవ కురుమల రాజ్యాధికార ఐక్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సదస్సుకు హాజరైన వివిధ పార్టీలనేతలు, వివిధ సంఘాల నేతలు.. గొల్లకురుమలకు సముచిత స్థానం కల్పించాలని తీర్మానించింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు... ప్రొఫెసర్ సింహాద్రి యాదవ్ , ప్రొఫెసర్ బీనవేని రామ యాదవ్, క్యామ మల్లేష్ యాదవ్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, అల్ ఇండియ యాదవ మహాసభ రమేష్ యాదవ్ , మేకల కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



### పెంచలకోన ఆలయంలో

# చంద్రబాబు ప్రత్యేక పూజలు

నెల్లూరు, సూర్య బ్యూరో ప్రతినిధి : టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం నెల్లూరు జిల్లా రాపూరు మండలం పెంచలకోన పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. పెనుశిల లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చంద్రబాబును ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఉండవల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో గోనెపల్లి చేరుకుని అక్కడి నుంచి వాహనంలో పెంచలకోన చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న తర్వాత తిరిగి ఉండవల్లి బయలుదేరారు. ఆయన వెంట ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు రామకృష్ణ, హేమలత, సుబ్రమణ్యంలు ఉన్నారు.



### అభివృద్ధి పేరుచెబితే

# మంగళగిరి గుర్తొచ్చేలా చేస్తా

- అందుబాటులో ఉండి సేవచేస్తా... ఆశీర్వదించండి
- తటస్థ ప్రముఖులతో యువనేత లోకేష్ వరుస భేటీలు



మంగళగిరి, సూర్య బ్యూరో ప్రతినిధి : మంగళగిరి ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో నన్ను గెలిపించండి. అభివృద్ధి పేరుచెబితే మంగళగిరి గుర్తొచ్చేలా చేస్తా. అందరికీ అందుబాటులో ఉండి సేవలందిస్తా. కుటుంబసభ్యుడిలా తనను ఆశీర్వదించాలని యువనేత నారా లోకేష్ కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో పలువురు తటస్థ ప్రముఖులను యువనేత లోకేష్ వారి ఇళ్లకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో తాను విజయం సాధించాక మంగళగిరిని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలు తమవద్ద ఉన్నాయని చెప్పారు. తొలుత మంగళగిరి 29వవార్డుకు చెందిన ముస్లిం ప్రముఖుడు షేక్ మౌలాలి ఇంటికివెళ్లారు. వారి కుటుంబసభ్యులు యువనేత లోకేష్ కు పుష్పగుచ్చాలను అందించి ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ముస్లిం సోదరుల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని, గత ప్రభుత్వంలో రంజాన్ తోఫా, దుల్హాన్, విదేశీవిద్యతోపాటు షాదీఖానాల నిర్మాణం చేపట్టామని చెప్పారు. వైసిపి వేధింపులతో పలమనేరులో పదోతరగతి విద్యార్థిని మిస్బాను ఆత్మహత్య చేరుకునేలా వత్తిడిచేశారు, నంద్యాలలో అబ్దుల్ సలామ్ పై దొంగ ముద్రవేయడం వేయడంతో కుటుంబసభ్యులతో ఆత్మహత్య చేసుకున్నారు. రాబోయే ప్రజాప్రభుత్వం ముస్లింలకు రక్షణ కల్పించడమే గాక వారి సంక్షేమానికి గతంలో చేపట్టిన పథకాలన్నీ పునరుద్దరిస్తామని అన్నారు. తర్వాత 31వవార్డులోని అంజుమన్ ఎ హిమయతుల్ ఇస్లామ్ (అంజుమన్ కమిటీ) కార్యాలయాన్ని సందర్శించి, ఆ సంస్థ ప్రతినిధులను కలిశారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని, షాదీఖానాలు, ఖబరిస్థాన్ ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. యువనేత లోకేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో వైసిపి నేతలు యథేచ్ఛగా వక్ఫ్ బోర్డు, మసీదులకు చెందిన వేలకోట్ల ఆస్తులను అన్యాక్రాంతం చేస్తున్నారని, నర్సరావుపేట మసీదు ఆస్తుల కబ్జాను అడ్డుకున్న ఇబ్రహీంను దారుణంగా నరికిచంపారని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చాక గతంలో ముస్లింల సంక్షేమానికి చేపట్టిన పథకాలన్నింటినీ రద్దుచేశారని చెప్పారు. ముస్లింలకు చెందాల్సిన రూ.5500కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించారని చెప్పారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వక్ఫ్ ఆస్తుల రక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మంగళగిరి 5వవార్డుకు చెందిన వస్త్రవ్యాపారి కోలా వీరాంజనేయులును ఆయన నివాసంలో కలిశారు. కృష్ణబలిజ సామాజికవర్గీయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా యువనేత దృష్టికి తెచ్చారు. తెలుగుదేశం పార్టీ బిసిలకు పుట్టినిల్లు లాంటిది, అన్ని బిసివర్గాలకు రాబోయే ప్రభుత్వంలో న్యాయం చేస్తాం, బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేస్తామని యువనేత లోకేష్ పేర్కొన్నారు.



### ఉపాధి హామీ పనుల కల్పనలో

# ఇబ్బంది లేకుండా చూడండి

- సమ్మర్ స్టోరేజి ట్యాంకులన్నీ సమీప నీటి సోర్సుల ద్వారా పూర్తిగా నీటితో నింపాలి
- ప్రైవేట్ బోరులను అద్దె ప్రాతిపదికన తీసుకుని ప్రజల దాహార్తిని తీర్చాలి
- తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన పెంచాలి
- 80 శాతం పైగా పూర్తయిన తాగునీట పథకాలను పూర్తిచేసి అందుబాటులోకి తేవాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి



వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో ముఖ్యంగా కరువు మండలాల్లో ఎక్కడా తాగునీరు,ఉపాధి హామీ పనుల కల్పనలో ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్. జవహర్ రెడ్డి జిల్లా కలక్టర్లను ఆదేశించారు. కరువు మండలాల్లో ఉపాధి హామీ పనులు, తాగునీటి సరఫరా అంశాలపై శుక్రవారం వెలగపూడి సచివాలయం నుండి ఎన్టిఆర్, ప్రకాశం, కర్నూలు, అనంతపురం,శ్రీ సత్యసాయి,నెల్లూరు, నంద్యాల,అన్నమయ్య, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు,పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి, జల వనరులు, విపత్తుల నిర్వహణ శాఖల అధికారులతో సిఎస్ సమీక్షించారు. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ జూన్ నెలాఖరు వరకు కరువు మండలాల్లో తాగునీటి కొరత లేకుండా చూడడం తోపాటు పెద్ద ఎత్తున ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని ఆదేశించారు. వేసవి ఎండల దృష్ట్యా ఉపాధి హామీ పథకం పనులను ఉదయం 5.30 గం.ల నుండి ఉ.10.30 గం.ల వరకూ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సిఎస్ ఆదేశించారు. నీటి ఎద్దడి గల ఆవాసాలకు ట్యాంకులు ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని కలక్టర్లను సిఎస్ ఆదేశించారు.

ట్యాంకులు ద్వారా నీటిసరఫరాను పర్యవేక్షించేందుకు వచ్చే వారానికి ప్రత్యేక యాప్ ను కూడా అందుబాటులోకి తేనున్నట్టు చెప్పారు. కరువు మండలా ల్లోని సమ్మర్ స్టోరేటి ట్యాంకులన్నిటినీ సమీప నీటి సోర్సుల ద్వారా నీటిని మళ్ళించి వాటిని పూర్తిగా నీటితో నింపాలని ఆదేశించారు. వివిధ ప్రవేట్ బోర్లను అద్దె ప్రాతిపదికన తీసుకుని నీటి ఎద్దడి గల ఆవాసాలకు తాగునీటిని సరఫరా చేయాలని స్పష్టం చేశారు. భూగర్భ జల మట్టాలను నిరంతరం మానిటర్ చేస్తూ తీవ్ర నీటి ఎద్దడి గల ప్రాంతాలకు ప్రతిరోజు ట్యాంకులు ద్వారా మంచినీటి సరఫరా చేయాలని చెప్పారు. ట్యాంకరుల ద్వారా నీటి సరఫరాకు సంబంధించి ప్రత్యేకంగా ఎస్ఓపి రూపొందించి సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని ఆదేశించారు. తాగునీటిని దుర్వినియోగం చేయకుండా జిల్లాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. 80 శాతం పైగా పనులు పూర్తయిన వివిధ మంచినీటి పథకాలను యుద్ధ ప్రాతి పదిక పూర్తి చేసి వాటిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని సిఎస్ జవహర్ రెడ్డి కలక్టర్లకు స్పష్టం చేశారు.వీటికి సంబంధించి ఎలాంటి నిధుల కొరత ఉండబోదని స్పష్టం చేశారు. మల్టీ విలేజి , సింగిల్ విలేజి మంచినీటి సరఫరా పథకాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ద తీసుకుని చిన్నపాటి మర్మత్తులు ఉంటే నిర్వహించి అవి సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులతో పాటు కలక్టర్లను సిఎస్ ఆదేశించారు. తాగు నీటి సరఫరాకు సంబంధించి తాగునీటి వనరుల వారీగా కార్యాచరణ సిద్ధం చేసుకుని నిరంతరం మానిటర్ చేయాలని సిఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. తాగునీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా అవసరానికి మించి తాగునీటిని నిల్వ చేయడం, కుళాయిల ద్వారా నీటిని వృధాగా వదిలి వేయడం లేదా తాగునీటి యేతర అవసరాలకు నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై సోషల్ మీడియా ద్వారా, గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలని చెప్పారు. కరువు మండలాల్లోని భూగర్భ జలాల పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసి అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్ జవహర్ రెడ్డి కలెక్టర్లకు స్పష్టం చేశారు.

# పిఠాపురం నుంచే పవన్ కల్యాణ్ ప్రచారానికి శ్రీకారం



పిఠాపురం కేంద్రంగానే రాష్ట్రవ్యాప్త ప్రచారానికి రాకపోకలు

మంగళగిరి, సూర్య బ్యూరో ప్రతినిధి : జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ చేపట్టే ఎన్నికల ప్రచారానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. శుక్రవారం పార్టీ ముఖ్యులతో ఈ అంశంపై చర్చించారు. పవన్ కల్యాణ్ పోటీ చేయనున్న పిఠాపురం నుంచే ప్రచారానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకున్నారు. శక్తిపీఠం కొలువైన క్షేత్రం శ్రీపాద శ్రీవల్లభుడు జన్మించిన పవిత్ర భూమి అయిన పిఠాపురం నుంచి ప్రచారం మొదలుపెట్టడం శుభప్రదమని పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. పురుహూతిక దేవికి పూజలు నిర్వహించి వారాహి వాహనం నుంచి ప్రచారం మొదలుపెడతారు.

ఆ నియోజక వర్గంలోనే మూడు రోజులపాటు ఉంటారు. నియోజక వర్గ ముఖ్య నాయకులు, మండల నాయకులతో భేటీలు నిర్వహిస్తారు. పిఠాపురం కేంద్రంగానే రాష్ట్రవ్యాప్తంగా సాగించే ఎన్నికల ప్రచారానికి రాకపోకలు సాగించబోతున్నారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని పవన్ కల్యాణ్ పార్టీ కేంద్ర కార్యాలయ వర్గాలకు ఆదేశాలిచ్చారు. అనంతరం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పార్టీ ప్రెసిడెంట్ టూర్ మేనేజ్మెంట్ టీం కన్వీనర్లు, కో కన్వీనర్లు, సభ్యులతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. పిఠాపురం నుంచి మొదలుపెట్టనున్న ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. తాను పోటీ చేస్తున్న స్థానం కావడంతో వైసీపీ ఎన్నో పన్నాగాలు పన్నుతోందని, ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి. ఇందుకోసం సాగిస్తున్న ఈ సమరంలో కచ్చితంగా విజయం మనదే అని చెప్పారు. పిఠాపురం నుంచే జనసేన శంఖం పూరిస్తుందని, ఈ విజయ నాదం రాష్ట్రం నాలుగు వైపులా వినిపించాలన్నారు. ఎన్నికల నియమనిబంధనలు పాటించడంపైనా టూర్ మేనేజ్మెంట్ సభ్యులు పూర్తి అవగాహనతో ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షులు బి.మహేందర్ రెడ్డి, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కళ్యాణం శివ శ్రీనివాస్ పాల్గొన్నారు.


# జగన్‌కు ఫ్యామిలీ స్ట్రోక్ తప్పదా?

- వైఎస్ వివేకా భార్య సౌభాగ్యమ్మ రంగంలోకి దిగడం దాదాపు ఖరారు
- కడపలో ఆయన కుటుంబీకులే ప్రత్యర్థులుగా తలపడే పరిస్థితులు



అమరావతి నుంచి 'సూర్య ప్రత్యేక ప్రతినిధి : జగన్ పరిస్థితి చూస్తే ఆయనకు ఫ్యామిలీ స్ట్రోక్ గట్టిగానే తగులుతుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా సొంత అడ్డా కడపలోనే ఆయనకు దిమ్మ తిరిగేలా ఫ్యామిలీ స్ట్రోక్ తగలక తప్పదని పరిశీలకులు సైతం చెబుతున్నారు. సరిగ్గా ఎన్నికల వేళ వైఎస్ అడ్డాగా చెప్పుకునే కడపలో ఆయన కుటుంబీకులే ప్రత్యర్థులుగా తలపడే పరిస్థితులు ఉన్నాయి. కడప పార్లమెంటు, పులివెందుల అసెంబ్లీ స్థానాల్లో వైఎస్ కుటుంబీకులే పరస్పరం తలపడే అవకాశాలు మెండుగా కనపడుతున్నాయి. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి కుమారుడు వైసీపీ అధినేత సీఎం జగన్పై ఆయన సొంత ఫ్యామిలీయే తలపడేందుకు సమాయత్తమౌతోంది. ఈ పరిస్థితి జగన్ కు తలనొప్పే అనడంలో సందేహం లేదు. అయితే గెలుపోటములతో సంబంధం లేకుండా రాష్ట్రంలో బలపడటమే లక్ష్యంగా కాంగ్రెస్ వేస్తున్న అడుగులు ముందుగా కడప జిల్లాలో పడుతున్నాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. తన రాజకీయ జీవితమంతా కాంగ్రెస్ తో నడిచిన వైఎస్ ఇలాకాలో ముందుగా బలోపేతం అయ్యే ఉద్దేశంతో కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నదని అంటున్నారు. అందుకే తొలుత కడప లోక్ సభ, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గాలలో సత్తా చాటాలని, అలా చాటాలంటే అక్కడ జగన్ దాష్టీకాన్నీ, ఆధిపత్యాన్ని గట్టిగా అడ్డుకోగలిగే బలమైన అభ్యర్థులు రంగంలో ఉండాలనీ నిర్ణయించింది. ఇప్పటికే కడప జిల్లాల్లో జగన్ తీరు పట్ల ఒకింత వ్యతిరేకత బలంగా వ్యక్తమౌతోంది.

ముఖ్యంగా గత ఎన్నికల ముందు జగన్ సొంత చిన్నాన్న హత్య వెనుక ఉన్న పాత్రధారులు, సూత్రధారులు ఎవరన్న విషయంలో జిల్లా ప్రజలలో స్పష్టత వచ్చిన తరువాత జగన్ కు జిల్లాలో గతంలోలా ప్రజామద్దతు లభించడంలేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం తరువాత వైఎస్ కుటుంబం అంతా ఒక్కటిగా నిలిచింది. కాంగ్రెస్ తో జగన్ విభేదించి సొంతంగా వైసీపీ పార్టీని ఏర్పాటు చేసినప్పుడు తొలుత వైఎస్ వివేకా వద్దని వారించి తాను కాంగ్రెస్ లోనే ఉండిపోయి విజయమ్మకు ప్రత్యర్థిగా రంగంలోకి దిగినా ఆ తరువాత జగన్ ను సీఎంను చేయడమే ధ్యేయంగా అన్న కుమారుడి పక్కన గట్టిగా నిలబడ్డారు. 2019 ఎన్నికల సమయంలో అయితే వైఎస్ కుటుంబం సమైక్యంగా జగన్ కు అండగా నిలిచింది. అయితే ఆ ఎన్నికలలో జగన్ పార్టీ విజయం సాధించి ఆయన ముఖ్యమంత్రి అయిన తరువాత ఒక్కొక్కరుగా జగన్ కు దూరం అయ్యారు. గత ఎన్నికలలో జగన్ అన్న సీఎం కావడం కోసం చెప్పులరిగేలా, గొంతు చిరిగేలా ప్రచారం చేసిన షర్మిలను తాను సీఎం అయిన తరువాత జగన్ దూరం పెట్టారు. పార్టీలో ఆమెకు ఎలాంటి హోదా కల్పించకుండా వేధించి చివరకు ఆమె రాష్ట్ర విడిచి వెళ్లి పొరుగు రాష్ట్రంలో తలదాచుకోవాల్సిన పరిస్థితి కల్పించారు.



బాబాయ్ వైఎస్ వివేకా కుమార్తె సునీత విషయంలో కూడా తండ్రి హత్య కేసు నిందితులకు అండగా నిలబడి ఆమెపైనే ఆరోపణలు చేయించారు. దీంతో ఆమె కూడా అన్నకు దూరం జరిగారు. ఇప్పుడు జగన్ కు ఓటు వేయవద్దని షర్మిల, సునీతలు ఇరువురూ ముక్త కంఠంతో ప్రజలకు పిలువునిచ్చారు. జగన్‌కు వ్యతిరేకంగా వైఎస్ ఫ్యామిలీ కాంగ్రెస్ తరపున ఎన్నికల బరిలోకి దిగడానికి నిర్ణయించుకుంది. పులివెందుల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా జగన్ పై పోటీకి సొంత చిన్నమ్మ అంటే బాబాయ్ వైఎస్ వివేకా భార్య సౌభాగ్యమ్మ రంగంలోకి దిగడం దాదాపు ఖరారైందని చెబుతున్నారు. తొలి నుంచీ కడప లోక్ సభ అభ్యర్థిగా వైఎస్ అవినాష్ రెడ్డిపై సౌభాగ్యమ్మ పోటీ చేస్తారని వార్తలు వచ్చాయి. అయితే కడప లోక్ సభ బరిలో దిగితే ఆమె మొత్తం నియోజకవర్గాన్ని ప్రభావితం చేయగలుగుతారా, ఆమె కడప లోక్ సభ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏ మేరకు ప్రభావం చూపగలుగుతారు అన్నదానిపై కాంగ్రెస్ లో విస్తృతంగా చర్చ జరిగిందని తెలుస్తోంది. ఆ చర్చ అనంతరం కాంగ్రెస్ వ్యూహం మార్చిందని చెబుతున్నారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల కడప లోక్ సభ అభ్యర్థిగా పోటీలోకి దిగితే కడప లోక్ సభ నియోజకవర్గంతో పాటు ఆ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లన్నిట్లోనూ కాంగ్రెస్ బలోపేతం అవుతుందని భావించి ఆమెను కడప నుంచి బరిలోకి దింపాలని నిర్ణయించిందనీ, అందుకు షర్మిల కూడా సుముఖత వ్యక్తం చేశారనీ అంటున్నారు. ఇక పులివెందుల నుంచి వివేకా భార్య సౌభాగ్యమ్మ రంగంలోకి దిగితే అక్కడ కూడా కాంగ్రెస్ గట్టి పోటీని ఇస్తుందని, దీంతో మొత్తంగా కడప జిల్లాలో కాంగ్రెస్ మెరుగైన ఫలితాలు సాధించే అవకాశాలు మెరుగవుతాయని కాంగ్రెస్ భావిస్తోందని అంటున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ వ్యూహం ఆ పార్టీకే కాక తెలుగుదేశం పార్టీకి కూడా మేలు చేసేలా ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. గత ఎన్నికలకు ముందు జరిగిన వివేకా హత్య వెనుక తెలుగుదేశం అధినేత చంద్రబాబు హస్తం ఉందంటూ ఆరోపణలు గుప్పించి జగన్ సానుభూతిని పొందారు.

అయితే ఐదేళ్లు గిర్రున తిరిగే సరికి వివేకా హత్యతో తెలుగుదేశం అధినేత చంద్రబాబుకు ఎటువంటి సంబంధంలేదని నిర్ద్వంద్వంగా తేలిపోవడమే కాకుండా ఆ హత్య వెనుక ఉన్నది కుటుంబ కుట్రేననీ, ఆ కుట్రలో జగన్‌కు కూడా భాగముందన్న అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. తన ఇంటిమనుషులే తండ్రిని హత్య చేశారని వివేకా కుమార్తె సునీత, హంతకులు తమ పక్కనే ఉంటారని ఊహించలేదని సౌభాగ్యమ్మ వెల్లడించారు. తన తండ్రి హత్యలో తీవ్ర ఆరోపణలకు ఎదుర్కొంటున్న అవినాష్ రెడ్డి అరెస్టు కాకుండా తన అన్న జగన్ రక్షిస్తున్నారని మీడియాతో కుండబద్దలు కొట్టినట్లు వెల్లడించిన సునీత హత్యలు చేసే వైసీపీకి ఓటు వేయవద్దని పిలువునిచ్చారు. కడప లోక్ సభ నుంచి వైఎస్ షర్మిల, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్ సౌభాగ్యమ్మ కాంగ్రెస్ అభ్యర్థులకుగా బరిలోకి దిగడం దాదావుగా ఖాయమైన నేపథ్యంలో జగన్‌కు సొంత జిల్లాలో సొంత కుటుంబ సభ్యులే ప్రత్యర్థులుగా మారినట్లైంది. దీంతో ఈ సారి జగన్ కు ఫ్యామిలీ స్ట్రోక్ గట్టిగా తగలడం ఖాయమని పరిశీలకులు భావిస్తున్నారు.

# డ్రగ్స్ కంటైనర్ చంద్రబాబు బంధువులదే

### ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



గుంటూరు, సూర్య బ్యూరో ప్రతినిధి : విశాఖ డ్రగ్స్ విషయంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. డ్రగ్స్ విషయంలో బీజేపీ, టీడీపీ నేతల పాత్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. తప్పించుకోవడానికే ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని అన్నారు. శుక్రవారం తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ పోర్టులో సీబీఐ డ్రగ్స్ను సీజ్ చేసింది. పురంధేశ్వరి బంధువులకు ఆ కంపెనీతో సంబంధాలు ఉన్నాయి. టీడీపీ నేతలు కావాలనే మాపై ఆరోపణలు చేస్తున్నారు. చంద్రబాబు ఇంగితం లేకుండా మాట్లాడుతున్నారు. వ్యవస్థల మీద గౌరవం లేని వ్యక్తి చంద్రబాబు. వీధి స్థాయి మనస్తత్వం చంద్రబాబుది. తప్పుడు చేయడం టీడీపీకి అలవాటుగా మారింది. గత ప్రభుత్వ హయాంలో గంజాయి, డ్రగ్స్ తూతు మంత్రంగా దాడుల చేశారు. డ్రగ్స్ నిందితులకు టీడీపీ నేతలతో సంబంధాలు ఉన్నాయి. తప్పు చేసి రివర్స్ మాపైనే ఆరోపణలు చేస్తున్నారు. తప్పించుకోవడానికే మాపై నిందలు వేస్తున్నారు. మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని చంద్రబాబు కలలు కంటున్నారు. వైఎస్సార్సీపీకి జనాల్లో విపరీతమైన ఆదరణ ఉంది. అది తట్టుకోలేకపోతున్నారు. వాళ్లకు చెప్పుకోవడానికి ఏమీ లేక ఇలాంటి ప్రచారం చేస్తున్నారు. డ్రగ్స్ విషయంలో నిజాలు నిగ్గు తేల్చాలని సీబీఐకి లేఖ రాస్తాం. ఎన్నికల మిషన్ కూడా డ్రగ్స్ దృష్టి పెట్టాలని కోరతాం. ప్రజలను కన్ఫ్యూజ్ చేసి పబ్బం గడుపుకోవాలని టీడీపీ ప్రయత్నిస్తోందని సజ్జల మండిపడ్డారు.

### మా వల్ల సోదాలు ఆలస్యం కాలేదు : విశాఖ సీపీ రవిశంకర్



విశాఖపట్నం, సూర్య బ్యూరో ప్రతినిధి : విశాఖ పోర్టులో కంటెయినర్లో డ్రగ్స్ కేసుపై నగర సీపీ రవిశంకర్ స్పందించారు. దీన్ని పూర్తిగా సీబీఐ దర్యాప్తు చేస్తోందని చెప్పారు. విశాఖపట్నంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీబీఐ డాగ్ స్క్వాడ్ సహకారం కోరితే ఇచ్చినట్లు తెలిపారు. తమ వల్ల సోదాలు ఆలస్యమయ్యాయని చెప్పడం సరికాదన్నారు. నగరంలో డ్రగ్స్ ఉక్కుపాదం మోపుతున్నట్లు చెప్పారు. కంటెయినర్ టెర్మినల్ తమ కమిషనరేట్ పరిధిలోకి రాదన్నారు. కస్టమ్స్ ఎస్పీ పిలిస్తే వెళ్లినట్లు వివరించారు. సీబీఐ విధి నిర్వహణకు తమవల్ల ఆటంకం కలగలేదని తెలిపారు.

### చిత్తూరు పార్లమెంట్ తెదేపా అభ్యర్థిగా దగ్గుమళ్ల ప్రసాదరావు ఖరారు



చిత్తూరు, మేజర్న్యూస్: తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంట్ సభ్యులుగా రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాదరావుకు సీటు ఖరారైంది. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఉన్నతమైన ఉద్యోగాన్ని సమర్థవంతంగా నిర్వహించిన ఆయన, ప్రజానీకానికి తన సేవలను అందించాలని దృఢ సంకల్పంతో రాజకీయ అరగ్రేటం చేశారు. చేసి ప్రజల గుండెల్లో నమ్మకమైన నాయకునిగా అతి తక్కువ కాలంలోనే మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం చిన్నగంజాం మండలం చింతగుంపల గ్రామంలో అతి సామాన్యమైన కుటుంబంలో దగ్గుమళ్ల లూక్ సుశీలమ్మ దంపతులకు జన్మించిన ప్రసాదరావు ప్రాథమిక విద్య జాండ్రపేటలోని బివిబిఎన్ హైస్కూల్లో పూర్తిచేసుకుని చీరాలలోని వీఆర్ఎస్ వైఎన్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. పట్టుదల ఉంటే కానిది లేదన్నట్టు తనకు ఎదురైన ఎన్నో అవమానాలను అవరోధాలను తట్టుకొని అత్యంత ఇష్టమైన సివిల్స్‌కు కష్టపడి చదివి ఇండియన్ రైల్వే సర్వీస్ నందు ఉద్యోగాన్ని సంపాదించారు. అనతి కాలంలోనే ప్రభుత్వ విధుల్లో క్రమశిక్షణ నీతినిజాయితీ ఉన్నతమైన విలువలతో ఎనలేని సేవలు చేసి మంచి పేరు సంపాదించారు. ఉద్యోగంతో పాటు ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఎంతో మందికి మార్గదర్శిగా అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఎదిగే కొద్దీ ఒదిగి ఉండటం ఆయనకు పుట్టుకతో వచ్చిన నైజం ఆయన ఆలోచనలు ఎప్పుడు ఎంతో కొంత సమాజానికి ఉపయోగపడాలని నిరంతరం తపిస్తూ వందమందికైనా ఉపాధి కల్పించాలని దృఢ సంకల్పంతో అలా అనుకొని రాదే నిర్మాణ సంస్థ ఏర్పాటు చేసి ప్రస్తుతం వేల మందికి ఉపాధినిస్తూ వారి కష్టసుఖాలలో పాలుపంచుకుంటున్నారు. ప్రజలకు ఇంకా ఏదో చేయాలని తపనతో ఆయన మార్గాన్ని ప్రజల కోసం ప్రజా జీవితానికి అంకితం చేయాలని స్నేహితుల కోరిక మేరకు ప్రస్తుతం దిగజారిన ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పరిరక్షించేందుకు ఆయన తెలుగుజాతి కీర్తి ప్రతిష్టలు ఆకాశం ఎత్తుకు తీసుకెళ్లిన అన్న ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరి అభివృద్ధికి బాట వేసిన చంద్రబాబు నాయకత్వంలో పని చేయటానికి నేను సైతం తెలుగు జాతికి సమిధనవుతానంటూ ప్రజా జీవితానికి తన జీవితాన్ని అంకితం చేయడానికి ముందుకొచ్చారు. ఇలాంటి సేవా తత్పరులు కలిగిన మహోన్నతమైన వ్యక్తులు రాజకీయాలలో ఉంటే ప్రతి ఒక్కరి ఆశ నెరవేరుతుందని ఇలాంటి వ్యక్తులను రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్నుకోవలసిన బాధ్యత కూడా సమాజంలోని ఓటర్ పైన ఎంతైనా ఉంది.

### విజయవాడలో జియోగ్రాఫికల్ ఇండికేషన్ జీ.ఐ ఫెస్టివల్

**24వ తేదీ వరకు కొనసాగనున్న ప్రదర్శన ప్రారంభించిన కేఎల్ యూనివర్సిటీ సెక్రటరీ కోనేరు కాంచన లత**



విజయవాడ, సూర్య బ్యూరో ప్రతినిధి : జియోగ్రాఫికల్ ఇండికేషన్ జీ.ఐ ఫెస్టివల్ శుక్రవారం విజయవాడలో ప్రారంభమైంది. స్థానిక సిద్ధార్థ ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి జి.ఐ కోఆర్డినేటర్ భారత్ మహోత్సవ నెంబర్ గణేష్ ఆధ్వర్యంలో కే.ల్ యూనివర్సిటీ వారు ఏర్పాటు చేసిన జీ.ఐ ఫెస్టివల్ ను కేఎల్ యూనివర్సిటీ సెక్రటరీ కోనేరు కాంచన లత ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి సారిగా విజయవాడలో జియోగ్రాఫికల్ ఇండికేషన్ జీ.ఐ ఫెస్టివల్ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 10 నగరాల్లో జరిగిన జి.ఐ ట్యాగ్ కలిగివున్న నాణ్యత గుర్తింపు కలిగిన వస్తువులు మాత్రమే ఈ ప్రదర్శనలో ఉంచడం జరుగుతుందన్నారు. విజయవాడలో మార్చి 22, 23, 24 వ తేదీల్లో జి.ఐ ట్యాగ్ ఉన్న వస్తువులు మాత్రమే 70కి పైగా స్టాల్స్ లో దేశం నలుమూలల నుండి ఈ ప్రదర్శనలు ఉంచుతున్నామని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలనుసారం భారత్ జి.ఐ మహోత్సవం సాంస్కృతి, సంప్రదాయాలు, కళలు, తో సంబరాలు జరుపుకునేలా ఈ కార్యక్రమం నిర్వహించాలని తెలియజేశారు అన్నారు అందులో భాగంగా ఫ్యాషన్ పోటీలు భారతదేశయ ఆధారితమైన జి.ఐ ట్యాగ్ వస్తువులతో నిర్వహించాలని ఆదేశాలని, మిస్టర్ , మిస్సెస్, కిడ్స్, మిస్ ఫ్యాషన్ పోటీలు నిర్వహించేందుకు మన భారతదేశానికి చెందిన దుబాయ్ ఫ్యాషన్ టెక్నాలజీ లో ఉన్న మిస్సెస్ అనిసా బేగం పాల్గొంటున్నారని చెప్పారు. అలేఖ్య మిసెస్స్ అమరావతి , సామాజికవేత్త హిమబిందు, స్వాతి.కె (ప్రాచీన కళా కేంద్ర స్టేట్ అడ్మినిస్ట్రేషన్), పాల్గొని వారి కార్యక్రమాల వివరాలలో భాగంగా 23వ తేదీ కొన్ని నృత్యాలు, కళాబృందలతో నృత్యాలు, స్టోరీ రైటింగ్స్ పోటీలు, ఆర్టిస్టులకు ప్రాచీన కళల చిత్రాలపై పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా కల్చరల్ నైట్స్, దేశీయ ఫ్యాషన్ షో ని జాగ్నాస సీఈవో గాయత్రి, శ్రీదేవి ఈ కార్యక్రమ కన్వీనర్ కే రాఘవరావు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్గనైజర్స్ ఆపిల్ హాస్పిటల్స్ రాజశేఖర్, వెల్నెస్ కోచ్ అనిత పాల్గొన్నారు. అన్ని స్టాల్స్ లో ఎక్కడా దొరకని నాణ్యతతో కూడిన వస్తువులు మాత్రమే దొరుకుతాయన్నారు.

# ఏపీ ఎన్నికల బరిలో మాజీ సిఎంల వారసులు

## గెలుపుపై ఎవరి ధీమా వారిది







### నారా లోకేష్

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రి. ఆయన రాజకీయంగా క్రియాశీలంగా ఉండి పార్టీని నడిపిస్తున్నారు. ఆయన కుమారుడు లోకేశ్ రాజకీయాల్లోకి చురుగ్గా పనిచేస్తున్నారు. బీసీల రాజకీయ సామ్రాజ్యం మంగళగిరి నియోజకవర్గంలో మాజీ సీఎం చంద్రబాబు తనయుడు లోకేష్ 2019 నాటి సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఆళ్ల రామక్రిష్ణారెడ్డి చేతిలో ఓటమి పాలయినా...మరోసారి అదే స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. గతంలో ఓడిపోయిన శాసన మండలికి నామినేట్ అయ్యారు. తండ్రి కేబినెట్‌లో మూడు శాఖల మంత్రిగా గుర్తింపు పొందారు. ఈసారి ఎలాగైనా గెలిచేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. . అయితే.. ఈ సారి వైసీపీ బీసీ బ్రహ్మాస్త్రాన్ని సంధించింది. ఇద్దరు రాజకీయ ఉద్దండుల కుటుంబాలకు చెందిన మురుగుడు లావణ్యతో పోటీ పడుతున్నారు. మరి బీసీల బలగాన్ని తట్టుకోగలరా? లేక ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో గట్టెక్కగలరా? అన్నది వేచి చూడాల్సిందే.

**ఈ సారి ఏపీలో జరగనున్న ఎన్నికలల్లో ఓ విచిత్ర పరిస్థితి నెలకొంది. ఏకంగా ఆరు మంది మాజీ/దివంగత ముఖ్యమంత్రుల పిల్లలు ఎన్నికల బరిలో నిలిచారు. గతంలో ఈ తరహా పోటీ ఎప్పుడూ లేదనే చెప్పుకోవచ్చు. ఒకే ఎన్నికల్లో ఇంతమంది మాజీ/దివంగత ముఖ్యమంత్రుల పిల్లలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతోండటం, వారంతా వేర్వేరు పార్టీల తరఫున పోటీ చేయ బోతోండటం ఆసక్తి రేపుతోంది. వారిలో ఎంతమంది గెలవగలుగుతారనేది ఉత్కంఠతగా మారింది. అయితే, తాత, తండ్రుల పేర్లు చెప్పుకుని గెలిచే రోజులు కావివి.. నువ్వేమిటి.. సమాజానికి నువ్వేం చేసావ్.. నువ్వేం చేస్తావ్ అని చెప్పుకుంటే తప్ప ప్రజామోదం దక్కని రోజులివి. మరిప్పుడు వీళ్ళలో ఎవరిని ప్రజలు ఆదరిస్తారో.. ఆరాధిస్తారో చూడాలి.**

కుటుంబ రాజకీయ నేపథ్యం ఉన్నవాళ్లు కూడా ఎన్నికల్లో పోటీకి దిగుతున్నారు. ఇదంతా ఇలా ఉండనీయండి కానీ ఈ రాష్ట్రాన్ని కొన్నేళ్లపాటు పాలించిన ముఖ్యమంత్రుల కుటుంబాల నుంచి సైతం తరువాతి తరం వాళ్ళు పోటీకి సిద్ధం అంటున్నారు. అధికార వైసీపీ మరోసారి అధికారం నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తుంటే.. ప్రధాన ప్రతిపక్షం టీడీపీ వచ్చే ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే. అయితే.. ఈదఫా ఎన్నికల బరిలో ఎనిమిది మంది మాజీ ముఖ్యమంత్రుల వారసులు పోటీ చేయనుండడం ఆసక్తిగా మారింది. తమ కుటుంబాల రాజకీయ వారసత్వాన్ని నిలుపుకోవడానికి వారు ప్రయత్నిస్తున్నారు. వీరిలో అత్యధికంగా 4 కుటుంబాలకు చెందిన వా రు ప్రధాన ప్రతిపక్షం టీడీపీలో ఉండటం విశేషం. మూడు కుటుంబాలకు చెందినవారు అధికార పక్షం వైసీపీలో ఉన్నారు. మరో కుటుంబానికి చెందిన వారు జనసేనలో ఉన్నారు. ఇంకో కుటుంబం బీజేపీలో ఉన్నారు



### వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబం నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి. ఇప్పటికే కడప నుంచి రెండుసార్లు ఎంపీగా గెలుపొందారు. 2014లో ఎమ్మెల్యేగా గెలిచి శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా రాష్ట్ర రాజకీయాల్లో కీలక భూమిక పోషించారు. 2019లో మళ్లీ గెలిచి .విభజిత ఆంధ్రప్రదేశ్ కు రెండో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు. 2014లో టీడీపీ అభ్యర్థి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డిపై 75,243 ఓట్ల మెజారిటీతో, 2019లో ఇదే అభ్యర్థి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డిపై 89,708 ఓట్ల మెజారిటీతో విజయ ఢంకా మోగించారు . ది. ఇప్పుడు మూడోసారి గెలిచేందుకు సన్నద్ధం అవుతున్నారు . ఎప్పట్లాగే కడప జిల్లా పులివెందుల నుంచి రేసులో నిలిచారు. తాజా ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మారారు. మర్రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రెడ్డి) పోటీ చేస్తున్నారు. వీరిద్దరి మధ్య పోటీ ఏకపక్షమా? హోరాహోరీనా? అనేది ఎన్నికల ప్రక్రియలో తేలుతుం ఎదుర్కొన్న రెండో ఎన్నికలోనే తండ్రి పేరు మీద స్థాపించిన పార్టీని అధికారంలోకి తీసుకుని రాగలిగారు. వరుసగా రెండోసారీ విజయఢంకా మోగించాలనే పట్టుదలతో ఉన్నారు.

### వైఎస్ షర్మిల



వైఎస్సార్ తనయ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి.. జగనన్నకు వ్యతిరేకంగా పోరాటానికి సర్వసన్నద్ధం అయ్యారు. అయితే.. పులివెందులలో కాకుండా కడప ఎంపీగా పోటీ చేస్తారని కాంగ్రెస్ అధిష్టానం నుంచి సమాచారం లీక్ అయ్యింది. తొలుత పుట్టిన గడ్డ కమలాపురం నుంచి పోటీ చేస్తారని ఊహాగానాలు షికార్లు చేశాయి. కానీ, తన బాబాయి వివేకనందారెడ్డి హత్యోదంతంతో.. తన దాయాది సోదరి న్యాయపోరాటానికి ప్రజాతీర్పు బాధ్యతను షర్మిల భుజానికి ఎత్తుకుంటోందని సమాచారం. అదే జరిగితే ఇక్కడ సిట్టింగ్ ఎంపీ అవినాష్ రెడ్డిపై పోటీ చేస్తారు. అయితే కాంగ్రెస్ అభ్యర్థిగా ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది ఇంకా ఖరారు కాలేదు. కడప లోక్‌సభ లేదా అదే జిల్లాలోని కమలాపురం నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది

### నందమూరి బాలకృష్ణ



నిజానికి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి హిందూపురం నియోజకవర్గంలో నందమూరి కుటుంబానికి పెట్టని కోటగా పేరొందింది. ఎన్టీఆర్ ఇక్కడి ప్రజల అభిమానం అంతా ఇంత కాదు. బాలకృష్ణ హిందూపురంలో ఇప్పటికే గత రెండు ఎన్నికల్లో వరుసగా గెలిచారు. ఇప్పుడు మూడోసారి బరిలో దిగి ప్రజల మద్దతుకోరుతున్నారు. బాలకృష్ణకూ ఓటమి ఉండదని అందరూ భావిస్తున్న దరుణంతో, ఈ ఎన్నికల్లో ఓ బీసీ వనిత టీజీఎన్ దీపిక పోటీ పడుతోంది. ఒక రకంగా ఎన్టీఆర్ వంశంపై వైఎస్ జగన్ బీసీ బ్రహ్మాస్త్రాన్ని సంధించారు. ఈ అస్త్రం ఎంతవరకూ ఫలిస్తుందో వేచి చూడాల్సిందే.



### దగ్గుబాటి పురంధేశ్వరి



టీ డీ పీ
వ్యవస్థాపకుడు, దివంగత మాజీ
ముఖ్య మంత్రి ఎన్టీ 2.
రామారావు పిల్లలు నందమూరి
బాలకృష్ణ, దగ్గుబాటి 3.
పురంధేశ్వరి వేర్వేరు పార్టీల
నుంచి పోటీ పడుతున్నారు. 4.
బాపట్ల నియోజక వర్గంలో కాంగ్రెస్
అభ్యర్థిగా సినీ నిర్మాత రామా నాయుడును 5.
ఓడించి పార్లమెంటు గడప తొక్కిన ఎన్టీఆర్ తనయ పురందేశ్వరీ
ఏపీ రాజకీయాల్లో కీలక శక్తిగా మారా రు. విశాఖపట్నం ఎంపీగా,
కేంద్ర మంత్రిగా కాంగ్రెస్ పార్టీలో చక్రం తిప్పా రు. రాష్ట్ర విభజన
అనంతరం బీజేపీలో చేరి.. 2014 ఎన్నికల్లో రాజంపేట లోక్ సభ 6.
స్థానంలో పోటీ చేశారు. అక్కడి వైసీపీ అభ్యర్థి మిథున్ రెడ్డిపై 1,74,762 ఓట్ల మెజారిటీతో ఓడిపోయారు. 2019లో ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం టీడీపీ, జనసేన, బీజేపీ మిత్రత్రయం బలంతో లోక్ సభ ఎన్నికల బరిలో దిగుతున్నారు. రాజమండ్రి స్థానంలో పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది.

### నాదెండ్ల మనోహర్



మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర రావు కుమారుడు నాదెండ్ల మనోహర్.. గుంటూరు జిల్లాలోని తెనాలి నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగారు. జనసేన పార్టీ తరఫున ఆయన ఇక్కడి నుంచి పోటీ చేయడం ఇది తొలిసారి. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ తరఫున ఇదే తెనాలి నుంచి రెండుసార్లు విజయం సాధించారు. అసెంబ్లీకి ఎన్నికై కొన్నాళ్లపాటు అసెంబ్లీ స్పీకర్‌గా కూడా పని చేశారు. ఇప్పుడు ఆయన మళ్ళీ తెనాలి నుంచి జనసేన తరఫున పోటీ చేస్తున్నారు.



### నేదురుమల్లి రామ్ కుమార్



నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి...నెల్లూరు జిల్లా ఆత్మకూరు అసెంబ్లీ నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. గతంలో ఆయన తల్లి రాజ్య లక్ష్మి అక్కడి నుంచే గెలిచి విద్యాశాఖా మంత్రిగా పని చేశారు



### నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి



మరో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి సోదరుడు కిశోర్ కుమార్ రెడ్డి కూడా టీడీపీలో చురుగ్గా ఉన్నారు. కిరణ్ క్రియాశీల రాజకీయాలకు దూరంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆయన సొంత నియోజకవర్గం పీలేరులో తమ్ముడు కిశోర్ టీడీపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. పార్టీ వ్యవహారాల్లో ఆయన కీలకంగా ఉంటూ వైసీపీతో ఢీ అంటే ఢీ అంటున్నారు.





### కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



మరో మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కరరెడ్డి కుటుంబం ఇప్పుడు టీడీపీలోనే ఉంది. ఆయన కుమారుడు సూర్యప్రకాశ్ రెడ్డి గత ఎన్నికల్లో టీడీపీ తరఫున కర్నూలు ఎంపీ అభ్యర్థిగా, ఆయన సతీమణి సుజాతమ్మ ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గతంలో 1991, 2004, 2009 ఎన్నికల్లో కర్నూలు నుంచి లోక్‌సభకు ఎన్నికై కేంద్రంలో రైల్వే శాఖ సహాయమంత్రిగా కూడా పని చేశారు. ఇప్పుడు డోన్ నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు.



### కాసు మహేశ్వరరెడ్డి

మరో మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి కుటుంబానికి చెందిన కాసు మహేశ్ రెడ్డి ఇప్పుడు గురజాల నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. కాసు కుటుంబానికి మొదటి నుంచి నర్సరావుపేట కేంద్ర స్థానం అయినా అక్కడ ఖాళీ లేకపోవడంతో మహేశ్ రెడ్డి గురజాల నుంచి పోటీచేసి నెగ్గారు. ఈసారి కూడా ఆయన అక్కడే పోటీ చేయబోతున్నారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి





# ఆర్సీబీకి నో ఛాన్స్

## ప్లే ఆఫ్స్ చేరే నాలుగు జట్లు ఇవే

ఎప్పుడెప్పుడా? అని ఎదురు చూస్తున్న ఐపీఎల్ 2024 సీజన్కు రంగం సిద్ధమైంది. మరికొద్ది క్షణాల్లో ఈ మెగా టోర్నీకి తెరలేవనుంది. చెన్నైలోని చెపాక్ మైదానం వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్కే), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) తొలి మ్యాచ్లో తలపడనున్నాయి. ఓవైపు యావత్ దేశం ఐపీఎల్ మత్తులో మునిగి తేలుతుండగా.. మరోవైపు మాజీ క్రికెటర్లు తమ అంచనాలను వెల్లడిస్తూ మరింత హైప్ క్రియేట్ చేస్తున్నారు. అధికారిక బ్రాడ్కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ షోలో పాల్గొన్న ఇర్ఫాన్ పఠాన్.. ఈ సీజన్లో ప్లే ఆఫ్స్ చేరే జట్లను అంచనా వేసాడు. ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్తో పాటు కోల్కతా నైట్రైడర్స్ జట్లు ప్లే ఆఫ్స్ చేరుతాయని తెలిపాడు. ఆర్సీబీ, సన్రైజర్స్ హైదరాబాద్ పేర్లు ఇందులో లేకపోవడంతో ఆ ఫ్రాంచైజీల అభిమానులు బాధపడుతున్నారు. 'ప్రస్తుతం పేపర్పై ఆయా జట్ల బలాలు, బలహీనతలను చూస్తుంటే ఆ నాలుగు జట్లు ప్లే ఆఫ్స్ చేరుతాయనిపిస్తోంది. ముంబై ఇండియన్స్ చాలా బలంగా ఉంది. చెన్నై సూపర్ కింగ్స్కు ఎన్ని ఇబ్బందులున్నా ఆ జట్టు ముందడుగు వేస్తోంది. లక్నో సూపర్ జెయింట్స్ టీమ్ చాలా నిలకడగా ఉంది. పేపర్పై చాలా బలంగా కనిపిస్తోంది. కేకేఆర్ కూడా బలంగానే ఉంది. ఈ నాలుగు జట్లే ప్లే ఆఫ్స్ చేరుతాయని అనుకుంటున్నా. 'అని ఇర్ఫాన్ పఠాన్ చెప్పుకొచ్చాడు.











# అంగరంగ వైభవంగా ఐపీఎల్ సంబురం

- అట్టహాసంగా ఆరంభ వేడుకలు
- నేటి నుంచి ఐపీఎల్ 17వ సీజన్
- చెన్నైలోని చిదంబరం స్టేడియంలో ఓపెనింగ్ సెర్మనీ
- డ్యాన్స్తో అలరించిన అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్
- హిట్ గీతాలతో ఉర్రూతలూగించిన ఏఆర్ రెహ్మాన్, సింగర్లు







ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) కొత్త సీజన్ ఘనంగా ప్రారంభమైంది. చెన్నైలోని చిదంబరం స్టేడియంలో నిర్వహించిన ఓపెనింగ్ సెర్మనీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. కళ్లు జిగేల్మనిపించే లైటింగ్, లేజర్ షోలు, బాణసంచా విన్యాసాలు ప్రదర్శించారు. బాలీవుడ్ హీరోలు అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ పలు హిట్ సాంగ్స్ కు హుషారుగా డ్యాన్స్ చేయగా, ఏఆర్ రెహమాన్, సోను నిగమ్, శ్వేతామోహన్ తదితరులు తమ గానమాధుర్యంతో ఉర్రూతలూగించారు. వందేమాతరం గీతం ఒరిజినల్ వెర్షన్ ను సోను నిగమ్ ఆలపించగా, తాను స్వరపరిచిన ఆల్బమ్ వెర్షన్ ను ఏఆర్ రెహమాన్ ఆలపించారు. అంతకు ముందు, ఏఆర్ రెహమాన్ ఎంట్రీతో చిదంబరం స్టేడియం మార్మోగిపోయింది. రెహమాన్, ఇతర గాయకులు పలు హిట్ గీతాలతో కార్యక్రమాన్ని మరింతగా రక్తి కట్టించారు. ఢిల్లీ-6, యువ, ఛయ్య ఛయ్య, జయహో వంటి గీతాలతో రెహ్మాన్ మేనియా స్టేడియంలో ఆవిష్కృతమైంది. కాగా, ఐపీఎల్ 17వ సీజన్ తొలి మ్యాచ్ లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడు తున్నాయి. మ్యూజిక్ మాస్ట్రో ఏఆర్ రెహమాన్ తన పాటలతో అభిమానులను ఉర్రూతలూగించాడు. దేశభక్తి పాటలతో సందడి చేశాడు. మాతృఏర్షే సలామ్ అంటూ తన గాత్రంతో అలరించాడు. మరో సింగర్ సోనూ నిగమ్ సైతం గూజ్ బంప్స్ వచ్చే పాటలతో సందడి చేశాడు.

అంతకుముందు బాలీవుడ్ స్టార్స్ అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ తమ డ్యాన్స్తో అభిమానులను అలరించారు. ఈ ఆరంభ వేడుకలకు బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, సెక్రటరీ జై షా, ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధూమల్, వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఐపీఎల్ 2024 సీజన్ ట్రోఫీని డిఫెండింగ్ ఛాంపియన్ సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ పట్టుకొచ్చాడు. ఆర్సీబీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ స్టేజి పైకి రాగా అందరూ ట్రోఫీతో ఫొటోలకు ఫోజిచ్చారు. కళ్లు జిగేల్మనిపించే లైట్లు, లేజర్ షోలు, బాణాసంచా విన్యాసాలతో కిక్కిరిసిన చెపాక్ మైదానంలో ఐపీఎల్ 2024 సీజన్కు తెరలేచింది. ఆరంభ వేడుకలకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ఏఆర్ రెహ్మాన్, సోనమ్ నిగమ్తో పాటు అక్షయ్ కుమార్ల ప్రదర్శనలకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్గా మారాయి. రెండు నెలల పాటు నాన్ స్టాప్ ఎంటర్టైన్మెంట్ అంటూ ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. చెన్నై సూపర్ కింగ్స్, ఆర్సీబీ మధ్య తొలి మ్యాచ్ జరుగుతుండగా.. టాస్ గెలిచిన ఫాఫ్ డుప్లెసిస్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. పిచ్ బ్యాటింగ్కు అనుకూలంగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపాడు.

# అందుకే శార్దూల్ ఠాకూర్ను తీసుకోలేదు

పీఎల్ 2024 సీజన్లో భాగంగా డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్తో జరుగుతున్న తొలి మ్యాచ్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని ఆర్సీబీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ తెలిపాడు. 'మేం ముందుగా బ్యాటింగ్ చేయాలనుకుంటున్నాం. పిచ్ బ్యాటింగ్కు అనుకూలంగా కనిపిస్తోంది. అందుకే బ్యాటింగ్ ఎంచుకున్నా. సీఎస్కే జట్టుతో ఆడిన తర్వాత నేను ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. చెన్నై అభిమానులను మళ్లీ చూసినందుకు సంతోషంగా ఉంది. కానీ నేను ఇప్పుడు ఆర్సీబీతో ఉన్నాను. మా జట్టు కూడా సీఎస్కేలా ఓ మంచి టీమ్గా మారుతుందని ఆశిస్తున్నా. ఈ సీజన్ కోసం బాగా సన్నదమయ్యాం. మా జట్టు అన్ని విభాగాల్లో పటిష్టంగా ఉంది. బ్యాకప్ ఆటగాళ్లు కూడా ఉన్నారు. గతంలో కంటే మా జట్టు చాలా మెరుగ్గా ఉంది. గాయాలు మా ప్రణాళికలను దెబ్బతీయవని భావిస్తున్నా. ఈ మ్యాచ్లో అల్జారీ జోసెఫ్ ఓవర్సీస్ బౌలర్గా బరిలోకి దిగుతున్నాడు. మిడిలార్డర్లో స్పిన్నర్లను తీసుకున్నాం.'అని ఫాఫ్ డుప్లెసిస్ చెప్పుకొచ్చాడు.




చెన్నై సూపర్ కింగ్స్ సారథ్య బాధ్యతలు దక్కడాన్ని గౌరవంగా భావిస్తున్నాని ఆ జట్టు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ తెలిపాడు. మరొకరిపై ఆధారపడకుండా కెప్టెన్గా తన మార్క్ చూపించాలనుకుంటున్నానని చెప్పాడు. 'గత వారమే కెప్టెన్సీ నియామకం గురించి తెలిసింది. కానీ గతేడాదే ధోనీ భాయ్ హింట్ ఇచ్చాడు. జట్టులో ప్రతీ ఒక్కరు అనుభవజ్ఞులే. కానీ మేం కాన్వే, పతీరణ సేవలను కోల్పోవడం నిరాశపరిచే అంశం. మాకు రచిన్, డారిల్ మిచెల్ ఉన్నారు. వారి స్థానాలను వీరు భర్తీ చేయగలరు. పిచ్ బ్యాటింగ్కు అనుకూలంగా ఉంది. మిచెల్, రచిన్, ముస్తాఫిజుర్, తీక్షణ ఓవర్సీస్ ప్లేయర్లుగా బరిలోకి దిగుతున్నారు. దేశవాళీ క్రికెటర్ సమీర్ రిజ్వీ ఈ మ్యాచ్తో ఐపీఎల్లోకి అరంగేట్రం చేస్తున్నాడు.'అని రుతురాజ్ గైక్వాడ్ చెప్పుకొచ్చాడు. ఫిట్నెస్ సమస్యలు, టీమ్ కాంబినేషన్ నేపథ్యంలోనే శార్దూల్ ఠాకూర్ తీసుకోలేదని రుతురాజ్ గైక్వాడ్ తెలిపాడు.

తుది జట్లు:

ఆర్సీబీ: ఫాఫ్ డుప్లెసిస్, విరాట్ కోహ్లీ, కామెరూన్ గ్రీన్, రజత్ పటీదార్, గ్లేన్ మ్యాక్స్వెల్, దినేశ్ కార్తీక్, అనూజ్ రావత్, మయాంక్ దగర్,అల్జారీ జోసేఫ్, మహమ్మద్ సిరాజ్, కర్ణ్ శర్మ

సీఎస్కే: రుతురాజ్ గైక్వాడ్, రచిన్ రవీంద్ర, అజింక్యా రహానే, డారిల్ మిచెల్, రవీంద్ర జడేజా, సమీర్ రిజ్వీ, మహేంద్ర సింగ్ ధోనీ, దీపక్ చాహర్, మహీష్ తీక్షణ, ముస్తాఫిజుర్ రెహ్మాన్, తుషార్ దేశ్పాండే

# సీఎస్కే సక్సెస్ సీక్రెట్ అదే

సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా జట్టులోని ఆటగాళ్లందరిని సమంగా చూడటం.. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా జట్టు మొత్తం ఒకేలా ఉండటం చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్కే) సక్సెస్ సీక్రెట్ అని ఆ జట్టు మాజీ బ్యాటర్ అంబటి రాయుడు తెలిపాడు. ఐపీఎల్ 2024 సీజన్లో భాగంగా డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మరికాసేపట్లో తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో అధికారిక బ్రాడ్కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ తెలుగు ఛానెల్తో మాట్లాడిన రాయుడు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. తొలి మ్యాచ్లో చెన్నై సూపర్ కింగ్స్ విజయం సాధిస్తుందని తెలిపాడు.

**70 రన్స్కే ఆర్సీబీ ఆలౌట్..**

'2019లోనే సీఎస్కే వర్సెస్ ఆర్సీబీ మధ్య సీజన్ ఓపెనర్ మ్యాచ్ జరిగింది. చెపాక్ వేదికగా జరిగిన ఆ మ్యాచ్లో ఆర్సీబీ 70 పరుగులకే కుప్పకూలింది. అయితే అప్పుడు పిచ్ చాలా చెత్తగా ఉంది. కానీ ఇప్పుడు చెపాక్ వికెట్స్ చాలా మెరుగయ్యాయి. కాబట్టి ఐపీఎల్ 2024 సీజన్ ఓపెనర్ మంచి మ్యాచ్ అవుతుందని భావిస్తున్నా. రెండు టీమ్స్ కూడా చాలా బలంగా ఉన్నాయి. ఏది ఏమైనా ఈ మ్యాచ్లో సీఎస్కే గెలుస్తుందనేది నా నమ్మకం. చెన్నైకి ఆడే ప్రతీ ఆటగాడిని ఆ ఫ్రాంచైజీ తమ కుటుంబ సభ్యుడిగా భావిస్తోంది. మంచి వాతావరణంలో జట్టును ఉంచుతారు. ఆట గాళ్లందరినీ సమంగా చూస్తారు. వారి ఫ్యామిలీస్ను మంచిగా చూసుకుంటారు. గెలుపు, ఓటములతో జట్టు వాతావరణం మారదు. టీమ్ ఎప్పుడూ ఒకేలా ఉంటుంది. అందర్నీ సంతోషంగా ఉంచుతారు. ఆటగాళ్లు సంతోషంగా ఉంటారు కాబట్టి మంచి ప్రదర్శన చేస్తారు.'అని రాయుడు చెప్పుకొచ్చాడు.



**కెప్టెన్సీ నేర్పించారు..**

సీఎస్ కెప్టెన్సీ మార్పుపై స్పందిస్తూ.. 'సీఎస్కే కెప్టెన్గా రుతురాజ్ గైక్వాడ్ను నియమించాలని మేనేజ్మెంట్ ముందే భావించింది. గతేడాదిన్నరగా.. అతన్ని గ్రూమ్ చేస్తున్నారు. కెప్టెన్ ధోనీ, కోచ్ ఫ్లెమింగ్.. దగ్గరుండి కెప్టెన్సీ నేర్పించారు.


క్లిష్ట పరిస్థితుల్లో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలనే విషయాలు చెప్పారు. గత 15 ఏళ్లుగా ధోనీ ఎలా జట్టును నడిపించాడో.. మరో 10 ఏళ్ల పాటు రుతురాజ్ సీఎస్కేను అలానే విజయపథంలో నడిపించగలడు.'అని రాయుడు తెలిపాడు.

సూర్య
హైదరాబాద్
శనివారం
23 మార్చి 2024

cinema@suryaa.com

# సూర్య సినిమా

## హైదరాబాద్‌లో తండేల్ చిత్రీకరణ



నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా నటిస్తున్న దేశభక్తి అంశాలతో కూడిన రస్టిక్ లవ్ స్టోరీ 'తండేల్' షూటింగ్ హైదరాబాద్లో శరవేగంగా జరుగుతోంది. చందూ మొండేటి దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాసు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సగర్వంగా సమర్పిస్తున్నారు. 'తండేల్' సెట్స్ నుండి కొన్ని షూట్ డైరీస్ ఇప్పుడు బయటకు వచ్చాయి. ఇది నటీనటులు, సాంకేతిక నిపుణుల మధ్య వైబ్, స్నేహపూర్వక అనుబంధాన్ని ప్రతిబింబిస్తాయి. సెట్స్లో ఇంటెన్స్, పాషన్ నిండిన ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తోంది ఒక ఫోటోలో చందూ మొండేటి అల్లు అరవింద్కి ఒక సన్నివేశం గురించి వివరిస్తుండగా, మరొక ఫోటో బన్నీ వాసు, నాగ చైతన్య, చందూ మధ్య సరదా సంభాషణను చూపుతుంది. నాగ చైతన్య, సాయి పల్లవి ఇద్దరూ డి-గ్లామరస్ అవతార్లలో పాత్రలకు అనుగుణంగా కనిపిస్తున్నారు. దర్శకుడు చందూ మొండేటి కథను ప్రామాణికంగా చెప్పడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నటీనటుల గెటప్లు, కాస్ట్యూమ్స్, బాడీ లాంగ్వేజ్, యాసలతో సహా ప్రతిదీ పర్ఫెక్ట్గా కనిపించేలా చూసుకుంటున్నారు. త్వరలో కొన్ని ఎక్సయిటింగ్ అప్డేట్లతో వస్తామని మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి రాక్స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా, శామ్దత్ డీవోపీగా పని చేస్తున్నారు. శ్రీనాగేంద్ర తంగాల ఆర్ట్ డైరెక్టర్.



## దేవర పార్ట్ 1 చిత్రీకరణ.. మాంటేజ్ సాంగ్ చిత్రీకరణ

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్లో రూపొందుతోన్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా మూవీ దేవర పార్ట్ 1. ఈ యాక్షన్ డ్రామాతో తనదైన మాస్ అవతార్లో బాక్సాఫీస్ దగ్గర సత్తా చాటానికి తారక్ సిద్ధమవుతున్నారు. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్గా నటిస్తోంది. బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ చిత్రం మొదటి భాగాన్ని తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో దసరా సందర్భంగా అక్టోబర్ 10న ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నారు. దేవర ప్రపంచాన్ని సిల్వర్ స్క్రీన్ చూడటానికి అభిమానులు, సినీ ప్రేక్షకులు ఎంతో ఆత్రూఎతగా ఎదురుచూస్తున్నారు. రీసెంట్గా ఈ మూవీ కొత్త షెడ్యూల్ గోవాలో ప్రారంభమైంది. ఇప్పటికే అక్కడ సినిమా చిత్రీకరణను చేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమా నుంచి వస్తోన్న అప్డేట్స్లో రోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సినిమా నుంచి మరో ఆసక్తికరమైన అప్ డేట్ వచ్చింది. దేవర మేకర్స్ సినిమా నుంచి వర్కింగ్ స్టిల్స్ విడుదల చేశారు. ఇందులో ఎన్టీఆర్తో పాటు దర్శకుడు కొరటాల శివ, రాజు సుందరం మాస్టర్ సరికొత్త లుక్తో కనిపిస్తున్నారు. రాజు సుందరం కొరియోగ్రఫీలో ఈ చిత్రానికి సంబంధించిన మాంటేజ్ సాంగ్ చిత్రీకరణ గోవాలో జరుగుతుంది. ఎన్టీఆర్ను సరికొత్త పాత్రలో చూడటానికి ఆయన అభిమానులు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇటీవల దేవర పార్ట్ 1 గ్లింప్స్ను మేకర్స్ విడుదల చేయగా ఇండియా రేంజ్లో అది ఓ సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇండియన్ సినిమాలోనే ఎక్కువమంది చూసిన గ్లింప్స్ను అది సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. ఇంకా ఈ చిత్రంలో ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, టామ్ షైన్ చాక్కో, నరైన్ తదితరులు నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్స్పై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిరుద్ సంగీత సారథ్యం వహిస్తుండగా శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్గా, రత్నవేలు సినిమాటోగ్రాఫర్గా, సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైనర్గా వర్క్ చేస్తున్నారు.

## ది గోట్ లైఫ్ జీరో కాంప్రమైజ్డ్ ఫిల్మ్



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన ది గోట్ లైఫ్ (ఆడు జీవితం) సినిమా ఈ నెల 28న పాన్ ఇండియా స్థాయిలో మలయాళంతో పాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో థియేట్రికల్ రిలీజ్కు రెడీ అవుతోంది. ఈ సినిమాను బెన్యామిన్ రాసిన గోట్ డేస్ నవల ఆధారంగా అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ బ్లెస్సీ రూపొందించారు. విజువల్ రొమాన్స్ బ్యానర్ ఈ సినిమాను మలయాళ చిత్ర పరిశ్రమలో ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ గా భారీ బడ్జెట్ తో నిర్మించింది. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ది గోట్ లైఫ్ (ఆడు జీవితం) సినిమాను తెలుగు స్టేట్స్ లో రిలీజ్ చేస్తోంది. ఇవాళ ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, డైరెక్టర్ బ్లెస్సీ, హాలీవుడ్ యాక్టర్ జిమ్మీ జీన్ లూయిస్, మైత్రీ నుంచి నిర్మాత వై రవి శంకర్, శశి పాల్గొన్నారు. ఈ సందర్భంగాహీరో పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ - ఇటీవల వరదరాజ మన్నార్ అనే కింగ్ క్యారెక్టర్ లో సలార్ తో మీ ముందుకు వచ్చాను. ఇప్పుడు ది గోట్ లైఫ్ (ఆడు జీవితం) సినిమాతో నజీబ్ అనే స్లేవ్ క్యారెక్టర్ తో తెరపైకి రాబోతున్నాను. వరదరాజ మన్నార్ పూర్తిగా ప్రశాంత్ నీల్ ఇమాజినేషన్. కానీ ఈ సినిమా వాస్తవంగా జరిగిన కథ. నజీబ్ మన మధ్యే సజీవంగా ఉన్నాడు. 90వ దశకంలో జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వ్యక్తి అతను. ఈ ప్రయాణంలో తను ఎదుర్కొన్న కష్టాలను వివరిస్తూ రాసిన పుస్తకమే గోట్ డేస్. బెన్యామిన్ రాసిన ఈ పుస్తకం కేరళలో 2008లో పబ్లిష్ అయ్యింది. ఇది పబ్లిష్ అవగానే ప్రతి ఒక్కరి చేతుల్లోకి వెళ్లింది. అంత ఆదరణ పొందింది గోట్ డేస్. కేరళలో ప్రతి దర్శకుడు, హీరో, ప్రొడ్యూసర్ ఈ నవల హక్కులు తీసుకోవాలని ప్రయత్నిం చారు. చివరకు ఆ హక్కులను మా డైరెక్టర్ బ్లెస్సీ సాధించారు. అదృష్టవశాత్తూ నజీబ్ గా నటించే అవకాశం నాకు దక్కింది. 2009 ప్రారంభంలో ఈ సినిమాకు కమిట్ అయ్యాం. అయితే ఆ టైమ్ లో ఈ సినిమాకు కావాల్సిన బడ్జెట్ ఖర్చు చేయడం అసాధ్యంగా ఉండేది. పదేళ్ల తర్వాత 2018లో షూటింగ్ ప్రారంభించాం. అప్పటికి ప్రాంతీయ సినిమాల మార్కెట్ స్థాయి పెరిగింది. మలయాళ సినిమాలకు ఆద రణ పెరిగింది. 2019లో షూటింగ్ ప్రారంభించాం. జోర్డాన్ లో షెడ్యూల్ చేశాం. కేరళ పోర్షన్స్ కంప్లీట్ చేశాం. నేను ఈ సినిమా కోసం మొదట బరువు పెరిగి ఆ తర్వాత 31 కిలోలు తగ్గాను. బరువు తగ్గేందుకు ఒక షెడ్యూల్ తర్వాత 7 నెలల గ్యాప్ తీసుకున్నాం. ఇప్పటికి కూడా ఈ సినిమా బడ్జెట్ రిస్కు చేయడమే. మేము తిరిగి జోర్డాన్ లో షూటింగ్ స్టార్ట్ చేసేప్పటికి కోవిడ్ లాక్ డౌన్ వచ్చింది. మూడు నెలలు పూర్తిగా షూటింగ్ ఆపేశాం. మేము భారత్ కు తిరిగి రావడం కూడా కష్టమైంది. వందే భారత్ స్పెషల్ ఫ్లైట్లో ఇం డియా వచ్చాం. పాండమిక్ ఎప్పటికి ఆగిపోతుందో తెలియదు. ఏడాదిన్నర తర్వాత అల్జీరియాలోని టిము మౌన్ అనే ప్లేస్ లో షూటింగ్ స్టార్ట్ చేశాం. సహార ఎడారి మధ్యలో ఉంటుందా లొకేషన్. అక్కడికి ఏ సినిమా యూనిట్ వెళ్లలేదు. మా బ్లెస్సీ సార్ కు సినిమా పిచ్చి. ఆయన వల్లే మేమంతా అక్కడ షూటింగ్ చేయగలిగాం. బ్లెస్సీ సార్ తో మలయాళ ఇండస్ట్రీ ప్రతి ఆర్టిస్ట్ ఒక్క సినిమా అయినా చేయాలనుకుంటారు. అంత గొప్ప దర్శకుడాయన. అల్జీరియా తర్వాత జోర్డాన్ తిరిగొచ్చి మిగిలిన పార్ట్ షూట్ చేశాం. 2022 కల్లా షూటింగ్ కంప్లీట్ చేసి పోస్ట్ ప్రొడక్షన్ కు వెళ్లాం. ఏడాదిన్నర పాటు పోస్ట్ ప్రొడక్షన్ జరిగింది. ది గోట్ లైఫ్ (ఆడు జీవితం) సినిమా జీరో కాంప్రమైజ్డ్ ప్రాజెక్ట్ అని చెప్పాలి. ఒక్క ఫ్రేమ్ కూడా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ లో రాజీ పడకుండా రూపకల్పన చేశాం. చిరంజీవి గారి సైరా నరసింహా రెడ్డి సినిమాలో ఓ కీ రోల్ కోసం నన్ను అడిగారు. అప్పుడు ఈ మూవీ కోసమే ప్రిపేర్ అవుతున్నా అందుకే నటించలేకపోతున్నా అని ఆ విషయాన్ని ఆయనకు వివరించాను. ఆ తర్వాత లూసీఫర్ తెలుగు రీమేక్ గాడ్ ఫాదర్ ను నన్నే డైరెక్టర్ చేయమన్నారు. అప్పుడు కూడా గోట్ లైఫ్ సినిమా కంటిన్యూ చేస్తూ ఉన్నాను అన్నారు.

## టిల్లు స్క్వేర్ సెన్సార్ ఫార్మాలిటీస్ పూర్తి

డీజే టిల్లు చిత్రంతో టిల్లుగా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఈ చిత్రం యువత మరియు సినీ ప్రియుల్లో కల్ట్ ఫాలోయింగ్ను సంపాదించుకుంది. దాంతో ఈ చిత్రానికి సీక్వెల్ గా వస్తున్న టిల్లు స్క్వేర్ కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రకటనతోనే ఈ సీక్వెల్ పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. 'రాధిక', 'టికెటే కొనకుండా', 'ఓ మై లిల్లీ' పాటలతో పాటు ఇతర ప్రచార చిత్రాలు విడుదలై సినిమాపై అంచనాలను ఆకాశాన్నంటేలా చేశాయి. తాజాగా ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. దీంతో ప్రమోషన్స్ లో జోరు పెంచారు మేకర్స్. సినిమా చూసిన తర్వాత సెన్సార్ సభ్యులు, ఆద్యంతం వినోదభరితంగా ఉండే చిత్రాన్ని అందించడానికి చిత్ర బృందం చేసిన ప్రయత్నాన్ని మెచ్చుకున్నారు. ఈ చిత్రాన్ని వారు ఎంతగానో ఆస్వాదించారు. ముఖ్యంగా టిల్లు పాత్ర, అతను పలికే సంభాషణలు వారిని ఎంతగానో అలరించాయి. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి యు/ఎ సర్టిఫికేట్ ఇచ్చింది. 'టిల్లు స్క్వేర్' చిత్రం 'డీజే టిల్లు'ను మించిన విజయాన్ని సాధిస్తుందని మేకర్స్ ఎంతో నమ్మకంగా ఉన్నారు. టిల్లు అభిమానులతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా వినోదభరితంగా ఈ చిత్రాన్ని రూపొందించామని పేర్కొన్నారు. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటించింది. ఆమె తన కెరీర్లో తొలిసారిగా లిల్లీ అనే బోల్డ్ క్యారెక్టర్ను పోషించింది. ఇప్పటికే ఆమె పాత్రకి సంబంధించిన ప్రచార చిత్రాలు విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అప్పుడే అందరూ లిల్లీ పాత్రను రాధిక పాత్రతో పోల్చడం ప్రారంభించారు. అయితే ఈ రెండు పాత్రలు భిన్నమైనవని, లిల్లీతో టిల్లు ప్రయాణం కూడా విభిన్నంగా ఉంటుందని, థియేటర్లలో రెట్టింపు వినోదాన్ని మరియు రెట్టింపు మజాని అందిస్తామని మేకర్స్ చెప్పారు. సిద్ధు జొన్నలగడ్డ ఈ చిత్రానికి కథనం, సంభాషణలు అందించగా మల్లిక్ రామ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి సాయి ప్రకాష్ ఉమ్మడిసింగు సినిమాటోగ్రఫీ అందించగా, రామ్ మిరియాల, అచ్చు రాజమణి పాటలు స్వరపరిచారు. భీమ్స్ సిసిరోలియో నేపథ్య సంగీతం అందించారు.



## శ్రీకాంత్ ముఖ్యపాత్రలో ఈవీఎంల ట్యాంపరింగ్ పై కథ




కన్నడ హీరో కోమల్ కుమార్ హీరోగా, ఇండియన్ క్రికెటర్ శ్రీశాంత్ నెగిటివ్ రోల్ ప్లే చేస్తూ మన ముందుకు రానున్న చిత్రం యమధీర. శ్రీమందిరం ప్రొడక్షన్స్లో వేదాల శ్రీనివాస్గారు నిర్మిస్తున్న తొలి చిత్రంగా వస్తున్న సినిమా యమధీర. ఈ సినిమాలో నాగబాబు గారు, ఆలీ గారు, సత్య ప్రకాష్ గారు, మధు సూధన్ గారు తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఇటీవల ఈ సినిమాకి సంబంధించిన టీజర్ మరియు ట్రైలర్ సినిమా పైన అంచనాలను పెంచేస్తున్నాయి. నిర్మాత వేదాల శ్రీనివాస్రావుగారు మాట్లాడుతూ : ఈ యమధీర ఫిలిం ఈవీఎం ట్యాంపరింగ్ పైన చిత్రీకరించాము. అజర్ బైజాన్ కంట్రీలో ఎక్కువ శాతం షూట్ చేసాము. 100 సినిమాల్లో నటించిన కోమల్ కుమార్గారు క్రికెటర్ శ్రీశాంత్గారు ముఖ్య పాత్రలో నటించారు. అదేవిధంగా నాగబాబుగారు, అలీగారు, సత్య ప్రకాష్ గారు, మధుసూదన్ గారు నటించారు. టీజర్ అండ్ ట్రైలర్ పైన చాలా అద్భుతమైన స్పందన లభించింది. సినిమా పైన అంచనాలు పెరుగుతున్నాయి అదే విధంగా రోజురోజుకు థియేటర్లో పెరుగుతున్నాయి. చిన్న సినిమాలను సపోర్ట్ చేయడంలో తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ముందుంటారు. ఈనెల 23న ప్రేక్షకుల ముందుకి సినిమాను తీసుకురాబోతున్నాం. ఈ సినిమాని ప్రేక్షకుల ఆదరించి మంచి సక్సెస్ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు.



వాణికపూర్

## రావు రమేష్ మారుతీ నగర్ సుబ్రమణ్యం టైటిల్ సాంగ్



రావు రమేష్ కథానాయకుడిగా, టైటిల్ రోల్ పోషించిన సినిమా 'మారుతీ నగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. రావు రమేష్ సరసన ఇంద్రజ నటించారు. అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి, హర్షవర్ధన్ కీలక పాత్రధారులు. పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలపై ఈ సినిమా రూపొందుతోంది. బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మాతలు. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ ఫెంటాస్టిక్ రెస్పాన్స్ అందుకుంది. ఇప్పటి వరకు సినిమా చరిత్రలో ఎవరూ చేయని విధంగా ప్రేక్షకుల చేత క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి ఫస్ట్ లుక్ విడుదల చేసింది 'మారుతీ నగర్ సుబ్రమణ్యం' టీమ్. తాజాగా సినిమా టైటిల్ సాంగ్ విడుదల చేశారు.

*నేనే సుబ్రమణ్యం... మై నేమ్ ఈజ్ సుబ్రమణ్యం!*
*నాకు నేనే ఇష్టం... మీకేంటంట కష్టం"*

అంటూ సాగిన ఈ గీతాన్ని సెన్సేషనల్ క్రేజీ సింగర్ రామ్ మిరియాల ఆలపించారు. కళ్యాణ్ నాయక్ అందించిన బాణీకి అందరూ పాడుకునేలా చక్కటి సాహిత్యం అందించారు భాస్కరభట్ల. లోధా మ్యూజిక్ యూట్యూబ్ ఛానల్లో సాంగ్ రిలీజ్ అయ్యింది. సిని మాలో రావు రమేష్ క్యారెక్టరైజేషన్ వివరిస్తూ సాగిందీ 'మారుతీ నగర్ సుబ్రమణ్యం' టైటిల్ సాంగ్. చుట్టుపక్కల ప్రజలు సలహాలు ఇచ్చినా పట్టించుకోనని, తనకు అదృూఎష్టం తక్కువ ఉంది గానీ, త్వరలో మహారాజ యోగం పడుతుం దని చెప్పే పాత్రలో హీరో కనిపించనున్నారు. సోషల్ మీడియాలో ఎటు చూసినా 'నేనే సుబ్రమణ్యం' ప్రోమోకు నెటిజన్స్ వేసిన స్టెప్పులే కనిపిస్తున్నాయి. 'కచ్చా బాదాం' రీల్, స్టెప్పులతో వైరల్ అయిన అం జలీ అరోరా దగ్గర నుంచి తెలుగు అమ్మాయిల వరకు అందరూ రావు రమేష్ పాటకు తమదైన శైలిలో స్టెప్స్ వేస్తున్నారు. దాంతో ఈ సాంగ్ సెన్సేషన్ అయ్యింది. మారుతీ నగర్ సుబ్రమణ్యం దర్శక నిర్మా తలు మాట్లాడుతూ... "లుంగీలో రావురమేష్గారి లుక్ బావుందని వాట్సాప్, సోషల్ మీడియాలో ఎంతో మంది మెసేజెస్ చేశారు. ఆయన్ను చూస్తే నేటివ్ ఫీలింగ్ వచ్చిందన్నారు. సినిమా సైతం అలాగే ఉంటుంది. నేటివిటీతో కూడిన కామెడీ ఎంటర్టైనర్ ఇది. త్వరలో ట్రైలర్, సినిమా విడుదల తేదీలు వెల్లడిస్తాం" అని చెప్పారు.

## శ్రీరంగనీతులు చిత్రం నుండి లిరికల్ సాంగ్



సుహాస్, కారీకరత్నం,రుహానిశర్మ, విరాజ్ అశ్విన్ ముఖ్యతారలుగా రూపొందుతున్న చిత్రం శ్రీరంగనీతులు. ప్రవీణ్కుమార్ వీఎస్ఎస్ దర్శకుడు. రాధావి ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై వెంకటేశ్వరరావు బల్మూరి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఏప్రిల్ 12న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రాన్ని ప్రముఖ పంపిణీదారుడు, నిర్మాత ధీరజ్ మొగిలినేని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. కాగా ఈ చిత్రం నుండి ఎక్కడవుండాలని.. ఎక్కడున్నావో.. ఏమీ అవుదామని.. ఏమీ అయ్యావో.. అనే లిరికల్ సాంగ్ విడుదల చేశారు మేకర్స్. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటకు హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించారు. హరికా నారాయణ్ ఆలపించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ మానవ సంబంధాల గురించి, నేటి యువత మనస్తత్వాల గురించి, ప్రేమ గురించి కాన్సెప్ట్ ఓరియెంటడ్గా కొనసాగే పాట ఇది. యూత్ఫుల్ ఎంటర్టైనర్గా రూపొందుతున్న చిత్రంలో సినిమాలో వుండే ఆసక్తికరమైన కథ, కథనాలను ప్రేక్షకులను ఎంటర్టైన్ చేస్తూనే మనసుకు హత్తుకుంటాయి. కొత్తదనంతో పాటు పూర్తి కమర్షియల్ అంశాలతో రూపొందించిన చిత్రమిది అన్నారు. నిర్మాత మాట్లాడుతూ నేటి యువత ఆలోచనలు, కుటుంబ బంధాలు.. ఎంటర్టైన్మెంట్ ఇలా అన్ని అంశాల కలయికతో దర్శకుడు చిత్రాన్ని అందర్ని అలరించే విధంగా తెరకెక్కించాడు. తప్పకుండా చిత్రం అందరి ఆదరణ పొందుతుందనే నమ్మకం వుంది. ఏప్రిల్ 12న చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నాం అన్నారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.